UNIVERSAL LIBRARY
OU_204139
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T84/N21T Accession No. T2377

Author తెన్నేటి రామకృష్ణ

Title తెలుగు లేఖలు

This book should be returned on or before the date last marked below.

# తెలుంగుతీరులు

(సాహితీ వ్యాససంపుటి)

●

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు:

తెనాలి రామకృష్ణుని తెనుంగు కవిత.

★

శ్రీ దివాకర్ల వేంకటావధాని:

విజయవిలాసము.

●

ప్రచురణ:

తెలంగాణా రచయితల సంఘం,

జనగామ (శాఖ).

ప్రతులు: 1000 1953 సెప్టెంబరు

సర్వోదయ ప్రెస్.
మహంకాళివీధి,
సికింద్రాబాదు.

వెల: 1—4—0 (ఐ. జి.)

## తొలినుడి

ఉత్తమ సాహితీ ప్రచురణ తెలంగాణా రచయితల సంఘం ప్రధానాశయాలలో ఒకటి. కేవలం నవ్యసాహితిలోని మేలినిగ్గులను ప్రకటించడమే కాకుండా, ప్రాచీన సారస్వత రత్నాకరంలో ప్రభవించిన అమేయ రత్నాలను ప్రజాకోటిదాకా ప్రసరింప చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణా రచయితల సంఘం **జనగామశాఖ** పక్షాన ఈ వ్యాససంపుటిని ప్రచురిస్తున్నాము. ఇందులోని వ్యాసాలు ఆంధ్రసారస్వత పరిషత్తు జనగామశాఖ వార్షికోత్సవాల సందర్భాన చదువబడినవి. వీటిని ప్రచురించడానికి దయతో అంగీకరించిన శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులుగారికి, శ్రీ దివాకర్ల వేంకటావధాని ఎం. ఏ. (ఆనర్సు) గారికి మా కృతజ్ఞతాభివందనాలు. ఈ పుస్తకం ప్రచురించడానికి కావలసిన నిధి సహాయంచేసిన శ్రీ డి. నారాయణరెడ్డి గారికి సంఘం సర్వదా కృతజ్ఞి. జనగామశాఖలో మొదటిసారిగా మొగ్గ దొడిగిన ఈ ప్రథమ ప్రసూనాన్ని ఆంధ్ర మహాజనులు ఆదరంతో అందుకుంటారని ఆశిస్తున్నాము.

ఇట్లు

**కార్యదర్శి**

**తెలంగాణా రచయితల సంఘం**

జనగామశాఖ.

**15—9—53**

# తెన్నాలి రామకృష్ణుని తెనుఁగు కవిత

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు.

# తెన్నాలి రామకృష్ణుని తెనుఁగు కవిత

★

ఉ॥ చాటుకవిత్త్వ తత్త్వరస సాగర పారగు లయ్యు సత్కవుల్
పాటిగఁబట్టి విందురొక పాటివి గావన కన్య కావ్యముల్
కైటభవైరియావతి శిఖామణి శ్రీపతి పేరురంబునన్
మాటియు నీటికెంపు బహుమానముగం బదకంబు సేయదే?

(పాం. మహాత్మ్యము)

ఇంతదూర మిట్టిపాటి గౌరవముతో నన్ను నాహ్వానించినందులకు మిత్రులకు నమస్కారములు. ఇచట యుపన్యసించవలసినదని వారాజ్ఞాపించినప్పుడు నాయభిమాన కవులలో నొకడు తెన్నాలి రాముని గురించి పలికెదనన్నాను. వారును నాప్రార్థనకు సంతోషించి "అట్లే కానిమ్మ"నిరి. దానితో "తీర్థంబును, స్వార్థంబును, జాదుఱందేవర ప్రసాదంబైనది" లెమ్మనుకొన్నాను.

తెనాలి రామలింగడా లేక రామకృష్ణుడా? అతడు వ్రాసిన గ్రంథము లెన్ని? అతని వాసస్థానమేది? కృష్ణదేవరాయల యష్టదిగ్గజములలో రామకృష్ణున కొక స్థానముండెనా లేదా। ఉన్నచో వాడేవైపు సింహాసనముపై గూర్చునెడివాడు-ఇత్యాదులు కొన్ని వత్సరముల క్రిందటివరకును రామకృష్ణునిపై గురిసిన విమర్శధారా పాతములు. ఈ వెర్రివేలమునకు స్వస్తిచెప్పి యాతని కవితారీతులపైపును, కథాసంవిధాన వైచిత్రివంకనూ తెలుగువారి దృష్టి మరలించిన మనస్వి—తొలుత శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారే

ఈకవి రామలింగడుగా నున్నపుడు "లింగపురాణము"ను బిదప "ఘటికాచల మహాత్మ్యము"ను వ్రాసెనని చెప్పుదురు ఈ రెంటిలో "ఘటికాచలమహాత్మ్యము"ను మాత్రము ఎప్పుడో చూచినట్లు జ్ఞాపకము. కవి తొలుత స్మార్తుడుగానుండి తరువాత వైష్ణవమును స్వీకరించినవాడు ఇతడేకాడు—ఆకాలమున చాలమంది యీపని చేసిరి ఇందుకు ప్రబల కారణము—ఆనాడు విజయనగర ప్రభువులు వైష్ణవము నాదరించుటయే. అందునను విజయనగర సామ్రాజ్యము చరమదశలోనున్న "ఆరవీటి" ప్రభువులది "వెఱ్ఱిశైవము" వంటి "వీరవైష్ణవము". తెనాలిరామకృష్ణుని కాలమందుండిన వెంకటపతిరాయల యాస్థానమున తిరుమల తాతయ్యగారి ప్రతాపము మూడుపూవులు, ఆరుకాయలుగ నుండినది ఈ విషయము నాటి విదేశ రాయబారుల వ్రాతలు చూచినచో స్పష్టముగ దెలియును; గనుక—వీరవైష్ణవము విజృంభించునాళ్ళలో నున్న—తెనాలికవి గూడ వైష్ణవముచే నాకర్షింపబడియుండును. అందునను—"మధ్యవైష్ణవము" గనుక దాని యుద్ధతియు నెక్కువ.

"చిలువాయనపు వేల్పు కొలము గొల్వక వాసుదేవు నారాధించు తెలివి" చాల దుర్లభమట—అంతేగాదు, పాండురంగ మహాత్మ్యమున అవసరమువచ్చిన చోటంతయు "తిరుమజ్జనము". "తిరుమేను" మొదలగు శబ్దములు వైష్ణవుల "పణ్యారంపు పుణ్యంపు కంపుల"వలె తడి తావు లీనుచుండును. అల్లసాని పెద్దనయు వైష్ణవుడే. అత డహోబిల మఠపు శిష్యుడు, కాని యతనికి వైష్ణవాభిమానమెంత యున్నను అద్వైత వాసనయు పూర్తిగ వదలినట్లు కన్పడదు. తెన్నాలికవికి మాత్రము బొత్తిగా వదలినది. అతని స్తుతులయందే—అనంతుడు, విష్వక్సేనుడు, గరుడుడు ప్రత్యక్షమగుదురు. అసలీపద్ధతిని తొలుత నారంభించిన వాడు రాయలే కాని నాకొక సందేహమేమనగా తిరుమల తాతా

చార్యుల మూర్తి యంత గొప్పగానున్న కాలములో రామకృష్ణుడు తెంగల గురువు నాశ్రయించుటకు గారణమేమని ఆసంశయమిప్పటికిని దీఱలేదు.

రామకృష్ణుని యోగ్యతలు చాల గొప్పవి. కాని అట్టి యోగ్యతలు కలవారానాడు చాలామంది. మనకు నేడనేక దురభ్యాసములు. ప్రతి యొకడును నాలుగు పద్యములు సులక్షణసారమందు కంఠస్థముగవచ్చిన వెంటనే శృంగార కవిత్వములకు మొదలుపెట్టును. ఎట్టి చెత్తనైనను కవిత్వముపేరిట చెలామణీ చేయు—చొట్టు—అర్ధణా పత్రికలు కుప్పలు తెప్పలుగ నున్నవి మరింకేమి కావలెను? వర్ధమానుడును ఆంధ్రాంగ్లముల కలగాపులగపు స్వరూపమును నగు—మహాకవి రొట్టెవిఱిగి నేతిలో బడినట్లే, ఆ పత్రికలకు - ఈ కవితలు వేసికొనకున్న పేజీలు నిండవు. ఇది వ్యాకరణమున అన్యోన్యాశ్రయ దోషమున్నట్లు—ఉపకారోపకారకభావ సంబంధము. ఈ దుమారములో కొంత కష్టించి వ్రాసినవారినిగూడ పుష్టికరింపకపోవుటయు గలదు.

ఈకాలమునందు అనేకులు పెద్దవారిలోగూడ గనపడు నొక దొడ్డ దౌర్బల్యము—దండిగా వ్రాయవలెనను నుబలాటము నామాట విను మంచి డాక్టరెవరైన నున్నచో ఈ విచిత్ర రోగమును త్వరలో మాన్పు మందేదైన గనిపెట్టుమని ప్రార్థేమపడి యుందును ఒక కవి కవిత్వము నకు వెల—దావి "బృహత్కాయము"ను చూచి కట్టువాడు "రసిక ప్రభువుడు!"

పూర్వులయందీ యలవాటు విరుద్ధముగ నుండెడిది వారెక్కువ చదువుకొనెడివారు. తక్కువ వ్రాసెడివారు. ఆ వ్రాసిన కొంచెమును ఎంత బాగుగ వ్రాయదగునో అంత బాగుగ వ్రాసెడువారు. కొందరు వ్రాయనే వ్రాయరు. ప్రాచీనకాలమున ఘనముగ వ్రాసినవాడు కవిబ్రహ్మ యొకడే! అతఁడంనుకై పుట్టిన యవతారపురుషుడు. శ్రీనాథుడుగూడ—

అతని జీవితమున గల్గిన యొడుకు దుడుకులతో నన్ని రచించెనేగాని లేకున్న నొకటి రెంటితో ముగించుకొనెడివాడే. అతడన్ని వ్రాయుట మనభాగ్యమే యైనది. అల్లసాని పెద్దన, తిమ్మన, సూరన్న, రామరాజభూషణుడు మొదలైన మహాకవులందరు నొకటి రెండల్లిరేగాని బండ్లగొలది వ్రాసినవారుగారు. వారి కోవలో జేరిన మన రామకృష్ణుడుగూడ నంతే మన కాలమున కవులు-తక్కువగ జదువుదురు. యెక్కువగ వ్రాయుదురు ఆ వ్రాసిన కవిత లెవ్వరును జదువరు-ఇక వాని ప్రచారమునకై వారు బడు తికమకలు వర్ణనాతీతములు ఈ బాధకు కారణమేమనగా నాడు దోమనదిది వారికి జీవితమునందు గళ యుండెడిది. నిత్యజీవితము కళావిలసితమై యుండుటచే వారి యాసక్తి—యభిరుచి చాలమట్టుకారీతిఁ బరితృప్తమగుచుండెను. ఆనాళ్ళలో ఊరూరను—నేవో గోష్ఠులు, సభలు చర్చలు సాగెడివి వానిమూలమున కవుల, పండితుల ప్రతిభలు గద్దకు వచ్చుచుండెను. కావ్యము వ్రాయని భావుకుని జీవితము వ్యర్థమైపోయెనని విలపించువారు నాడు తక్కువ. ఈనాడు మన మందుకు నేరుగా విరుదము.

రేషనింగు బియ్యమునకు ప్రాకులాడుటకే ప్రొద్దులు చాలని మనకును, కళకును నేమి సంబంధము? నక్క యెక్కడ నాగలోక మెక్కడ ఈ కడుపుగొడవలో గోష్ఠు లెవరికి గావట్టినవి. మన గృహిణులుగూడ మనకు దగినవారే తయారైనారు. వాకింద్లముందు ముగ్గులు పెట్టుట వారికి మోటుతనము. పెండ్లినలుగులలో నక్కలాకుల బర్రేగాని యొక్క పాటైనను బాడికొనరు అట్లు పాడుట ఛాందసమను నొక రోగము కూడ మన నాగరికత దిగుమతిచేసిన సరుకు వారికి హాయిగా దమలపాకుల చిలకలు గట్టుటకు రాదు. ప్రొద్దున లేచినది మొదలు వారికి—పదిగంటల కాఫీసునకుబోవు మగని కేమి వంటచేయవలెనన్న

కూటిచింతయే. ఇక జీవితమున కళయేదీ? అందువలన కవికి దిక్కు తోచదు. వాడూరక వెఱ్ఱికిబెట్టుకొని వ్రాసి మనలను జంపుచుండును.

తెన్నాలికవి "పరమపదనాథ విరవధిక కృపాపరిపాక పరిచిత సరసకవితా సనాథు"డట. ఆతని పరమపదనాథుడును అతనివంటి హాస్య ప్రియుడే! ఈవిషయ మాయన వేషమే చెప్పుచున్నది ఆ కృష్ణునకు మంచి వెడదలగు కన్నులున్నవి. వేళ్ళతల వలపించు వెరవులున్నవి. మంచి పింఛెమును జెరివినాడు. ముప్పంక మురుపుతో—మురళితో—చూపులకు ముచ్చటైనవాడు. ఇన్ని యుండియును పాపము దిస్స మొల యేనట. ఒక్కొకసారి "కడారవటుడై" గనుపించును. చిప్పకాకటియు నాకృష్ణునకు రామకృష్ణుడు నేర్పిన యొక సౌందర్యము. ఎన్ని యేండ్ల నుండి పట్టుకొన్నాడో—యా పాళ్ళత చిక్కము నొకసారియైనను వదల దా పరబ్రహ్మము. గ్రిచ్చకాయలో మద్దికాయలో యాకృష్ణుని సొమ్ములు. ముక్కున ముంగర ముత్యము కదలుచుండవలసినదే. ఒకవేళ పాండు రంగడు నడచినచో "పుటపుటనై యున్న చిన్ని బొజ్జను గదలుచు భక్తులతో" రంగడేగాదు నేనుగూడ నున్నాన"ని హెచ్చరించుచుండును ఇట్లీకవి సృష్టించిన కృష్ణమూర్తి నూహించికొన్నపుడు—నా భావనలో రామకృష్ణకవికి నకలుమూర్తియే గోచరించును.

ఇక నాదైవమును కవి సంబోధించు రీతులుగూడ పలుపలురకములు. ఒకసారి "నందులేబట్టి" యని సామాన్యముగ ననును. ఒకపరి "దేవకీతర్ణకమ"ని గోకులమందున్న దూడలతో గోపాలకృష్ణునిగూడ లెక్కవేసి మాటాడును. ఇంకొకసారి "అఖిల విగమౌఘ గిరి గుహా హరి పృథుక"మని యేమో గంభీరముగ నతని గొప్పను చెప్పును. మరల నొకపరి "ఎన్ని కల్పంబులరిగిన యేనయేండ్ల—వెలయు పాళ్ళ యంబుగల కొయ్య విఠలయ్య" అని కుండ బగులగొట్టినట్లు రహస్య

ఘును విప్పి చూపి—కృష్ణుని పరిహాసమును జేయును. లేక విసుగును జూపించును. ఆ కృష్ణునివలెనే ఈ రామకృష్ణుడును. అవిదితగతిః ఈ పరమపదనాథుని యుపాసనయు రామకృష్ణునినాటికి దెనుగుదేశమున నింకను బాగుగ ప్రాకలేదు. కృష్ణరాయలొక్కమారు పండరికిపోయి వచ్చినటుల చరిత్ర యున్నది. అతని కా దేవునిపై భక్తి ప్రపత్తులుం డుటకు గురు తారాయలు గట్టిన విఠ్ఠలాలయమే! రామరాయలకును పాండురంగనితో సంబంధమున్నట్లేవో కథలున్నవి. ఎవరికో అక్కడక్కడ నొకరిద్దరికి పండరినాథునిపై కన్నున్నను ప్రజాసామాన్యమునకా యుపాసన తెనాలికవినాటికి బాగుగా పాదుకొన్నదిగాదు. తాత తాతలనుండి రామభద్రుడు తెనుగులకు నచ్చిన దైవము. కృష్ణరాయలకు "విఠ్ఠల సంప్రదాయము" సోకుటకు గారణమున్నది. అతని కాలము నందును అంతకు కొంత పూర్వమును వైష్ణవముదే ప్రథమతాంబూలమైనను. దానిప్రక్కలో ద్వైతముగూడ యొదిగినది. రాయలనాడే వ్యాసరాయలు, కనకదాసు, పురందరులు మొదలగువారుండిరి వీరందరు ప్రధానముగ పాండురంగని యుపాసకులే. వెంకటపతిరాయలకాలమున ద్వైతులలో సామ్రాజ్యముతో నాంతరిక సంబంధముగలవారెవ్వరును గనుపింపరు. మఱి వైష్ణవుల శిష్యుడైన తెన్నాలికవికీ ద్వైతవాసనయెట్లు పట్టెనో! అతడొక చిత్రపురుషుడు.

రామలింగకవి యోగ్యతలు చాల గొప్పవని ముందే మనవి జేసితిని. అవేవియో కొంచెము చదివిచూతము. తాను "కవిజన సహకారావళీ వసంతోత్సవ సూక్తినిధి" యట. అంతేగాక "తగ సంస్కృతము దెనుంగుగ జేయఁ దెనుగు సంస్కృతముగ జేయుటలో చతురమతి" నయదెలుంగుల నెన్నగల కావ్యధారలయందు ఘనుఁడు. "ఆశువునందుఁ గరము మేటియైనవాడు." "అఖిలభూమీపాలకాస్థాన కమలాకరోదయ

తరుణ సూర్యోదయుఁడును." ఇదే భావమును శ్రీనాథుడుగూడ, "కర్ణాట కటక పద్మ వనహేళి శ్రీనాథభట్ట సుకవి." యని చెప్పికొన్నాడు. ఆనాడు కవిచక్రవర్తులకు—కర్ణాటదేశమొక గాఁదిసేలఁగ నుండెడిది. ఇతరరాజుల కడ నెంత పేరుమోసినవారైనను విజయనగర సభలో శక్తిని ప్రద ర్శింపనిది—వాని యోగ్యతకు సార్థక్యము లేదు. "శైవ వైష్ణవ పురా ణావళి నానార్థములు దనకుఁ గరతలామలక నిభము"లట "అఖిలకావ్య రస సుధామండల కుండలుఁడ"ట. ఆతనిని బిలపించి విరూరి వేదాద్రి మంత్రి—

మ॥ ఉదయం బస్తనగంబు సేతువు హిమ వ్యూహంబునుం జుట్టిరా
విదితంబైన మహిన్ మహాంధ్ర కవితా విద్యాబల ప్రౌఢి నీ
కెవరేరీ! సరసార్థబోధ ఘటనా హేలా పరిష్కార శా
రద నీరూపము రామకృష్ణకవిచంద్రా సాంద్ర కీర్తీశ్వరా!

అని పొగడి—"కనకాంబరాభరణముల"ను ప్రసాదించినాఁడు. దాని నందినతోడనే మహాకవినుండి—భారతీదేవి యావిర్భూతి యెంతచక్కఁగ నవతరించినదో చూడుడు—

మ॥ పలుకుందొయ్యలి మోవికాంతి కెనయౌ బాగాలు నయ్యంతి చె
క్కుల బోలుం దెలసాకు లయ్యెడద పల్కుల్వంటి కప్రంపుఁ బ
ల్కులతో గూడిన వీడియంబొసగె నాకున్ పద్మనాభార్చనా
కలనా పావనహస్త కంకణ ఝణత్కారంబు తోరంబుగన్॥

అని వర్ణించెను.

వేదాద్రిమంత్రి "శారద నీరూపము"నగా—నాముక్కనే తన పద్యకల్పనమునకూతఁగ గొనుటలో నాతనిమాట నిజమేనని కవి

యూకొట్టినటులైనవి. ఈతని రచనాసంవిధాన మిట్టేయుండును. ప్రబంధ కవులందరును—కొంచెముగనో—గొప్పగనో ఋతువులను వర్ణించిన వారే? ఆముక్తమాల్యదను రచించిన రాయలు, ఋతువర్ణన చాల చాల అవిపించునంతవరకు జేసినాడు. కాని యింత చేసినను వారు ప్రస్తుతకథతో వానికెక్కడో నొక ముక్కతోదప్ప సంబంధమును గలుపరు. అందుచే నా ఋతువర్ణనమును ప్రస్తుతకథయు "తీర్థమునకు తీర్థము—ప్రసాదమునకు ప్రసాదమై" యుండును. ఈతడట్లుచేయలేదు చతుర్థాశ్వాసమున రాధాదేవి తపమొనరించుచోట రామకృష్ణుడు ఋతువులనువర్ణించినాడు. వానిని వరుస బెట్టి బూరగబట్టినట్టు చెప్పక ప్రతి ఋతువర్ణనమునకు ప్రస్తుతకథతో సంబంధమతుకుచు పోవును. చూడుడు, "సీతువేళ"లందు—వానలచే దడిసిన "కమల వనలక్ష్మి" హరిధ్యాన నిమీలిత లోచనయైన రాధావధూటి "కనుగల"మైయుండెనట. ఆ తరువాత "జితహేమంతము""వసంతము" వచ్చినది. ఆయామిని— "నీలాంజనవర్ణుగోరి దపమొనరించు మృగాక్షి వలె"నుండెను. "వేసవికైపు"కొంత సడలినంతనే "కారుకాలము"దళమై వెలసెను. ఆకాలమును రాధాదేవి "మోవిచెలువంబుఁ గేదంగి బూవురేకు సోయగముసూపు కన్నుల సొబగుఁ జికుర బర్హిబర్హప్రభయు" జూపి ప్రతిఘటించినదట. వర్షాసమయములందు రాధాదేవికి రాసనాయకుడు ప్రత్యక్షమై ఆమె నర్థశరీరమువలె బ్రోచినాడు. పిదప—

క॥ నీలాంజనవర్ణుడు రా
ధా లీలావతిని చెనగి తనరెడు కరణిఁ
గాలము శరత్సమాగమ
హేలా సౌభాగ్యగరిమ నేపు వహించెఁ॥

అని శరత్తును కవి వర్ణించెను. దిఙ్మాత్రముగ మీకు నొక్కొక్కటి యెత్తి చూపితి నంతే. ప్రతి ఋతువును వర్ణించునెడలను—రెండు

మూడుసారులైనను అతడు—ప్రస్తుత కథతో దానికి సంబంధము గలుగును. అట్లు చెప్పుట పెద్ద యౌచిత్యము. మనముగూడ నాపద్ధినాధారాపాతమున మేను మరచి ప్రస్తుత కథను బూర్తిగ విస్మరింపకయుందుము. అది యట్లుండె—

పైని చెప్పికొన్న—తెనాలిరామలింగని యోగ్యతలు—గుండెలు పట్టికొని అబ్బా! యననంతగ నేమియు లేవు. అప్పటి కొంత కొంత కవుల పాండిత్యములు విన్న—మహోభయంకరములుగ నుండును.

పట్టుమూర్తి—"ఏకైకదిన ప్రబంధ ఘటికా సద్యఃకృత గ్రంథకల్పను"డట. ఇంకను అతడు నరసభూపాలీయమున చెప్పికొన్న—బిరుదులజాబితా తెగబారెడున్నది. నరసభూపాలీయమున నంత బ్రహ్మాండముగ బిరుదులెక్కించిన రామరాజభూషణుడే తరువాత వసుచరిత్రలో ఆ పూర్వ బిరుదముల దడవినవాడేగాడు. కాలముగడచి "కవీశ్వరుడు" రససిద్ధుడగుకొలదియు—నీ చిన్నచిన్న చాపల్యములపై—నభిరుచులు తగ్గిపోవును. అందుచేత—తెన్నాలిరామకృష్ణునికా యోగ్యతలన్నియు లేవని యర్థముగాదు. "పాండురంగమాహాత్మ్యము" అతని జీవితము బాగుగ పక్వమైనపిదప వ్రాసిన గ్రంథము గదా! అందుచే నట్టి చిల్లర యోగ్యతల దడవుట పిల్లతనమనుకొనియుండును. లేకున్న—అలంతి—యలంతి పాండిత్యములతో నాతడు "అఖిల భూమిపాలకాస్థాన కమలాకరోదయ తరుణ సూర్యోదయుడై" యుండడు. నేటి యాంధ్రలోకమున నెవ్వఁడేమాటయైన వాడవచ్చును. ఏబిరుదునైన నుంచుకొనవచ్చును. "ఇదియేమి"ని యడుగు పెద్దమనుష్యుడు లేడు ఒకవేళ నడిగినను—నాయిష్టము—నీకు దోచిన బిరుదము నీవుంచుకొనుమని వాడు పలికెడు బదులు. ఎవనికివాడు గండర-గండడై—"గురుకులక్లిష్టు"డైన మురారి కవిని చంపి పుట్టినట్లే మాట్లాడును. కొన్ని సంవత్సరముల ముందొక

కవి ప్రతాపవంతుడై పగటి దీపములతోఁ బోరాడెను. ఈరీతి నేటి యాంధ్రకవి మార్గము—అందచందములు లేని అంకాళమ్మ తిరునాళ. ఆనాడట్లు బోనిచ్చెడివారుగారు. ఒకదొక బిరుదుంచుకొన్నచో—నీకిది యెట్లు సార్థకమని నిలువదీసి యడుగుచుండిరి. వాడు వానికి సమాధాన మిచ్చి—తన బిరుదు నిల్పుకొనవలెను.

"అగ్రే డిండిమ తాండవం తత ఇతో వందివ్రజో ద్ఘోషణం
ద్వితా్రి శ్చిత్రపటాః కియంతి బహుధా హృద్యాని పద్యానినః
ఆస్తాంతావదిదం మహేశ మకుటీ కోటీర కల్లోలినీ
కల్లోల ప్రతిమల్ల సూక్తి విభవైః ద్వేష్యాన్ విజేష్యా మహేః"

అన్న డిండిమకవులు—స్వశక్తితో పాండిత్యముతో మూడు నాలుగు తరములు డిండిమమును నిల్పికొన్నారేగాని—రాజాశ్రయముతోగాదు. ఆయోగ్యత దమలో లేవినాడు వారిపాలిటికది పనిలేని బరువుగనే గనుపించినది. శ్రీనాథుడు డిండిమమును బగులగొట్టించినపుడు—రాజనాథ డిండిముదేమియు నొప్పిజెంది యుండదని నాతలపు. సమర్థుడగువాని కొక గౌరవము గలిగినపుడు తక్కినవారు సంతోషించిన రోజులవి. అసమర్థులు—తమకుఁదగని గౌరవమునకై అఱ్ఱుసాచని వినయశీలము, ఋజుమార్గమునైన జాతి యానాడుండెను. సమర్థులలోఁ బరస్పరము స్పర్థలు—కక్షలుండెడివి. ఆ కక్షలైనను యోగ్యతా సంపాదనమునందే. అనాటి యభిరుచికి శ్రీనాథుని యీక్రిందిపద్య ముదాహరణము.

ఉ॥ కంటికి నిద్రవచ్చునె సుఖంబగునే రతికేళి జిహ్వకున్
వంటకమిందునేః యితర వర్తనముల్ పదివేలు మానసం
బంటునెః మానుషంబుగలయట్టి మనుష్యున కెన్నదేనియున్
గంటకుడైన శాత్రవుడొకండు దనంతటివాడు గల్గినన్॥

రామకృష్ణుని గొప్పతనములలో — విచిత్రమై — యాకాలమున సామాన్యముగ నితరులలో గనబడనిదొకటి యున్నది. తెలుగును సంస్కృతమునకును, గీర్వాణమును దెనుగునకును మార్చుటలో తాను మేటియట

పింగళి సూరన్న వన ప్రతిభలలో—

శా॥ రెండర్థంబుల గావ్యమొక్కటియు నిర్మింపంగ శక్యంబుగా
కుండుఁ దద్గతిఁ గావ్యమెల్ల గనగా నోహో యనం జేయదే...

అని వచించెను. అది యానాడాతని ప్రత్యేక శక్తి. వేములవాడ భీమకవి ద్వ్యర్థికావ్య మంతకు ముందె—నామరూపములు లేక నశించినదిగదా! అట్లే పైజెప్పిన యోగ్యతయు—రామకృష్ణునికిఁ బ్రత్యేకమైనది—నేడు సంస్కృత కవిత్వమును చక్కఁగ వ్రాయగలమని చెప్పుకొనువారిలో—చాలమంది యా కవిత్వ స్వభావమును దెలియనివారే. సంస్కృతకవిత్వ మనగా వెదురుగడవంటి నిక్కన సమాసమును గ్రుక్కు త్రిప్పక నాల్గు పాదములు నిండించి కడపట—ధావతి యనియో—రోదితి యనియో యదికించి—యింక బొమ్మనుటగాదు. లేక పాణిని వ్యాకరణమునుండి—పది యజ్లుగంతములనో—ఇరువది సన్నంతములనో ప్రతివాది భయంకరముగా బలికి చరితార్థులమైనా మనుకొనుటయుగాదు ఆ భాషా జీవమును గమనించి—రచనసేయుట చాల దుర్ఘటము. ఒక్క సంస్కృత కవిత్వమేగాదు—ఏభాషాకవిత్వమైనను దానిని లోతులు దడని యెలయించుట—యే యదృష్టవంతులకో లభించు రసపాదవిద్య. అట్టియెడ సంస్కృతశ్లోకము చెప్పినదానిని దెనుగునకు మార్చుటయు దెనుగు నుండి సంస్కృతమునకు మార్చుటయు ఆరెండు భాషాతత్త్వములను గూలంకషముగ దెలిసిననేదప్ప సాధ్యముగానిపని.

ఆశువు రచించుటయు నంతే. చాలమందికవు లిప్పుడును ఆశువు చెప్పగలుగువా రున్నారు. కాని యాశువును సామర్థ్యముతో నిర్వర్తించుటకు గొప్ప భావన, పెద్ద వ్యుత్పత్తియు గావలెను. భట్టుమూర్తి కనేక నిఘంటువులు నోటికి వచ్చెడివట. వ్యుత్పత్తివిషయ మెత్తికొన్నచో ప్రాచీనులొక్కొక్కడు మేరుపర్వతములవంటివారు. ఆ వ్యుత్పన్నత మనము పది జన్మలకైనను సాధింపలేనిది ప్రాచీన కవులలో సంస్కారహీనులు కొందరైనను గనబడుదురేమోగాని—యవ్యుత్పన్నులుమాత్రము చాల నరుదు మన కివినే యుదాహరణము దీసికొందము. శైవవైష్ణవ పురాణములన్నియు వాని గొనవ్రేళ్ళ నుండెడివి. అతని పాండిత్యము దెల్పుటకీ యొక్కటి జాలును

ప్రాచీనకవులలో శాస్త్రపాండిత్యము లేక కలముబట్టిన దెవ్వరును లేరు. అధమపక్షము రెండుశాస్త్రములైనను వారు క్షోదక్షమముగ జదువుచుండిరి. అలంకార వివేచనమునుగూడ శాస్త్రముక్రిందికి మార్చినఘనులు వారు. భామహాచార్యులనాడు కేవల మలంకారముల స్వరూప వివేచనముతోనే యిది యారంభమైనను—దీక్షితులకాలమునాటి కన్ని శాస్త్రములకు—అలంకారములు సమరరంగ మైపోయినవి.

తెన్నాలి రామకృష్ణుని కావ్యమును బరికించి చూచినప్పుడు—అతడు మంచి తార్కికుడై యుండునని తోచును వాక్యశాస్త్రముతో బాటు—పదశాస్త్రము యొక్క పారమునుగూడ జూచినవాడా శబ్దమూర్తి. సాధారణముగ తార్కికులకు సర్వాంగములను నోరే క్రోసిరాజనును. అంతేగాక రామకృష్ణుడు హాస్యప్రియుడుగూడ. జీవితమున బొత్తిగాలేని హాస్యము కవితకెక్కదుగదా! ఆగుణమే యాతని మహాపరాధమైనది. తెనుగులో "పరమానందయ్య" యను "పాండురంగమాహాత్మ్య" కవి కథలకే పరివారము. వానిలో కొన్ని కేవలము రసాభాసములై—పామర

జన రంజకములైనను—ఆకవి కీర్తికి మాత్రము చాలభంజకములుగా నున్నవి. ఆతడు తన జీవితములో కొన్ని వినోదములు జేసియుండ వచ్చును. వాని నవకాశముగ దీసికొని "కొంటెపోఁడంగులు" కొందఱు తమ హృదయములందలి యనాగరక భావములకు కథాస్వరూపమిచ్చి "అనిష్టముల కంగారకు"డని వానినెత్తిన ద్రోసియుంచురు. ఎవఁడో ఒక పెద్దవాని పేరఁబెట్టినచో వేనికైనను ప్రచారము సులభముగవచ్చును. సామాన్యులు వానిలోని గుణదోష విచికిత్స చేయ వెఱతురు. సంస్కృత సాహిత్యమున కాళిదాసునిపేరిట కొన్ని యసహ్యకర రచన లున్నవి. వానిలో "రామకృష్ణ విలోమకావ్యము"ను ఒకటి కొందఱు చారిత్రకులు అమాంతముగ బరిశ్రమించి—ఆ భాషలో సుమారేడుమంది కాళిదాసులకు పురుడుబోసి దీర్చినారు. మనపీడ వదలినది. కాని యాంధ్రభాషావధూటి కదృష్టము వక్రించి—మనకు రామకృష్ణుడొక్కఁడే మిగిలినాడు నామనవి యేమనగా నిట్టి తల తోక లేని కథలను నమ్మవలదని ఈకథాప్రవాదము లనెడు ప్రాచిని దొలగించి చూచినచో పండితుడుగా—కవిగా మాత్రమే గాక తత్వవేత్తగా, మనుష్యుడుగా రామకృష్ణుడు చాల గొప్పవాడు.

మంత్రశాస్త్రమునందు—తెన్నాలికవి కసామాన్య పాండిత్యముండె ననుట కాతని గ్రంథమే సాక్షి. ఇంకను కొంత లోతుగఁ జూచినచో తెన్నాలికవి మహాయోగి సాధారణముగ భక్తులకు వచ్చినంత ప్రచారము యోగులకు రాదు! వారు జ్ఞాన ప్రచ్ఛన్నులై—యంతర్వాహినియగు సరస్వతీనదివలె నుందురు. తిక్కన్ననుగుఱించి యనేకులు విమర్శించు చుందురు. అతనిని మహామంత్రి యందురు. కార్యశూరుడందురు. కదన రంగములందు కత్తిబట్టియుండునని యూహింతురు. సోమయాజియై బ్రాహ్మ్యమగు ధర్మమునునిలిపిన బ్రహ్మయందురు. పదునైదుపర్వముల మహాకవిత్వము నేకధాటితో నిర్వహించిన రస స్రష్టయని—చంకఱ

దాటింతురు. ఇవన్నియు సత్యమేగాని—ఈ సర్వమును కవిబ్రహ్మ బాహ్య స్వరూపము మాత్రమే. వీని యన్నిటికంటె విలక్షణమైన దాతని యంతరాత్మ "నానాగ్రవిహారరసిక! నాదామృత ధారాసారరూప!" అని హరిహరనాథుని సంబోధించిన సోమయాజి మహాయోగి ఆ యలౌకిక మగు యోగశక్తి లేనిది—అంత కవిత్వమును—అట్టి ధారతో వ్రాయుట యూహించని విషయము. కాని మన మదృష్టముకొలది యతని యోగ మూర్తిగ దర్శించువారము. అట్లే పోతన్నవిషయమున అతని భక్తునిగా గౌరవించుచు పోయిన కవిత యన్న చప్పరించు పెద్దలను నేనెఱుగుదును దీనికంతటికిని కారణము వారి సమగ్ర స్వరూపముల నర్థముజేసికొనక పోవుటయే.

పాండురంగమహాత్మ్యమును జదివినప్పుడాతని కవితలకు వెన్క నెందరో మహాకవులు ధ్వనింతురు.

గీ॥ విపుల పవమాన తాండవ వేపమాన
లాంఛన ధ్వజపట్ట పల్లవ లలామ
మౌళిఘటిత శిఖాకృత్య హేళి హయము
దీపితంబగు శ్రీ కాశికాపురంబు॥

అను పద్యమును జదివిన వెంటనే "కవిరాజరాజముకుటాలంకారహీరుఁడు" శ్రీహర్షుడు నిలచి "యీభావము నాదికాదా!" యని యడుగును

గీ॥ హోమధూమాసితప్రభ నీమహాత్ము
నాశ్రమంబొప్పు నీ యువ్వి యంతికమున
వెలఁదియై యుండి నప్పుంట వలతి నెలఁత
చంటి కట నంటు మృగనాభి చిప్పవోలె॥

అనుదానిలో—కాళిదాసు—లీలగా నవ్వును!

"సాత్త్వికక్రియ సుఖవిజృంభణ ముదితంబును
పంటకారు పగిదిం బ్రసన్న శరీరంబును సత్వలోకంబు
నాకృతిం గమల ఘూయిష్ఠంబును, విలాసినీకరంబు
కరిణి వివిధమణి కిరణపుంజ రంజితోర్మికంబును".

అనువానిని గాంచి కాదంబరీకారుఁడీ జగత్తంతయు "బాణోచ్ఛిష్ట" మని లొట్టపెట్టెను. పీరేగారు సమయము దొరకినపుడంతయు—మురారి, సుబంధువు—భవభూతి మొదలైన మహాకవులందరు వొంగి చూతురు. ఇంతమంది కవితాసామగ్రి నాకళించుకొని—రచనము సాగించినను — అతఁడు

"పుట్టకు బుట్టెడువేళం
దిట్టపు నునుపచ్చి పుట్టతేనియ చవితో
బుట్టెనను నమ్మతి ముట్టెడు
పుట్టనిముప్పు సత్కవిత్వములు వర్ణింతున్॥

క॥ ఇట్టాడరాని యాగమ
ఘట్టమునకు నడువనమ్ము కట్టినముని రా
ట్పట్టాభిషిక్త—దపముల
పుట్టిన నెలపైన వ్యాసముని వర్ణింతున్॥

అని వ్యాస వాల్మీకులను మాత్రమే సంస్మరించెను. తక్కినవారి రచన లన్నియు నీ మహాత్ముల విశ్వరూపమేగాని వేరుగాదు. సంస్కృత సాహిత్యమునందుఁ బ్రధానముగ బయలుదేరిన కవితావాహినులీ రెండే. వాల్మీకి కవితామార్గము నాకళించి కవిత్వమును నడిపినవారు—భాస కాళిదాసాదులు వ్యాసమహర్షి కవిత్వమును ప్రేమించినవారు. భవభూతి.

దిఙ్నాగ లీలాశుక జయదేవాదులు. అందువలన యీయిరువురి నాతడు స్తుతించి విడచుట. తక్కిన కవులయు—ఆద్యఋషులయు నియత్తలు. చక్కగ నెఱిగియుండుటవలననేగాని—కాళిదాసాదులయందవహేళనా బుద్ధి గాదు. సర్వదేవ నమస్కారములను కేశవుని బొందినట్లు—వారిరువురి కొనర్చిన యగ్రపూజ సకల సంస్కృత మహాకవులకును జెందినది.

ఇక తెనుగుకవులలో కవిత్రయమువారి పోకడ లీకవియందేగాదు. ఏకవులందును దప్పవు కవిత్రయము రచనలుగానిచో నిక తెనుగేమున్నది? కనుక యిక్కడ తిక్కన ననుసరించినాడు. ఇక్కడ యెఱ్ఱన ననుసరించినాడు. ఈతావున నన్నయ ప్రతిఫలించినాడు—అవి యెత్తి చూపుట పనిలేని పని.

పోతనామాత్యుల ఛాయ లక్కడ స్పష్టముగ గనుపించుచున్నవి. తిక్కన తనశైలికెట్లో—పోతన్నయు దనశైలికట్లే యధిష్ఠాత.

కవిబ్రహ్మకు యుద్ధఘట్టములు వర్ణించు పట్టులలో వీరరసావేశము పొంగునట్లు పోతన్నకు వేదాంతఘట్టములందు శరీరము మరపునకు వచ్చును. కనుక యే తెనుగుకవిగాని తత్త్వవిచారము సేయుపట్ల—ఆ భక్తుని యమృతలేఖని ప్రతిఫలించితీరును. "పరిమళంబుడివోని విరుల" న్నపుడు పాల్కురికి సోమనాథులు తొంగిచూచి పోదురు. ఇకను—నవీనగుణసనాథుడు, భాస్కరాదులు—అందందు మేమున్నాము కనకేమి భయము అన్నట్లుందురు ఇందరికిని మ్రొక్కులు మ్రొక్కవలెను. ఎవరిని పురస్కరించిన—నెవ్వరిని దిరస్కరించినట్లగునో; అందులకై రామకృష్ణుడు మంచి యుపాయమును వెదకినాడు. తెనుగుకవుల నందరిని—యొక గీతపద్యములో తళ్కివేసినాడు.

తే॥ వ్యాస వాల్మీకి ముఖసూక్తి వైభవముల
నేర్పుమీఱంగ నిజ కావ్య దర్పణముల

సరస మానసముల నేలుపరచు కీర్తి
ధవుల నన్నయభట్టాది కవుల దలతు॥

ఈ పద్యమందున్న యాది శబ్దము కుంభకర్ణుని కడుపువంటిది. రామకృష్ణునికన్న ముందు బుట్టినవారును—సమకాలికులును—పుట్టబోవువారును—అందఱీ—"యాది" శబ్దములో దూరుకొనవచ్చును.

కాని యెంత మెలకువతో బ్రవర్తించినను రామకృష్ణుకీ పట్టమున నొక సత్యమును మాత్రము వెల్లడించియుండవలసినది. శ్రీనాథమహాకవిని రామకృష్ణుడు ప్రత్యేకముగ బొగడకపోవుట నాకు జూడ నన్యాయము. నన్నయ తిక్కనాదులు—తెనుగున కెంత సేవ జేసియున్నను కవిసార్వభౌముని కంఠ కుహూకారము లేనిది—ఆంధ్ర కవితా వసంతము—వసంత మేగాదు! మధ్యయుగమున ఆంధ్ర సాహిత్యాకాశమునందు వెలగిన మార్తాండమూర్తి శ్రీనాథుడు. రామకృష్ణుడేగాదు, పెద్దనామాత్యుడుగూడ నీ పొరబాటు గావించెను. రాయలును శ్రీనాథుని దరవినట్లు లేదు. కృష్ణరాయల కథ యెట్లున్నను మనుచరిత్రకారుడును—పాండురంగమాహాత్మ్యకవియు మాత్రము సత్కవి సార్వభౌమునకు పెద్ద అప్పుబడినవారే!

పద్యరచనమునందలి యొయ్యారమును భట్టారకుల తర్వాత ప్రౌఢముగ దిద్దినవాడు శ్రీనాథుఁడే. సీసపద్యముల తీర్పులలో చూపిన నేర్పులు మాత్రము స్వయముగ నాతని యుపజ్ఞ. ఆ రచనా సంవిధానమే తరువాతివారందరికి నొరవడియైనది. అతడొక్కొకసారి సీసపాదములను హిమశిఖరి శిఖరములవలె నుత్తుంగముగ నడపును. మృణాళ దీర్ఘములుగ బొడిగించును. పద్మినీ పద్మాతపత్రమువలె విశాలము సేయును. క్రియాపదములను మొదటజేర్చి వ్రాయుట—శ్రీనాథుని యొక మెలపు.

ఒక్కొకసారి క్రియాపదమును నాల్గుపాదములయందును — కదపట జేర్చుచు వచ్చును. గీతములయందు "మిత్త్రకుండాల కుండాదంతము" వంటి సమాసమును వెలిగించి పైనున్న క్రియల కన్వయమా "గీతపద్యము"లో గూర్చును. ఒక్కొక్కసారి ప్రతి పాదమును రెండుచోట్ల సుకుమారముగ బూవులవలె ద్రుంచును.

ఈరీతి జెప్పబోయినచో నీ వ్యాసమే ముగియదు. శ్రీనాథుని తర్వాతివారిలో కొందఱు కొంచెజాతని ననుసరించి యా యొయ్యారములను వికారములుగను మార్చిరి

ఇంతకును శ్రీనాథుని తరువాత—తిక్కనాదుల పోకడలు పద సంచయమునగాక పద్యబంధములో ననుకరించినవారు చాల తక్కువే। ఎవ్వరో పింగళి సూరన్నవంటివారొక రియువు రుందురు. దీనివిబట్టి కవిసార్వభౌముని కవితాత్మ యెంతగొప్పదో యూహించుకొనవచ్చును. పెద్దనామాత్యులు శ్రీనాథభట్టును మక్కికి మక్కి ననుసరించిన పట్టులు చాల గలవు. అట్లయ్యు నాతఁడెందుకు శ్రీనాథు దడవలేదో! కవిసార్వభౌముని గుఱించి—భట్టుమూర్తి—

మ॥ మహి మున్ వాగనుశాసనుండు సృజియింపన్ గుండలీంద్రుండు త
న్మహనీయస్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహులై సోముడు భాస్కరుండు వెలయింపన్ సొంపువాటించు నీ
బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమున దత్ప్రాగల్భ్య మూహించెదన్.

అని పలికెను.

ఈ పద్యమున నాతడు శ్లేషనే యిమిడించినను నూటికి నూరుపాళ్ళయా కవులను గురించి నిజమే పల్కినాడు।

ఈ క్రింది పద్యములు చూచినప్పుడు—తెన్నాలికవియందు శ్రీనాథు డెంత స్పష్టముగ నగుపడుచున్నాడో మీకే దెలియును.

సీ॥ సూత్రవతీదేవి సొబగు పాలిండ్లపై
మలు పచ్చిగందంపు వలపుతోఁడ
శిరసులువంచి నిర్జరకోటి పవిగొను
తపనీయ వేత్ర హస్తంబుతోఁడ—(1-7)

ఈనాల్గుపాదములన్లే నడచును. కడపట తృతీయావిభక్తి నాల్గిటియందును నున్నది—

సీ॥ ధరణీశిరము దాల్చు దనచేవయంతయు
భుజ పరిఘంబుల బొంకపరచి (1-9)

ఈపాదము లిట్లే నడచును. కడపట ప్రతిపాదమునందునను నసమాపక క్రియలు విలచి—మెత్తుగడ గీతముతో నన్వయించును. ప్రతి పాదము నను "అంతయు నంతయు"నను దూతపదముగా నడచును.

సీ॥ సమకూర్పగా నేర్చు సకల వైష్ణవ శాస్త్ర
సిద్ధాంత శుద్ధాంత సిద్ధి గరిమ

మిగిలిన పాదములన్నియు నిట్లే నడచును. పైపద్యపాదములలో "మలు పచ్చిగందంపు వలపు" సొబగు పాలిండ్లును ఆంధ్రభారతికి శ్రీనాథు డేర్పరచినవే!

"సిద్ధాంత శుద్ధాంత సిద్ధి గరిమ"లోని నాదశుద్ధి తెలుగుల కాతని బిక్షయే। శ్రీనాథునివలెనే రామకృష్ణుడుగూడ

..........,..................మురువైన జోదుచే
భద్రమయాత్మచే నిగమపాలన ఖేలనుచే సరస్వతీ
ముద్రిత వక్త్రిచేత నలుమోముల వేలుపుచే—వే
దాద్రి చమూవిభుండు గను నాయువు శ్రీయు నిరంతరాయముగా

అని ప్రతిదానికిని విభక్తిని చేర్చికొనుచు నొయ్యారపు నడక నడచును. పైవానిలో విశేషణములేవో విశేష్యమేదో యాతనినే యడుగవలయును.

కవిసార్వభౌమునివలెనే యితడును—

"పంచాక్షరీ గుహాహర్యక్షంబగు విరూపాక్షు, నుక్షధ్వజు
దాక్షాయణీవిభు, వశిక్ష మయూఖ రేఖామకుటు, భ్రుకుటి
మాత్ర విద్రావిత త్రిపుర నిశాటు—హేమకూట నివాసు
వాసుకి వలయ వలయు తెలుంగునం బ్రస్తుతించి..."

అని యవిసిపూలు విదిర్చినట్లు చిలుకల గుంపులను లేపినట్లు విశేషణ విశేష్యముల నొక్కుమ్మడి కలిపి—విదలించుచు బోవును.

ఈ క్రింది పొంకములుగూడ గవిసార్వభౌముని నుండి యెరవు దెచ్చుకొన్నవే.

"కార్తికేయుం డాశితార్తి హరుండనియును శరవణభవుండు పరమపురుషార్థ ప్రవణుండనియును, మహాసేనుండు దీనజనమందారుం డనియును, శర్వద్బాలుండు కృపావిశాలుం డనియును." పై వచనమున విశేషణ విశేష్యములకు ప్రత్యేకమైన సార్థక్యమేమియు లేదు. అనగా "నార్తి హరత్వము"నందు కార్తికేయ పదమునకు దావివ్యుత్పత్తి ననుసరించి సార్థక్యము చెప్ప వీలులేదు. వానికున్న సంబంధమంతయు బ్రాసలలోనే, కాని యందేమో యున్నదనిపించును. ఇట్లు వ్రాయుట కవి సార్వభౌముని కనుకట్టు విద్య.

కలశభవుడు మొదలైన మునిజనములు—బలువేల్పును—తీర్థమును—క్షేత్రమును నొక్కఁడ గూడియున్న చోటేదైన చెప్పుమని శర జన్ము నడిగినారు. అప్పుడాతడు—

గీ॥ చిత్త మాశ్చర్య రసమున జొత్తిలంగ
జేయు నీ ప్రశ్న మషి కౌక్షేయుచేత
విందుధరుచేత హరుచేత నెరుగవలయు
రండు పోదము మునులార రజతగిరికి॥

అని పలికి వారిని పిలుచుకొనిపోయెను. పై పద్యమున నొకటిన్నరపాదమున కవి యేమి చెప్పెను. ఈశ్వరుని బల్కినాడు. మూడు మాటలతో అవన్నియు విశేష్యములే. అన్నియు విశేషణములే. నిజమున కందు భావమున విశేషమేమియు లేదు. కాని చెప్పరాని ఏదో పొంకమున్నది.

ఒకానొక విషయమును వర్ణింపవలసి వచ్చినపుడు కవిసార్వభౌము డనుసరించు పద్ధతులు రెండు. తీరికెగా గూర్చొని—యాప్రధానభావములోని యంగోపాంగములకు—పలుకులు మెరుగులు దిద్దును.

కాశీనగరమునుగురించి వచించుచు—

సీ॥ పాలిండ్లు గదలంగఁ బసపు పయ్యెద విచ్చు
నచలాధిపతికూర్మి యాడుబిడ్డ
ఘాత్కార మొనరించు దొండంబు ముక్కున
శీకరాసారంబు జిలుకు దుంతి
ప్రత్యక్షమై వచ్చు భాగీరథీగంగ
మృదులహస్తముసాచి మేను నిమురు

ప్రమథోత్తముఁడు భృంగి భయరక్షణార్థమై
ఫాలాగ్రమున దీర్చు భసితరేఖ
దక్షిణ శృతి మీదుగా ధాత్రి చెంది
పెద్దనిద్రకు మ్రాగన్ను పెట్టు వేళ

యని యొక భావమును విపులీకరించినాడు.

పై సీసపద్యమునందు—కాశిలో మరణించు జీవికి తారకబ్రహ్మ విద్య నుపదేశముసేయు శభవు డొంటిగా రాలేదు "పిల్లలు జల్లలు" మొదలైన—పరంజామా నంతయు చంకబెట్టుకొని వచ్చినాడు.

ఒక్కొక్కసారి భావమునంత బెంచక సంకుచీకరించియు శ్రీనాథుఁడు పలుకును. అప్పుడదియొకవిధమగు వస్తుకవితవలె నుండును. ఆ రచన యిట్టిది—

మ॥ పసుపుం కుంకుమ కజ్జలంబు నునుకూర్వాసంబు తాంబూలముల్
గుసుమంబుల్ కబరీభరంబు చెవియాకుల్ మంగళాలంకృతుల్.

ఇందులో మంగళాలంకృతులన్నియు నొక "లిష్టు" యిచ్చినాడు. కాని యాధారావేగమునందది జాబితాగా గనుపింపదు. ఏమో బ్రహ్మాండ విషయమును జెప్పినట్లుండును

ఇట్టిదే రామకృష్ణునిది—విరూరి వేదాద్రిమంత్రి:
"కవులున్ పాఠకులున్ ప్రధానులు నలంకారజ్ఞులున్ ప్రాజ్ఞులున్
ధీశాలుల్ భజియింప విందు కొలువై......"

యున్నాడట. ఈపద్యమునందు—ఆసభ—రేకులొత్తుగా గలిసికొన్న పద్మమువలె సముచితముగ మన కంటికిఁ దోచును.

కవిసార్వభౌము డొకొ్కకసారి తమాషాగా చేతులు జాచి

"సలిలంబు త్రిషవణ స్నాన క్షమం బౌనె
యంభోజపత్ర దీర్ఘాయుతాక్షి"

యని హెచ్చరించును. అర్థమునందుకంటెను సమాసపు రీవిలో నామహా కవి దృష్టి. ఆయన త్రోవలనే నడచి రామకృష్ణుడుగూడ—"అపసిగాపు పూపనయసాకె" ఓ యరవిందకోరక సహోదర చారుపయోధరాఢ్య. అంశాంశుద్వహ. మేచిక మేఘసంపదు నమేయశిరోజ" యని క్రొత్త క్రొత్తలుగ సంబోధించును. ప్రేమికుడు యనురాగమునువలె, దీర్ఘదీర్ఘ ముగ సమాసమును బెంచును.

తెన్నాలిగాని

గీ॥ విగమ నూపురములు మ్రోయ విరుకళముగ
సిగ్గువాసిన కటి ప్రకాశింప

ఈ పద్యమును జదువుచున్నపుడు—కాశీఖండములోని

కట్టప్రీడా శూన్యకటి గోపురద్వార
పరి రక్షకుడు కాలభైరవుండు

అన్న చరణము మన భావనాదృష్టిలో భాసించితీరును

"సిగ్గువాసినకటి" యని తెనుగుసేత నూహించినట్టివేళ శ్రీనాథుని పదము—తెన్నాలివాని తలపులో మెదలియుండి తీరవలె—లేకున్న "కటి" శబ్దముగూడ నచ్చుటతికియుండదు

విశిష్టకవితా సనాథుడగు శ్రీనాథుడు—కవితావిషయమున, నా డాంధ్ర భారతికి బెట్టిన మెఱుగు లటుండ సామాజికముగ నాతడాకాల

మున నెన్నియో గొప్పపనులు జేసెను. వానిలో నుత్తరాపథమునకంటె దక్షిణాపథమందును దీసిపోదన్న వాదమును లేవదీయుటయు నొకటి. ఆకాలమున దక్షిణదేశమువారు హిమవత్పర్వతమునందే మంచుతోపాటు మోక్షమును బేరుకొనియున్నదని తలచుచుండిరి. కాశీనగరమున "భవ రాహిత్యము" కుప్పలు కుప్పలై పడియుండుననియు అక్కడికి బోయి వచ్చు నెవ్వరి నడుగకయే దానిని మూటలు మూటలు—యెత్తుకొని రావచ్చుననియు వారి యూహ. వింధ్య హిమాలయముల నడిమి భూమి పుణ్యభూమి యనియు అచటనుండి యెట్లు ప్రవర్తించినను—ముక్తి యఱచేతిలోనిదనియు వారు భ్రమించిరి. ఈ యూహలతో దక్షిణదేశ మన్న వారి కంత యభిమానము లేదు శ్రీనాథున కాంధ్రదేశము ప్రాణ మునకు ప్రాణము—అందుచే నాతడు దక్షిణదేశము గూడ నుత్తరముతో సమానముగ మడిగట్టుకొన్నదని యెలుగెత్తి చాటినాఁడు—వాస్తవముగ హిమగిరికంటె వింధ్యగిరి యేమిట దక్కువ? ఆ కాశికంటె ద్రాక్షారామ మేమిటి దీసిపోయినది? గంగకంటె గౌతమి—యేగుణమునందు తరుగు? భక్తిజ్ఞానములు రెండును హృదయధర్మములు. ఆ హృదయశుద్ధిలేనినాడు గంగలో నసలులేదు. గోదావరిలో నంతకుముందు లేదు. శ్రీనాథమహా కవి యారంభించిన యీ మహాభావము నాతనికిఁ దరువాతి కవులును అనుసరించిరి. రామకృష్ణు డేమనుచున్నాడో చూడుడు—

> "మిన్నేటి పాటియు, బెన్న యున్నతియు, వి
> పాశ వాసియు, చంద్రభాగ చేగ
> యును, శరావతి భూతియును, నేత్రవతి చ
> రిత్రము, బాహుద యుదారతయును, గృష్ణ
> వేణి యగణ్యాభివృద్ధియు, గావేరి
> ఠీవియు, కపిళతిలా విభవము,

వంజీర మంజువా ర్వైభవంబును, భవ
నాశనిక్లేశ నిర్నాశనకృతియు
తుంగభద్ర ప్రసంగ, ముత్తుంగభవ్ర
రాజి గోభిల్లు గౌతమీయోజ మహిము
వార్త కెక్కిన తీర్థ ప్రవర్తనములు"

దక్షిణాపథమున గలవట. అసలు పాండురంగ మాహాత్మ్యము నుంకించుటలో క్షేత్రమును తీర్థమును దైవమును ఒక్కెడ గూడి యుండుట ఉత్తరాపథమున నెక్కడను లేవని చెప్పుటయు నొక యుద్దేశ్యమేమో!

కవిసార్వభౌముడు వాడిన పదభండారము అంతకుముందు తెనుగున లేదు. అతడే కొన్ని నూర్ల పదములు—ఆంధ్రభాషకుఁ జేర్చినాడు. అవి యన్నియు—కన్నడ వాఙ్మయమునుండియు—కుంతలదేశమునుండియు కొల్లగొట్టినవే! మరికొన్ని కాదంబరినుండి తీసికొన్నాడు కన్నడమునుండి కుంతలదేశ పరిసరములనుండి అంత సామగ్రి మహాకవి గ్రహించినాడుగనుకనే—అతనికిఁ గర్ణాటదేశమన్న గంపెడంత యభిమానము. "కర్ణాట తాటంకిను"లా రసికుని మనసునకు విందు—వారి నాగరికత—భాగ్యము రసపిపాస—కవిసార్వభౌముని కరిగించివేసినవి. తాను గుండ్లకమ్మకావైపు జన్మించినను "పంపావిరూపాక్ష బహుజటా జూట కారగ్వధ ప్రసవ సౌరభ్యములు, కళసాపుర ప్రాంత కదళీవనాంతర ద్రాక్షలతా ఫలస్తబకములు, కర్ణాటకామినీ కర్ణహాటక రత్నతాటంక యుగ ధాళ ధళ్యములును, తుంగభద్రా సముత్తుంగ వీచీ ఘటా గంభీర ఘుమఘుమారంభములు—కర్ణాట కటక పద్మ వనహేళి" కవితలలోనిలచి అడుగడుగునను హర్షీపకములు వొక్కినవి. పై పద్యములోని "కళసాపురము" కృష్ణానదియొడ్డున నున్నదని—నొక విమర్శకులు వివరించి

నారు. "కళసాపురము" హంపి సమీపమున నున్నది. అది యిప్పుడొక పల్లెటూరు. అందిప్పటికిని—అరటితోటలు ద్రాక్షతోట లెక్కువ. తక్కిన మూడుపాదములందును విద్యానగరముచుట్టునే సుళ్లుతిరిగిన భావన హఠాత్తుగ నొక్క పాదమున-కృష్ణకెగురవలసిన పని యేమి వచ్చినది?

శ్రీనాథుని పదభండారమును—తరువాతి తెనుగుకవులెల్లరును తమ కావ్యములలో నింపికొన్నారు. అట్లే రామకృష్ణుడుగూడ—ననేక శబ్దములను—కవిసార్వభౌముని నుండి కొలునకు దీసికొనెను. ఈతడు వాడిన "వాలారుచూపులు. కొంగుబంగారము. నిరుపేద నడుము. ఆముకవియు. బిగువు నగవు" మొదలగు పదము లాతనివే. అట్లే రామకృష్ణునకుగూడ గొంత సొంతసరకున్నది. "మెయికిపాలసుడు. గోదవాబవ, పిల్లిశీలము మొదలగు శబ్దసంచయమును. "పాశిసగు విస్తుపంటి నెఱపాముకులము. ఇంమ గీసినరీతి. ఉరిగదిష్టుని మేని నెత్తురునువోలె. మినుమినమువంటి యొంటిజంటము" మొదలగు నుపమానములు. "తనకుబోము నాకుబోదని, కాల్చవచు జరింపుము, ఒకనాటిరాత్రి పడు పడుటకు జెప్పక" మొదలగు నుడికారములు లచ్చముగ రామకృష్ణునివి.

తెన్నాలికవికి కన్నడకవిత్వముతో చక్కని పరిచయముండెడిది. అతడే వాడిన "మల్లియల పెల్లు కన్నడ కవితా వితానంబునుం బోలె షట్పద ప్రవృత్తి విలాస భాసురంబై" అను నుపమానమే యిందునకు సాక్షి. కన్నడకవితలయందు షట్పదీవృత్తముల విలాసము లెక్కువ. దానిలో ననేక రీతులు వారు చూపుదురు. కర్ణాట కవిత్వమున షట్పదీ కవిత్వము చాల గలదని దెలిసికొనుటకు దానియందంత పెద్ద పాండిత్యమవసరమా! యని మీరడుగుదురేమో? కాని యచట జూడుడు, అతడా కవిత్వమును మల్లియలతో బోల్చినాడు. దానియందు బరిచయములేనివానికా పౌరభము లెట్లు దెలియును? ఏదో శ్లేషను బొందించుటకై తోచినది

వ్రాసి ఇక బొమ్మనునంతటి యసమర్థునిగా రామకృష్ణుని మీ రూహింప రనుకొందును. తనకన్న పూర్వులైన కవులయందేగాక నించుమించుగా సమకాలికులైన కవులయందుగూడ నాతనికి సానుభూతి యున్నది. ఈ సుగుణ మొక రామకృష్ణునియందేగాక ఆకాలమునందలి కవులందరియం దును గనిపించును. అష్టదిగ్గజముల—వైనిక జీవితమున—పరస్పర స్నేహభావము లెటులుండెనో మనము చెప్పలేము. వారును కొంచెము గనో గొప్పగనో—కీచులాడుకొనుచున్నట్లే జనశ్రుతి యున్నది. కాని నాటి కవులు జిజ్ఞాసతోనో జిగీషతోనో సమకాలికుల రచనలను చక్కగా చదువుచుండిరనుట మాత్రము స్పష్టము. ముక్కు తిమ్మన్నగారి పారిజా తాపహరణమునందు ప్రథమాశ్వాసమునసే కలహబీజముగా రంగమున ప్రవేశించిన నారదుఁడు తాను దెచ్చిన సరుకు గూర్చి—

"జలజాక్షి యిది పారిజాత ప్రసూనంబు
నరులకు ధరియింప నరిది సూవె"

యని దాని పుట్టు పూర్వోత్తరములతో విలాసమును బూర్తిగానిచ్చి—

మ॥ అళినీలాలక నీవు నీపతి రహస్యక్రీడ వర్తించు వే
ళ లతాంతాయుధ సంగరంబునకు నుల్లాసంబు గల్పించు ను
జ్జ్వల దీపాంకురమై రతిశ్రమ తనూ సంజాత ధారాళ ఘ
ర్మ లవంబుల్ దొలగింపగా సురటియై రంజిల్లు నిచ్చాగతిన్॥

మొదలగువానిలో నాయొక్క చేహావుసేయు గారడీవిద్యలను జెప్పినాడు.

పాండురంగమాహాత్మ్యమునగూడ — పరమశివుని దరిసెనము నకై వచ్చిన గుమారస్వామి తండ్రి కుడుగరగా నొక ముత్యమునుదెచ్చి నాడు. దాని పూర్వగాథ యిది—

సీ॥ అలవోకఁ గనకాద్రి నెలయుచో విరిగిన
హరి వరాహము దంష్ట్ర నవతరించె
నెద్ది మున్నపరంజి యిసుకరానేలల
జరియించు గంధర్వ పరిభృధనకు
జిత్రాశ్వునకు నెద్ది సేకూరె నెద్ది త
చ్ఛుద్ధాంత కామినీ సురత ఖేద
మపనయింపగ జాలె దపహాసరంబుల
నంచమై గరుదంచలా నిలముల

గీ॥ నెద్ది ప్రాపించె నా ఖచరేంద్రు గెలుపు
గొన్న తాంకునకు వాని గుహుండు దునిమి
తెచ్చెగా నెద్ది యమ్మౌక్త్య మిచ్చె నచల
సుతకు శితికంధరునకు నిచ్చుటయు నలరి॥

ఈపద్యము పారిజాతాపహరణమునందలి సీసపద్యమువలెనే పాదములు దునుగక నడచినది. దీనిలో ముక్కుతిమ్మన ననుసరించుటలో రామకృష్ణున కెంత మెచ్చరిక యుండెనో మనమూహింపవచ్చును. తరువాత—

చ॥ హరుడు శిరంబునం జెలికరాం బురుహంబున దాల్చ చంద్రికా
కుర వరభాగమై యురగకుండలమై స్ఫటికాక్షసూత్రమై
గిరిజ కచాళి కర్ణమున గేల వహింప ప్రసూన మాలికా
కరి రదపఙ్క్తి విభ్రమ శుకంబులనై మని యుల్ల సిల్లుమఁ॥

యీరీతిగా—తిమ్మన్న పారిజాతముతో పోటీకి నిల్చినదానివలె నీ ముత్యముగూడ పార్వతీ పరమేశ్వరుల కిరువురకును సేవచేర్చి చరితార్థమైనది—

తిమ్మన—నారదుఁడు కృష్ణుని స్తుతించు ఘట్టమునందు దశావతారముల వర్ణించినాడు. ఆపద్యము లివి—

సీ॥ ప్రామిను కులదొంగ పాతాళ కుహరంబు
దూరదాఁటి చీఱిన చోఁఱ వీవ
తరిగొండ వెన్నుపై దాల్చి వేల్పుల గూటి
చవి దేల్చినట్టి కచ్ఛపము నీవ
నీటిలో మునిగిన నేల చేదియ కొమ్ము
కొన నుబ్బ నెత్తిన ఘోణి వీవ
మునిమాపు బలుగఁబమున బుట్టి బంటు
నక్కఱ గాచినట్టి పింగఁబవీవ

గీ॥ దితిజు మెట్టిన యా పొట్టి దిట్టవీవు
పుడమితేడుల నడచిన ప్రోఁడ వీవ
కదలి గోలకు దెచ్చిన గబ్బివీవ
యిపుడు ద్వారక వసియించు నీవు నీవ॥

అంతటితో నా నారదు డూరుకొనలేదు. ఆ దేవఋషికి జ్యోతిషము మాత్రము రాదా?

కం॥ రక్కసి మగువల యీలువు
మొక్కపఱిచె దీవ—పాపములగమి కాలం
ద్రొక్కెదవు నీవ యింకిట
నిక్కముగా నిన్ను బొగడ నేర్తునె కృష్ణా॥

అని గోపాలకృష్ణు దెత్తబోవు మిగిలిన రెండవతారములుగూడ చేర్చి

కొన్నాడు. ఇట ముక్కు తిమ్మన చేసిన దశావతార వర్ణనము—సంద ర్భమునకు సరిగ నడువలేదు. మరియొకచోటను తిమ్మన దశావతారముల వర్ణించెను.

రాయవాచకము ప్రకారము—కృష్ణరాయలు—పెద్దనామాత్యులకును ముక్కు తిమ్మనకును—ఒక్కటేసారి గ్రంథరచనమునకై తాంబూల మిచ్చినాడు. తిమ్మనామాత్యుడు పారిజాతాపహరణమును గజపతులతోడి జయమునకుముందే ముగించెను. పెద్దనలు—మనుచరిత్రను ప్రారంభించి నది గజపతులను రాయలు జయించిన తర్వాత. మనుచరిత్రను పూర్తి చేయుటకు ఆంధ్రకవితా పితామహులు చాలకాలము దీసికొన్నారు అందుచే ముక్కు తిమ్మన బలికిన దశావతారముల నతనికంటె—చాల మెలుగుగ వారు బలికిరి. వాటినుండి నా కవులకు "దశావతారవర్ణ నము" ఒక కావ్యలక్షణమై పోయెను ఆవర్ణనములలో నొకరనిటుంచి యొకరు దమశక్తులను జూపించినారు. పెద్దనను చూచి రాయలు పది యవతారములను వర్ణించెను. వారిద్వారిని చూచి తెన్నాలికవి యారంభిం చెను. ఇంతకును ముందుగా నీ పద్ధతి నెలులో బెట్టినది—ముక్కు తిమ్మనయే. అంతకుముందు శ్రీనాథుడు

రామలింగడు రామరాజభూషణుని కవితను హేళనమొనరించినట్లు కొన్ని కథలు చెప్పుదురు. భట్టుమూర్తి "శ్రీ భూపుత్త్రి వివాహవేళ"నని వసుచరిత్రలో మొదటిపద్యము వ్రాసినాడు. వసుచరిత్రకారునితో తెన్నాలి కవికి ద్వేషముకద్దు. అందుచే సభలో మరియాద గలుగకుండుటకై — రామకృష్ణు డొక యెత్తునెత్తెనట. తిరుమలరాయనితో "నీ పుస్తకమును నీవు గృతి దీసికొన్నచో—నీ సంపద బోవు"నని పలికి, యందుకు దార్కాణముగ—నివ్వంత వీభూతి నరచేతియందుంచుకొని—దానిపైని శ్రీకారమునువ్రాసెనట. వ్రాసి దానిని జూపుచు, "భూపుత్త్రి" యని జనువ

గనే—యఱకేతియందున్న పీఖాతి గాలి తెగిరిపోయెనట. ఈకథ యొక్కటేగాదు ఇంకను భట్టుమూర్తిపై.

కం॥ చీపిరి బాపిరి తీగెల
చేపలబుట్టల్లినట్లు చెప్పదు నీ యీ
కాపు కవిత్వపు పాతలు
బాపన కవివరుని మదికిఁ బ్రమదం బిడునా?

అని యేమో యసహ్యపు వ్రాత వ్రాసెననియు చెప్పెదరు నాకిట్టి యూకుడు కథలపై విశ్వాసము చాల తక్కువ. పెద్దనామాత్యుల తరమునకు తరువాత—ఆంధ్రకవిత్వమునకు భట్టుమూర్తి నాయకుడు. అక్కడ తన మార్గమునకెట్లో శ్రీనాథుడు తన ధారానుబద్ధికెట్లో, పెద్దన శిరీష కుసుమపేశల సుధామయోక్తికెట్లో—యట్లే రామరాజభూషణుడు శ్లేష కవిత్వమున కధిష్ఠాత. పైగా "సంగీతకళా రహస్యనిధి" అతనివలె శ్లేష నంత రమ్యముగాఁ బ్రౌఢముగా వ్రాసినవా రుభయభాషలందును లేరు. పైగా సహజమగు సంగీతజ్ఞానమును గూడ నాతడు వసుచరిత్రలో గుప్తీకరించెను. మొన్న మొన్నటివరకు—వసుచరిత్ర పద్యములను—అవంతయును పూర్వక కృతులుగా వీణెలపై వాయించువారు మా ప్రాంతములందుండిరి. నేటి నాగరకత యా పద్ధతిని చంపివేసినది. ఇట్టి వ్యక్తివిషయమున—రామకృష్ణుడంత చిల్లరగఁ బ్రవర్తించియుండునా? కథలేమి? వానిని నమ్మినచో తెనాలిరాముడు తిరుమల తాతయ్యమెడ ననుసరించిన పరిహాసపద్ధతి పగదాయలకైనను వద్దనిపించును. వాస్తవమునకు వెంకటపతిరాయలవద్ద తాతయాచార్యు లనుభవించిన ఘనత—దేవేంద్రునికడ బృహస్పతికి లేదు. వారి నాకాలమున రామకృష్ణుడేమైన నెనికి యున్నచో నిస్సందేహముగ నురిదీంపబడి యుండును. మన యథా

గ్యము గొలది సినిమా—నిర్మాతలుగూడ కథఇ నమ్మి తాతయాచార్య నొక "డ్రామగా" జిత్రించిరి వారు తాము ధనము దండిగ సంపాదించితి మని చంక లెగురవేయవచ్చును. కాని యా మనుష్యులు చరిత్రకు చేసిన ద్రోహము మాత్రము మరువరానిది. సినిమా నిర్మాతలకును—విద్యా పరిశ్రమలకును నేయూరి కేయూరు?

వసుచరిత్రకారునిపై రామకృష్ణునకు—గౌరవమును కద్దు—అభి మానమును కద్దు—సంగీతకళారహస్యనిధి వ్రాసిన—

ఉ॥ కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్య సత్కథల్
వావిరిబుట్టు రత్నము లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు సానల దీటిన జాతి రత్నముల్
గావున నొక్క మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్॥

యను నుత్పలమాలను స్మరించినవానివలె—

ఉ॥ స్కందపురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించు దేవకీ
నందను సత్కథోద్యమము నవ్యకవిత్వ కళా కలాపమన్
కుందనమున్ ఘటించి కరు గొత్తగు సొమ్మునరించి-విష్ణుసే
వం దిలకించు నప్పరమ వైష్ణవకోటి నలంకరింపుమా॥

ఇట్లు రామకృష్ణుడు వ్రాసికొన్నాడు. ఇంతేగాదు—

కం॥ గిరికామశక్త బుద్ధిను
పరిచరునిం బోలు నొక్క పన్నగ మొక నా
దుంవడి నెచ్చటనుండియొ
మురమర్దను దివ్యభవనమున కేతెంచెన్॥ (2-2-42)

యని యాకథనుగూడఁ దడవి—దనకు భట్టుమూర్తిపై ప్రేమను సార్థకము చేసికొనెను పెద్దనామాత్యుల నీకవి చాలచోటుల ననుసరించినాడు. ఇతడేకాదు—ఆకాలములోని కవులందరు—పెద్దనను కొద్దిగనో గొప్పగనో యనుసరించినవారే మను, వసుచరిత్రకారులకుఁ బెద్ద స్పర్థయే యున్నట్లు అగుపడును—అది విషయాంతరము.

మీరిపుడు "ఏమయ్యా! నీ విమర్శనపద్ధకారము రామకృష్ణుని ప్రత్యేక వ్యక్తిత్వమేదీ? సంస్కృత కవులది కొంత—శ్రీనాథుని కవిత్వమును కొంత, పెద్దనాదులది కొంత ఇద యింతయు—"తాళ్ళపాక వారి కవిత్వమే" యైనది. గాని తన కవిత్వ మొక్క ముక్కైననులేదే" అని నన్నడుగుదురు—కొంచె మోపిక బట్టికొందురని ప్రార్థింతును. రామకృష్ణునిలో తాళ్ళపాకవారి కవిత్వ మే కొద్దిపాటియో యున్నది. ఉన్నదంతయు వాని కవిత్వమే. ఇంతవరకుఁ నతనిపైఁ బలుకుపడిగల కొందరి కవుల నెత్తిచూపితినేగాని యాతని కవితాత్మనుఁ బ్రదర్శింపనే లేదు.

తెన్నాలి రామకృష్ణకవి—కుమారస్వామి వాహనము నిట్లు వర్ణించెను. అది యా షడాననుని యవసరమునుబట్టి—

కం॥ ............సజ్జస్యందనమై
మదకరియై తత్తదుచిత మార్గంబులనే
ర్పొదవ నొకఁ గొంత చవి పా
దిద శిఖ శుభమూర్తి
అశ్వాదిత్నముగా నయ్యోనట॥

అపుడాశితి కంఠసుతుడు ఖచరస్తుతుడై యచ్చరయాపుతునకీవి అస్కందిత ధౌరిత కప్లుతరేచిత గతులతో దరటుసేసినాడట. రామకృష్ణకవి కవిత్వముగూడ నిట్టిదే. శబ్దార్థములు రెండును "ఆ మహాకవి కనుసన్నల" బరిచారికలైనవి. అతడు వానిని దన యిష్టమువచ్చినట్లు నడపును. ఒక్కొక్కసారి మందముగ నడిపించును. ఒకసారి తాండవమాడించును. సంస్కృత సమాసముల నడపుటలో నా మహాకవి యందెవేసిన జోదు! ఒకపరి :-

శా॥ క్షోణీరేణుకృతంబులంజిన రజోగుచ్ఛాసితంబుల్ దమ
శ్శ్రేణుల్ మున్నుగ రోషభీషణ గతిన్ జృంభించియున్ మావెన
క్షీణోత్తంభిత శక్తిభృద్భట శిరస్సీమా కిరీటస్ఫుర
న్మాణిక్యాతపపల్లవస్థ ఒకసామగిరి హ్యాత్యాగంబులై॥

యని సమాసమును ఉత్తుంగ హిమశృంగములలో నడపును ఉత్తాల తాండవమాచరించును మరియొకసారి.

ఉ॥ ఈ పృథివీ ధరంబున విపేంద్ర కటోదితదానధారలై
ద్వీపవతీ తరంగ తటవిస్ఫుటశైవల కందళంబులై
తాపసబాలికాశ్రవణ దత్తయవాంకుర భూషణంబులై
రేపు దమంబుసేయు శబరీ కబరీ నిబరీసనీలిమల్—॥

అని సమాసములను—ఉలితో చెక్కినట్లు హెచ్చుతగ్గులు గాకుండ నిలుపును. బుద్ధిపుట్టినపుడు—

......................అసురాన్వయ
త్రాసకరుల్ విమానకులు దైరతపీఠులు దారకారి పె
న్మోసల మ్రోలనిల్చిరొక ముప్పదికోటులు మూడుకోటులున్

అని విడివిడి పదములను మల్లెపువ్వులవలెచల్లును.

మ॥ వనితప్రక్రియనల్లె అంగు లెసగన్ ప్రస్థానమై పథ్యతో
భనముఁగైకొని బ్రహ్మగర్భుడు వహాత్వల్యాణ కల్యాణమై
ఘనగర్జన్ సకిలించునావురము నెక్కుంటోవుటో బవ్వె సం
జనితా శాకరికర్ణసంజ్వర భరాంచత్క్రుంచుకీ ధ్వానముల్॥

అని ఒక సమాసమునకును. మఱి మొదానికిని నడుమ వ్యస్త పదములతో బంగారును వెలిగారముతో వలె నమకపెట్టును.

మ॥ ........................బుధస్తుత్యప్రభావంబులై
దశితైనస్తిమిరంబులై యిహపరార్థప్రాప్తి మూలంబులై,

అని యొక్కొక్కచోట పాదమునకు రెండురెండు సమాసములుగా మానదండమున గొలిచినట్లు పడవును. ఆతని సమాసములతీరే వేరు. "కౌముదీకవచిత గగనతలము-" "వలిత కాంచనవర్ణ-" "తారకా కమనాకృతి-" "శాంతి దాంతి మాంసలగతి" "పక్ష్మలిత త్యాగలక్ష్మి" "వీణావాదంభసుపాణి" అని యేమో చిత్రముగా వాడును. ఒకపదము నందో, విగ్రహ వాక్యమునందో, యేదో వైచిత్రితేనిదాయనకు సమాసమే గుదరదు. శివునిగూర్చి—యర్ణవతూణీరు—డనెను. నారదుని "వీణా ముని" యన్నాడు. ఇట్లు ప్రతివిషయమునందును తనదే —యొకమార్గ ముగ నుండవలెనను—కోరిక యాతనిది. ఈ యపేక్ష రాయలకును గద్దు. కాని యాతని యాశ యెంతవరకైనను భావములయందే. ఈతని మత మట్టిదిగాదు. ప్రతిదానిపైనను తన "రాతాచార్యుల ముద్ర" పడిమే తీర వలయును. తెన్నాలి రామకృష్ణుడును అభంగ సభంగ శ్లేషలు వెంచును వాడును. కాని యభంగశ్లేషయందు పింగళి సూరన్నయు—సభంగశ్లేషను గూర్చుటలో రామరాజభూషణుడును వారందుకై పుట్టినవారు. కాని రామకృష్ణుని శ్లేషలును తమాషగనే యుండును. ఇక్కడ చూడుడు—

చ॥ ఉరుమతిరంగమంత్రి తన యుల్విలసిల్లిరి పుల్లమల్లికా
హర దరహాస హీరహిమహార పటీర యశోధురంధరుల్

ఇచట హర—దర—హాస—హీరహిమహారమనియు నన్వయించికొన వచ్చును. దరమనగా—శంఖమగునుగదా? ఆదియుం దెల్లనిదే—హారదర హాసముగూడ దెల్లనిదే—రెండర్థములుగూడ ప్రకృతమున కన్వయించుట—యిందులోని విశేషము—అట్లే—

గీ॥ ఆంధ్రభూమికుచాగ్రహారాభమైన-

యనుచోట కుచాగ్రము నందలి హారమనియు-కుచములపై నిహారములలో-శ్రేష్ఠమైన హారమనియు రెండర్థములు గల్గి-యా రెంటను బ్రకృతమున కన్వయించును—

ఈతని రచనలో వక్రోక్తి యొక గొప్ప విద్య. ఈ గారడీ—శ్రీనాథునిలో ముమ్మరము—అతనినుండియే రామకృష్ణుడు దానిని నేర్చుకొన్నను, సంపూర్ణముగ నా గుణమును స్వాయత్తీకరించుకొని యా మేలిమి తనదే యనిపించుకొన్నాడు. ఈ వక్రోక్తిని వాడినపుడు కవి యేమి చెప్పుకున్నను యేమో చెప్పినట్లు పాఠకులను భ్రమింపచేయు యోగ్యత దానికున్నది. చూడుడు:- "ముక్తుండాతడు భావికాల జననంబుల్ వానికింబూజ్యముల్" "హరిహయుమావు ముందిగినయం బుధిరేపున వచ్చెనో జుమీ". ఇట్టివి—ఈ చిత్రములు తెన్నాలివానిలో గుప్పలు తెప్పలు—కథాసందర్భమునుబట్టి శైలిని మార్చుట రామకృష్ణుని వలె నెవ్వరికి దెలియదా? యనిపించును. అంతకుముందొకశైలి నడపి యుండును దాని యౌచితి ననుసరించి కథలో నొకమార్పు వచ్చిన

వెంటనే యా లేఖినినే మార్చివేసి వేఱొకయెత్తుగడ నెత్తును. నిగమశర్మ యక్క వానికేమో బోధించినను వానికప్పటిలోనిపన్నియు చెవులబడునా? ఇంటనుండిన సొమ్ములన్నియు గైకొని యొకనాటిరాత్రి "పదుపదుకకును జెప్పక" "గాథతమో నికరంమే తనతోడుగా" బేరడవి త్రోవలలో నుడాయించినాడు. అపుడా బ్రాహ్మబ్రువుని దొంగలు ముట్టిరి. వానినొక కాపు కరుణాశాలి తనయింటకి గొనిపోయి, "కంటవత్తిడుకొని" సేవలు జేసినాడు. ఆ శూద్రవసతిలో "నొక కాపు కోడలుండెనట". అది కామశాస్త్రమున వీనికన్న నాలుగాకులెక్కువ జదివినది. వీనిని జూచినవెంటనే యా పిసాళి జంత తన ప్రబంధము నారంభించెను. వీడు మొదటినుండియు లఘువర్తనుఁడేగదా ? "తెలనాకుపంటి వయసుపిల్ల" తేరకు జిక్కినది లెమ్మని చంకలు దాటించినాడు. వీడు "గుడినుండి గుడిరాళ్లు" దీయు పర్బుద్ధుడు. ఉపకార స్మరణ వానికెక్కడిది ? ఆమెను లేపికొని వెళ్లినాడు. ఇరువురు నడవులబడిపోయినారు. అప్పుడు కవి:-

ఉ॥ ఆకు మఱుంగు పిందెయుఁ యంతిపురంబును బోలెనున్న రా
కాకుముదప్రియాస్య ఛయాగాథతిరత్వరఁ నేగుగాని లో
నాకలితప్పియుఁ దారవికరార్తియునెన్నఁడు మన్మథాస్త్రకీ
లాకుల తప్తచిత్తలకు లక్ష్యమె తక్కిన నొప్పులెవ్వియుఁన్॥

అని యేమో శాంతముగ చల్లగఁ జెప్పినాడు. ఈ పద్యమైనవెంటనే—

సీ॥ కఠిన కంఠీరవాక్షత నఖక్షతజర
క్తకటిశిరఃశుక్తి శార్కరిలతలము—
లాచాంత జంతు కంతాసృగుగ్రవ్యాఘ్ర
ముఖ గుహాంధకార ముఖరితంబు

లశ్వద్విషద్విషాణాగ్ర నిగ్రహావహా
త్వస్త్రప్రసవసౌరభ మయంబు
లజ్ఞాతరవికరవ్యాపారభూరుహా
చ్ఛాయానపాయాతిశైత్యఖనులు

గీ॥ గహన ఘంటాపథంబులుగడచినడచి
యొక్కపక్కఁబరికించి యూరడిల్లి
యవరవర్ణస్నుషయు బ్రాహ్మణాధముండు
బోయకులమున గలిసికి పోలుపుదక్కె॥

పై పద్యమును వ్రాసిన రామకృష్ణకవియేనా! ఈ సీసమును వ్రాసినది. ఏమో? గహన ఘంటాపథములు దలచికొన్న వెంటనే—మనుష్యుడు గుర్తుపట్టలేనంతగా మారిపోయెను. ఆ వాడిన సమాసములలో "శాఖరిలతలములు" "గుహాంధాంకారములు" "ప్రస్తర ప్రసవసౌరభ్యములు" శైత్యములు కనబడుచునేయున్నవి. వినపడుచునేయున్నవి. ఘ్రాణతర్పణమును గావించుచు శరీరదాహము నుడిగించుచున్నవి.—నిగమశర్మ పాపములు సేయుటలో మహావీరుఁడు. చేయగలిగినన్ని పాపములు చేసినాడు, మరణించినాడు. కాని వాడు మరణించినది పండరిక్షేత్రమునందు. అందుచే వాడంతవరకు జేసిన చెడ్డ పాపములన్నియు ధోదీమైనవి. ఈ ఈ కిటుకుదెలియని యమభటులు యథాప్రకారము పాశముల దీసికొని దొరకినాడురా దొంగయని పట్టవచ్చిరి. అప్పుడాక్షేత్రమున నధివసించిన నృసింహమూర్తి హుమ్మని గర్జించినాడట. ఆ నరసింహస్వామి చక్రము వచ్చి శమనభటులను దఱిమి వానికి సాయుజ్యముక్తినిచ్చెను.

వెంటనే నిగమశర్మ—అరుణ కిరణ సహస్రాభమై అభ్రగమైన విమానము నెక్కి—పరముపదమునకు ప్రయాణముకట్టినాడు. హఠాత్తుగా నాతనికి యెవరో మంత్రము వేసినట్లు పుండేషు కోదండు తండ్రి రూపము సిద్ధించినది. సాయుజ్యముక్తిలో లక్ష్మీదేవి మున్నగు కొన్ని అవసరములగు అధికారములు తప్ప తక్కిన యన్ని లక్షణములును స్వామివలెనే భక్తులకును సిద్ధించునని వైష్ణవాచార్యుల మతము. ఆ సాయుజ్యము విభవమిట్లున్నది:—

సీ॥ ఉత్తాలఫణిభుగ్గ రుత్తాలవృంతాని
లాచాంత ఘర్మాంబు వయ్యె మేను—
ప్రత్యగ్రము క్తాతపత్రీ భవచ్ఛేష
వారితాతపమయ్యెఁ జారుమౌళి
నూత్రివతీశ దోర్వేత్రి దత్తావకా
శామరంబయ్యెఁ గటాక్షవిహృతి
భృగుభరద్వాజపత్రిభృతి కృతస్వస్తి వా
గ్భరముఖరములయ్యెఁ బార్శ్వతలములు॥

అంతకుముందు పద్యములన్నియు—అలతి—యలతి తునియలతో నడపిన రామకృష్ణుడీచోటునకు వచ్చినంతనే "పతగసమాత్రిట్పతత్రిపత్రిభంజనముల" వంటి దీర్ఘ సమాసతాండవము సలిపినాడు. సాయుజ్యముక్తి యున్న సామాన్యమామరి। ఇంత సులభముగ మోక్షము లభించునట్లైన మనముగూడ నిగమశర్మకంటె రెండాకులెక్కువచదివి చావువేళ క్షేత్రమునో తీర్థమునో జేరుకొనవచ్చును. మావంటి పాపులకెల్ల మంచి సుకరమైన మార్గము కనుపెట్టినాడు రామకృష్ణుడు.

సంస్కృత సంప్రదాయ—మీకవి యాకళించినంతగ—మరే యేకవియు నర్థము జేసికొనలేదనిపించును. కేవలము తెనుగునుమాత్రమే జదువుకొని యెవ్వడైన నీ గ్రంథమును బఠింపనారంభించినచో వానిని రామకృష్ణుడు చిటికవేసినంతలో చెంగగొట్టును. అతనిపోకడలుజూడుడు:-

చ॥ చదువులపుట్టినిండ్లు శమసంపదయిక్కలు పుణ్యలక్ష్మికిం
మొదలి దివాణముల్ సురసమూహమునాకలిపంట లంచితా
భ్యుదయ విసర్గబంధువులు ప్రోదతనంబుల తాణముల్ పురిం
బొదవెడుభూసురోత్తముల భూరిపవిత్రశరీరవల్లరుల్॥

ఈ పద్యమున "భూసురోత్తముల శరీరవల్లరులు" విశేష్యము తక్కిన వన్నియు విశేషణములు. ఏ తెనుగు కవిగాని యిట్లు చెప్పడు. ఇది సంస్కృత మర్యాద. అట్లే:—

సీ॥ నఖరాగ్రలూనానస్వేద కోరకం
బర్ధకషాయ దృగంచలంబు
ప్రబలశిశ్వాస సౌరభ తర్పిత మదాళి
శోషిత శ్రవణ శిరీష సుమము
దర్శితమధ్యవృత్త స్రస్త మృదునీవి
యప్రయత్నపయోధరాంచలంబు
సంతప్తశర్కరా సహ పదన్యాసంబు
నచలరజోధూమలాలకంబు

పరణి తరుణ తరుచ్ఛాయసమితిభేద
మలసమృదులాంగ కంబునై యరుగుదెంచు
నన్నిజ పరిగ్రహముఁగూర్మినాదరించి
పలుకు వింధ్యాద్రి విర్బంధ బాంధవుండు॥

ఈ పద్యమునందు—పరిగ్రహము—విశేష్యము—పై పాదములు దానికి విశేషణములు—పరిగ్రిహము—అనగా భార్య—ఇట—లోపాముద్రి. ఈ పద్యమునందున్న చమత్కారము సంస్కృతము చక్కగా రానివాని కర్థముగాదు. అంతేగదా? "అంద పరిశోరంతఃపురంపాతునః" యన్న పుడు అంతఃపుర స్వారస్యమాంధ్రవిద్యార్థికేమిదెలియును?

క॥ కనదధరకాంతిపల్లవ మును దశనద్యుతిలతాంతమునుగావాక్పూ
జనమొనరించెబురారికి తనివిసనకమౌనికులవతంసుడువేడ్కన్॥
(2-195)

దీనినిండ సంస్కృతి మర్యాదయే. క్రియావిశేషణములుగా శబ్దములను కవి వాడినాడు. ఈ అన్వయముగూడ క్రొత్త విద్యార్థికి కొఱుకుపడని కొయ్యయే!

ఒక్కొక్కసారి యా మహాకవి కొన్నిపదములకు దన యర్థమే వేఱని చెప్పును. అందరు జెప్పికొను ప్రసిద్ధార్థము నక్కడ చెప్పినచో పొందికపడదు. ఆ స్వాతంత్ర్యమందరికి అలవడునదవ విద్యగాదు. శబ్దార్థములను బాగుగా మథించిన ఋషులకు, రసతపస్వులకు వచ్చును. అట్టి చోటులలో సామాన్యులు చెప్పునర్థమిచటగుదురలేదుగనుక నిచట పదౌచిత్యము లేదని చిల్లర కవులనువలె మనము గర్జించినచో ఆ మహా కవులు మనలజూచి నవ్వుదురు. మనము విశాఖపట్టణమునకు పిచ్చి ఆసుపత్రికి టికెట్టు గొనవలసివచ్చును! ఇదిగో చూడుడు—విగమ శర్మోపాఖ్యానములో—

క॥ కలదాశూద్రవసతి శశికలనాననజాలనొక వికారపుగోడల్
చలదాలోలకటాక్షాంచలదామ విబద్ధతరుణ జనఖంజనమై॥
(3-60)

ఇట "వికారపుగోడల్" అనుదానికి అందములేవిదని యర్థము చెప్పి నచోఁ బద్యమంతయు జెడునుగదా? అటనాపదమునకు నడవడిలేవిది యవి వ్యాఖ్యానము. మనుష్యులకు పరివర్తనముత్తమసౌందర్యమని రామకృష్ణుని యాదేశము.

చ॥ విమలమయూఖరేఖయు నవీన తరోత్పల పత్రములఁబవా
శమణియునొక్కటీవియ బలాదృతి దాల్చెనటన్నవించు వి
భ్రమ శిథిలాంగియయ్యుకుచ భారనితంబక పోలగోప న
క్రమకలనాకులాత్మయయు గన్నులనీశునదల్చె గౌరియుఁ
(1-186)

ఇట్టి భావ చమత్కారములపైగూడ రామకృష్ణునికొక కన్నుండును.

అనేక భావములనుగాని, వాక్యములనుగాని యొక్కటే పద్యము న కుదించి కూర్చు నేర్పులో నగ్రతాంబూలము కవిబ్రహ్మది. నాద శుద్ధినే ప్రధానముగ సాధించికొను కవులలో నీ శక్తి యరుదుగా గను పడును. తెన్నాలికవికాశక్తియు నున్నది. అతడొకటే పద్యమున సుమారు మూడుభావములు ముద్దుగా నిల్పినాడు. ఆ పద్యమిది:—

చ॥ పొదువు పరాగపుష్టి మొగముఁ శ్రమవారిని మేనుధాను దీ
ప్తిదవుల హొమ్ము జన్గవలు తేజముదాల్చెనెగాని యొప్పుగుం
దదు నగపుత్రికప్పు ఘసితంబున వర్షముచేత నగ్నిపై
గముసుట నద్దములఁలతీయు కాంచనకుంభములుఁ బెనంకునే.
(1-188)

పార్వతీ పరమేశ్వరులు హిమగిరియందు విహరించుచున్నారు. వారిని సేవించుటకై యచట నాఱు ఋతువులు సన్నిధియైనవి. అపుడు శంకరు దేమో చమత్కారముగ మాటాడెను. ఆర్యాదేవి హరుని "కన్నులతో"

నదల్చెనట అపుడు ధరణీధరకార్ముకుడు పార్వతిని "పచ్చదంబున బొలుచుఁబూఁబచ్చడమున" గప్పికొనెను. ఆ సందర్భమునదీపద్యము ఇందులో మూడుభావములున్నవి - పరమశివుడు దుప్పటముతో గప్పి నప్పుడు "పుష్పపరాగమామె ముఖముపై జిందెను — శ్రమవారి శరీరము నాక్రమించినది". భానుదీప్తి - జన్నదలను దాకెను. అతదష్టమూర్తిగదా! ఇదియొకభావము. వీనితో నామె సౌందర్యమునకు భంగమేమియును గలుగలేదు సరిగదా! పైగా నాసింగార మినుమడించినది! ఎందుకనగా భసితమున నద్దముయొక్క యందమును—వర్షమున లతయొక్క పుష్టియు నగ్నిపై గదురుటచే గాంచన కుంభముల కాంతియు — రెండింతలగునే గాని తగ్గునా! యని మనలనే ప్రశ్నించుచున్నాడు. అనగా పరాగము భసితమువలెను, వర్షమువలె శ్రమవారియు భానుదీప్తి — యగ్ని ప్రకాశమువలె నున్నదని ధ్వని. ఇదియొక భావము! అట్లే పార్వతీ దేవి మొగమద్దమనియు, శరీరము లతయనియు, పయోధరములు కాంచన కుంభములనియు ధ్వని.

ఇది మూడవభావము- ఈ మూడును శిల్పిమలిచిన లతలవలె నొక దానిలో నొకటి బెనవేసికొని యున్నవి. మొదట యొకటిన్నర పాదము వరకు నొకరకముగ వచ్చినభావము, తరువాత పై భావమునకు వక్రి గతిలో నడచినది - ఆ మహాకవి బుద్ధి పాదరసము. ఈ పద్యమిట్లు వ్రాయుననియు, నీ భావము నిట్లు బెంచుననియు నూహించుటకే వీలులేదు. తమ కింకొక నుదాహరణ మిత్తును. ఈక్రింది పద్యమును చిత్తగింపుడు:—

సీ॥ విడువాలు గనుచూపు విగిడిన చోటెల్ల
బీరెండ రేయెండ బెండ్లియాడ
నిశ్వాసపవనంబు నెలకొన్న చోటెల్ల
ప్రామిన్కు నెత్తావులాముకవియఁ

బొక్కటితమ్మి పుప్పొడియొల్కుచోనెల్ల
బ్రహ్మాంకురంబులు బాదుకొనగ
నడుగువే జిగురాకులంటినచోటెల్ల
వివిధ తీర్థశ్రేణి వెల్లివొడువ.

ఇంతవరకును పాదపాదమును నిలుపుచు భావమును చక్కగా విశదీకరించుచు నీడయున్నచోటెల్ల నిలచుచు నడచు బాటసారివలె శాంత చిత్తుడై వచ్చుచున్నాడు కవి. ఈ భావపు టెత్తుగడనుచూచి పద్య మంతయు నిట్లే నిమ్మళముగ నడుచునని మనమూహించుట సహజము-కాని గీతపద్యము వచ్చినంతనే,

గీ॥ బర్హమణిబంధమావేల్పు పచ్చలెదురు
గ్రచ్చకాయలతిత్తి యుఁగంబుశక్తి
గలిగి విహరించుఁ బౌండరీకంబునందు
నందులేఁబట్టి ప్రాలేయనగము — అనుచు—

మొదటిరెండు పాదములలో తన మనసులోనున్న వస్తువులనెల్లను జెప్పుటకు కావ్యమునందింతెక్కశను జోటులేని వానివలె గబగబ వదరి వేసినాడు.

ఒక్కటే యొక పదప్రయోగముతో సన్నివేశమునంతయు నిమి షములో - మార్చివేయు అసాధారణశక్తి తెన్నాలి కవికున్నది. ఆ కను కట్టు విద్య యితనిలోదప్ప నాకెవ్వరియందును గనుపింపదు. నిగమ శర్మోపాఖ్యానమున నీపద్యము గలదు. అక్కడ నీతిగఱపిన తర్వాత వాని ప్రవర్తన మిట్లుండె,

సీ॥ రాజాల యమునకు రాకపోకలు సేయు
మాసిన చదువులు మఱల జదువు
విన్నాళ్లు చెప్పెయు లెన్నైన వలపించుఁ
గులపఘూరత్నంబు గుస్తరించు
నాచార్యజనముఁ బ్రత్యహము సంధావించు
నర్చావళికి నుపహారమిచ్చు
నర్పించుగుతపవేళాగతా తిధికోటిఁ
బసినేడు వర్శించుఁ బైరుపచ్చ

గీ॥ తండ్రి యుద్గమనీయంబు దానియునకు
నత్తికా ఛర్తతో నవ్వనల్ప సరణి—
గ్రామకార్యంబుదీర్చ నంగడికివచ్చి.

ఇంతవరకును జదివినప్పుడు నిజముగా నిగమశర్మ — మారినాడని నమ్మెదము వాడుచేయుమన్నదంతయు "వంచన" యని మన యూహ కందుటయే లేదు ఆరీతి కవి తన గథనములో మనలను భ్రమపెట్టినాడు. మనము బూర్తిగా నమ్మినతర్వాత "తేనెబూసినకత్తి దాతీర్శ్వయిండు" అని యొక్కసారి మనపైపుజూచి పరపక నవ్వును ఆ తేనెబూసిన కత్తి వాడికత్తియై మన యూహలన్నిటిని "కఱకశేసుఁడ" ఖండించివేసినది.

పాండురంగ మహాత్మ్యమునంగఁ గథమేమున్నదని, నాలుగైదవాం తర కథలు చెప్పును, అవియు నముకుల బొంతలు, మిగిలిన గ్రంథ మంతయు క్షేత్రమిట్టిది, ఈ తీర్థమిట్టిది ఇక్కడ నిట్లు తర్పణము సేయవలెను, ఇక్కడ యింతమందికి భోజనము బెట్టవలెను అను కేవల బల్పజమగు విషయము కాని రామలింగని సిద్ధహస్తములో నా విషయ మట్లనిపించనే యనిపించదు. ఏదో మహాత్త్వ విషయమును జదువు

చున్నట్లు దోచును. తనధారాశుద్ధితో, వక్రోక్తితో, పాండిత్యముతో, నలంకారములతో అనల్పకల్పనా కూలంకషత్వముతో వారు మనలను దిగ్భ్రాంతులను జేయును. వాని ప్రతిముక్కయు జదివించును.

ఈ క్రింది రెండు పద్యములు రామలింగనిలో చాల బాగున్నవని యనేకమంది పండితులు, కవులు నుదాహరింపగా విన్నాను. వానిలో నిది మొదటిది :—

సీ॥ మొలకచీకటి జలజల రాల్పగారాదె
నెఱటమించిన వీరి కురులయందు—
కెరలించి యమృతంబు గిలకొట్టగారాదె
ముద్దు సూపెడి వీరి మోవులందు—
పచ్చ బంగారుకుప్పలు సేయగారాదె
గబ్బుమీరిన వీరి గుబ్బలందు
పండువెన్నెలతేట పరిఢవింపగరాదె
నగవుగుక్కెడు వీరి మొగములందు

గీ॥ నొంకర వాడిచూపుల యొఘళంబు
బాపురే! భూరికటి తటీ భారమహిమ!
బాగుమద మందగమన లక్షణము లనగ
నేరుపున మించురప్పురి వారసుతులు॥ (1-117)

ఇక రెండవది :—

సీ॥ కొనలచుట్టిన తీగె పెనచేఁజమరవాల
పరికరంబుల జుట్టు పట్టితిగిచి
కమ్మనంపెగల మొగ్గల విరుగదరాయు
జేగురు దిరికెలు చెంపఁబెట్టి

వేదికి నొదియుశిలీముఖ శ్రేణిచే
మేలిపూగుత్తులు రాలనుర్వి
కబళనత్వ రమాణి కరటతుండములచే
గదళికా తరువులగాళ్లు రాచి
గీ॥ నెఱికురులు చారునాసలు నిబ్బరంపు
గుబ్బ చన్నులుఁ దొడల పెక్కువయుగలుగు
మృగవధూజీప శుద్ధాంత మీననయన
లర్చనము సేసి కొలిచిరయ్యాలు మగల॥ (1-128)

పై రెండు పద్యములఁ బొగడినవారిలోఁ చాలమందిని యీ పద్యముల కర్థమేమని యడిగితిని—నాకు దెలియనిది వారికిని దెలియదు. నాకు దెలిసినంత వారికి దెలియును ఇంతకీ పద్యముల కిప్పటికిని నాకు తృప్తిగా నర్థము తెలియదు. ఎవరైన దెలిపిన సంతోషపడుదును. అందు లోను రెండవ పద్యమైనను కొంతకొంత యర్థమైనట్లు భాసించునేగాని మొదటిదిమాత్రము నా పాలిటికి బండ కాని యీ రెంటిని జదివినపుడు నాకుగూడ నేమో యానందమే యగును. వానికర్థముదెలిసినట్లే భ్రాంతి. ఈ భ్రాంతికి కారణమేమని నన్ను నేనే యెన్నిసారులో యడిగికొన్నాను దానికిఁ గారణము నాకు దోచునదిది "జలజలరాల్చు", "గిలికొట్టు" "పండువెన్నెలతేట — బొఘళము" "మేలిపూగుత్తులు, జేగురుదిరికెలు" మొదలగు చల్లని పదములీ చాకచక్యముతో జూపుచున్నవి. అవి మన సిచ్చినట్లు నటించుచు హృదయమున దానివ్వక పైపై వెన్నెలలో భ్రమింపజేయు వెలయాండ్రవలె అర్థముగాకున్న నైనట్లు మనలను మోహ పుచ్చుచున్నవి ఇట్టిపద్యములు కొన్ని నాచనసోమునియందును గలవు.

రామకృష్ణకవి వ్యక్తిత్వమంతయు వాని భావస్వాతంత్ర్యములో నున్నది. ఇంతకుముందు మనము చెప్పిన గుణములన్నియు వాని

యుంగవావములే వానియాత్మ, భావస్వాతంత్ర్యము కొన్నిచోటుల నందముగ లేకున్నమానె నా భావము నాదియైన జ్ఞానమనెడి పట్టువల యాతండి

విచారి వేమాద్రి మంత్రిని కెప్తెని ప్రశంసించెను.—

క॥ అంధకరింపు గంధద్రుమ
గంధాంధ ద్విప విపక్ష గరుడత్రోటీ
బాంధవ బంధుర కీర్తి సు
గంధిల భువనత్రయునకు ఘనవినయునకున్—

అనెను. ఇందులో నన్నియు దెల్లని వస్తువులే. ఈ రగడలో "గరుడ త్రోటి" యెక్కడ దోచెనో వానికి—అదియేమి, మల్లెనా - మొల్లనా? కాని యాతనికవితట్టుము నయాసము చెప్పునది నేనుజెప్పలేనని వానితృప్తి. అట్లే కోనప్రభుని ప్రశంసించును :—

క॥ గానకళా తుంబురుడన
గానయవిద్యా వివేక గౌరవలక్ష్మీ
జాని యనంగానిద్ధర
గోన ప్రభుడొప్పె మంత్రికులతిలకంబై॥

అని పలికినాడు. నారదుడు తుంబురుని గుఱ్ఱపు మూతిపాటకానందించిన వారిద్దరే। కళాపూర్ణోదయమునందు సూచిన్న—పాండురంగ మాహాత్మ్యమున నీతడు—సూచిన్నగూడ వీణా వాదనమునందే యాతనిని మెచ్చుకొన్నాడు ఇతడన్నిటియందును దుంబురునికే సర్టిఫికెట్టు నిచ్చినాడు గ్రహచారము వచ్చునై యెవ్వరైనను తుంబురునిది "గుఱ్ఱపుపాట" యన్నారా? రామకృష్ణుడు మన మాట ముగియకముందే నారదుని "దాసరిపాట" యనును. కాని యిట్టి సందర్భములెక్కడో యరుదు.

అగస్త్య మహాముని వచ్చినపుడు వింధ్యభూధరము, "భయా హతి బిలాంతర స్థలిజొచ్చు కుళీరమువలె పొంకము బింకముదక్కి." నేలలో నడగినదట. ఈ కుళీరోపమానము వానికి తప్ప మరెవ్వరికిని దోచునదే గాదు. ఇక దోచిన శ్రీనాథునకు దోచవలె. ఆ రామకృష్ణ కవి సృష్టించిన ప్రమథులు "కరటిదైతేయకుంభముక్తాలలామ హారిభుజ మధ్యములవారు" అగస్త్యుని యాశ్రమమునందు—చలకాక పక్షమస్తకులైన బ్రహ్మచారులు—నిజహోమ సౌరభేయాతర్ణకముల నీడల నిల్చి కాచియున్నారట! ఈ భావ మెంత స్వతంత్రమో యంత రమణీయము. అట్లే కాశికానగరమును జెప్పుచు నీ పీసమును జెప్పెను.

సీ॥ మారుతాహతిరాలు నారికేళ ఫలాళి
 విడిసి జల్లించు పుండ్రేక్షురసము
చిలుకపోటులచేత జరిగిన సహకార
 ఫలములఁదొరగినఁ బచ్చితేనె
చిక్రోడ దంష్ట్రిలు చెక్కుసుగంధియ
 నంటి పండ్లనుగారు నవ్యసుధయుఁ
బాకకేళారంభ పరిపాటి దమయంత
 బగిలిన బనస క్రొంబండ్లబేప.

గీ॥ మేకమైకాలువలుకట్టి యేకహేల
బలువనందలి క్రియ్యూటపసిమితేట
బందునవ్వీట ముక్కారుబసిడిగారు
పరసధాన్యంబుమ్ముంచి రాజనపుచేల॥

చిలుకపోటులు—చిక్రోడదంష్ట్రిలు—మారుతాహతులు—మన తెన్నాలి వారి గ్గిత భావనలు. అతని కల్పనలు, అతిలోకములై మహాస్వతంత్రి

ములుగ నుండును. అట్టివి సృష్టించుటలో నొక రాయలు దప్ప రామకృష్ణునితో బోటీకి నిలుచువారెవ్వరును లేరు।

నారద మహర్షికి దెలుపకుండనే తక్కిన మునులు శివునితోఁ దత్త్వబోధ విన్నారు. అంతయు బూర్తియయి వారు లేచి వచ్చునపుడు వేయిండ్ల పూజారి నారదుఁడు ఎదురువచ్చెను జరిగినకథ యేమని విచారించినాడు. ఇకనేమున్నది? కొంప మునిగిపోయినది. అప్పుడు హుటాహుటి నారదుఁడు హరుని దగ్గరకు వచ్చినాడు. ఆ నారమునికి శంకరుడవసరమిచ్చెను. శంకరుని చంద్రమఃకళ యిట్లుండెనట. విడువని వైరవృత్తితో దరివేచిన రతీశుని చేతిగత్తి నెక్కుడు రభసముగా శిరస్సు గ్రుద్దెను. ఆయలుగంతయు లోననే యిరుకుకొన్నది. చంద్రమఃకళ "బహిస్థ తత్సరుపఘార్పితసూకర దంష్ట్రవలె నున్నది. (2-191) ఇది యతిలోకమగు కల్పన, రాయలుగూడ నిట్టిదే యొక కల్పన గల్పించినాడు. శ్రీ మహావిష్ణువు ధరించిన నందకము, విజ్ఞానదీపాంకురాకృతిగ నుండెనట. ఆ పరమ శివుని చర్మాంబరమునుఁగూర్చి కవి యిట్లనెను:—

చ॥ ఉపమసుపాడి మోముతడి యొత్తిన హత్తిన తన్నిశాంక దృ
క్కమల దళాంజనాంకకుళకంబుగ నిమ్మగుచేలఁగేలి వి
భ్రమరతి గప్పినాడనగఁ బచ్చని నల్లని చారలన్ మనో
రమమగు ద్వీపిరాడజినరత్నము యత్నము మెఱవాఱ్చుచున్॥

మనమిటనొక కథఁ జెప్పుకొనవలెను. ఒకనాడట—పార్వతీదేవి పసుపాడినదట। అపుడామె యొకచేలముతో మోము తడి యొత్తుకొన్నది। అపుడా వస్త్రము నామెటూసికొన్న పసుపు చారలుచారలై యుండెను. కన్నులనుంచి కొన్న కాటుకయునైనది. ఆ వస్త్రమునుజూచి భ్రమసి పరమశివుడు—పార్వతీ ప్రణయచిహ్నముగా దానిని దరించెను అదియే

శార్దూలచర్మమైనది. ఇంతకును శివుని పులితోలుపై నల్లని పచ్చని చారలుండుటలో కవి కలమున నింతకథ పుట్టినది. ఈ క్రింది వర్ణనలో నొక్కటియైన వితర కవులలో దొరకెడు నుపమానమున్నదేమో తమరే చెప్పుడు! మూర్త్యర్చనా విధానమును వివరించుచు రామకృష్ణుడు:—

సీ॥ గంగగాటుకకొండ గప్పునొప్పిదముద
లొక్కత్తె నావులపాల నోలలార్చి
బలితంపు మధువుజొంపము ధార్తరాష్ట్రింబు
జుట్టిన క్రియదెల్ల పట్టుగట్టి
ముదురువెన్నెల యొప్పు మున్నీటి గమిచి ప
ట్టిన లీల గ్రాలజందనము బూసి
వడగండ్లు పొడువు శాద్వలమహిబొల్చు పొ
ల్పుగ మల్లెపూవులఁ బూజజేసి—

గీ॥ మండువేసవి వాసవి మనుపుకాపు
విబుధ తతిపాలి లీదరవెల్ల బ్రాకు
భక్తసులభుని దెలిచి పూర్వోక్తభూం
భక్ష్య భోజ్యాదులర్పింప భద్రమొదవు॥ (2-109)

ఇట్టి వొకటి రెండు - పది యిరవై యనవీలులేదు రామకృష్ణుని స్వరూపమే యట్టిది. వాని కాశి, శీతాహార్యసుతాశిసిరికచ రాజీవము, మోక్షోపాయ దుగ్ధాబ్ధి వేలాతీరావని ఢుంఠినామక గజాలానము గంగామృత స్రోస్సితోనిస్స్రితి చంద్రగోళము, "అతని శారద" "వర్ణద్రాక్షాఫలకీరి" "రాజతాహార్యమాతని దృష్టికొకగోరాజము" చంద్రశేఖరుడు దానిమూపరము. దాని సమీపమున బారుచుండు, "అచ్యుతచరణాబ్జమరందధార" గంగానది యాగోవునకు గంగడోలట! ఇట్టివెన్నియని యుదాహరించుట.

ఈ క్రిందిపద్యము నూత్నము, సుందరముగూడ, అగస్త్యుడును లోపాముద్రయు, దక్షిణాపథము వెంటబడి, కుంతల దేశ ప్రాంతములలోఁ బోవుచున్నారు. అపుడు మధ్యాహ్నమయ్యెను ! ఆసంగతి కుంభోద్భవుఁడు మహారసికముగ భార్యతో నెచ్చరించుచున్నాడు:—

సీ॥ పద్మినీ బద్మాత పత్రంబు శిథిల ప
త్రాగమైరాయంచ యాశ్రయించె।
దాత్యుశ్రవత్సైన జాలంబుతో ఘోటి
పంచలరొంపిఁగలంచి యాడె।
టూరోద్గమద్దావ ధూమమంబుదబుద్ధి
నెమ్మిలో పొదనుండి నిక్కిజూచె।
జఠరస్థ జలమునాపానాళమునఁ బీల్చి
సామజంబిరుప్రక్క జల్లుకొనియె।

సరసిపై నీరు సలసలదెసలె విపిన
సకలవీధులు నిర్మృగోచ్ఛ్రయములయ్యె।
మట్టమధ్యాహ్నమిదిసుధా మధురవాణి।
యర్ఘ్యమిచ్చెఁబథి శ్రమంబపనయింప॥ (1-136)

దీనియందు రెండవ పాదమున కొంచెముగ గాళిదాసున్నాడు. దీనిని జదివినప్పుడు "ప్రియదర్శికా" నాటకములోని శ్రీ హర్షుని మధ్యాహ్న వర్ణనము నాస్మృతికి దట్టినది. స్వభావోక్తి భ్రాంతిమదలంకారములు జెనవేసికొన్న యీ రచన పెనుగొండలోని దాడిమీ వృక్షములవలె లలితసుందరముగ నున్నది. ఆ భావములను నడపిన శైలియయ్యాలలూగుతూ నేమో యొయ్యారముగ నడచిపోవుచున్నది.

రామకృష్ణకవి గొప్ప యాలంకారికుడు. అతదలంకారములు వాడి నప్పుడు వానియందేమాత్రము కొఱత లేక నిండుగా నుండును. ఒక్కొక సారి యలంకార రచనమునం దాతడు దుర్ఘటములగు పనులను జేసి మెప్పించును. నిగమశర్మ యొక మాలదానితో గాపురముసేసెను. ఒక నాడు వీడింటలేనపుడు వాని యిల్లంటుకొని బిడ్డలు, భార్య యందరు సమూలముగా హతమైపోయినారు. వాని సంస్కారము గూడ నాటిఁకిఁ బాక మునకు వచ్చినది. నిగమశర్మ కుయ్యో! మొఱ్ఱో! యని యేడ్చుచు, మొత్తుకొనుచు విషమాటవిలోఁ దిరుగ మొదలుపెట్టినాడు. తిరిగి తిరిగి కడకు నృసింహ తీర్థమునకు వచ్చినాడు. చావు తలపై నాడుచున్నది. ఆ స్థితిలో రామకృష్ణుడు కొట్టైడు పద్యి చూడుడు॥

సీ॥ ఒకయింత తెప్పవేయక చూచు బెలవారి
డిఁ గొట్టికొని దుఃఖ జలధి మునుగు
బిఁ ముతెఱవుమంచుఁ బ్రాథివిలో జొరఁ దు
సమధికస్తంభోద్భవము గమించు
తిరియుపాడునుఁబోలె దెసలకుఁ జెయిచాచు
దొరగునస్రాంబుధి దొప్పదోగు
హా! పోయితేయని యఱచు భార్యఁగురించి
బహువిధాసక్తి విభ్రాంతిబొందు

గీ॥ చేరగారాని దర్శనస్థితి వహించు
బాడబస్ఫూర్తిలో గొన్న పగిదినుండు
దానవారాతిగాబూని దదవతార
దశకమును మున్నెఁదాల్చెనా ధరణిసురుడు॥ (3-102)

అవి దశావతారములు వరించి ఘనమైన శేషాలంకారమును వాడెను॥

కాని యిటనున్న తమాష యేమనగా మనకిచట నలంకారము నడచుచున్నదనుమాటయే జ్ఞాపకమునకు రాదు! రసానుభూతినుండి మన హృదయ మావంతయుఁ బ్రక్కకు జరుగుటలేదు. దానికి గారణమిచటి శ్లేష లేఁదమలపాకువలె చాల లలితముగ సాగిపోవుచున్నది. అటుగాక యీ యలంకారము యే కొంత మన బుద్ధికి పనిబెట్టియుండినను రసానుభూతి పాడై చమత్కారము ప్రధానమైఁ గూర్చొని యుండెడిది.

ఏదైన నొక వస్తువునుగాని సన్నివేశమునుగాని వర్ణింపవలసివచ్చినపుడు ఆ మహాకవికి దొరకని పదార్థములే వేవు! వాడూహించు నూహలే వేరు! అతడు బతుకు తీరే వేరు! గౌరవదూపదైన నిగమశర్మ పదను దివిసిన కస్తూరియట! ప్రాచియలరట! పాయబాటిన కూకు! వాడు నీర్వట్టునుడుగు గళితమణియగు సొమ్మువలె వాడు గాన్పించినాడట! స్త్రీల సన్నచంద్రిక మోవిమాధుర్యము పొన్నాకుపై తేనె! అంగ చంపకదామగంధములు—ఆరని బుగబుగలట! పాలిండ్లబీరము—పరనున్న పండ్లసంపద పెంపు. వలమానకచభరపరికటనము—అభ్రిచ్ఛాయ! నిగమశర్మ యూరియందుఁ బారాడెడునప్పుడు గాలికి రెపరెపలాడు తాళగోణపు జుంగు బహు సంకుమద గంధ పాణింధమ మని వర్ణించినాడు. ఈ పాణింధమ శబ్దము నిచట వాడిన కవి యూహకొక కనకాభిషేకమే జేయవచ్చును. పలుపోకలఁ బోవుచుండెడి నిగమశర్మ ఉహ్వాన హోమాగ్ని యూవనొల్లడట! ఆ ధ్వన్యనుకరణము వానితమాష, ఇట్లతనిలో విశేషములు వెదకివెదకి మనము వేసరవలెనేగాని వాడు—"చమత్కృతులపుట్ట—వైశిష్ట్యములగని."

రామకృష్ణుని దేశాభిమానము చాల గాఢము. కుంతలదేశ మన్నంత నా మహానుభావునికిఁ బ్రాణములు లేచివచ్చును. సామిమల

యనగా నేటి హంపి సమీపముననున్న సొండూరుకొండలే! ఆపర్వతము నందు కుమారస్వామి యాలయము చాల ప్రాచీనము నేటికిని యున్నది. ఆ స్వామి దర్శనమునకు స్త్రీలు బోవరు. ఆ కుంతలదేశమున కుమార రాముని కథయొకటి జరిగినది. ఆ కథయు మన సారంగధరుని గాథ వంటిదే. దానికిని కుమారస్వామి దర్శనమునకు స్త్రీలు వెళ్లకుండు నాచారమునకును నేమైన సంబంధముండునేమో? దేవునికెఱుక; సామిమలయందలి కుమారస్వామికి గొప్ప సంబంధము గ్రంథమునందుంచుట రామకృష్ణుని దేశభక్తికి స్ఫోరకము.

కాశినుండి వెడలిన యగస్త్యుడు వింధ్యమును దాటి త్రోవలో గొల్లాపురీ లక్ష్మిని సేవించి కుంతలదేశమునకు వచ్చినాడు. కనుక కవి ఈ నడుమ వర్ణించిన మృగవధాజీవ శుద్ధాంత మీననయనలు శ్రీశైలము వారాయని నా యనుమానము

కుంతలదేశ ప్రాంతము దరిసిన వెంటనే కవి కలము వింతగా కుణియ నారంభించినది "పంపాతరంగ రింఖణ ఝుంపా సంపాత్యమాన జలకణరేఖా సంపాత శీతలానిలసంపద" మహర్షియగు నగస్త్యుని హృదయమునకుఁగూడ నొక క్రొత్త చక్కిలిగింత పెట్టెను. అటనుండి సుమారిరువది పద్యములలో నా ప్రాంతముల వర్ణించుచు రామకృష్ణుడు దన యుత్తమ కవితాశక్తిని బ్రదర్శించినాడు. "మహాకవికి" "గంగా స్నానం" తుంగాపానమన్న వాక్కు జ్ఞాపకమువచ్చినదిగాబోలు! గంగా నదిలో తుంగమ్మ కభిన్నతను గల్పించి

క॥ నటనోద్భటుడైన మహా
నటుని జటాజూటము లినందొరగు మను
త్కటకనది—

యని వర్ణించెను. ఈ పద్యమున నతడు వాడిన "యఘముఖముద్రణా" అను పదముగూడ గంగను దృష్టిలో బెట్టుకొని వాడినదే: చాల కాలము నుండి గంగ "పాపభంగ" యను మాట ప్రసిద్ధముగదా? భాగీరథీ గంగలోన భేదమును జెప్పుటతో మహా కవికి తుంగభద్రపైనున్న యభిమానము తృప్తిపడలేదు. అందుచే.

శా॥ గంగాసంగమ మిచ్ఛగించునెమదిణా గావేరి దేవేరిగా
వంగీకారమొనర్చునే యమునతో నానందముణాగల్గునే.
రంగత్తుంగ తరంగ దోలికల నా రత్నాకరేంద్రుండు నీ
తుంగంబంటి సుఖించునేని గుణభద్రా। తుంగభద్రానదీ।
(1-139)

అని యానదిపైగల యమితాభిమానమున యెద విఱచికొని చెప్పెను. మఱల

కం॥ ఓపును భూపరిధింగల యాపగ లవి బాహ్యతాప మాపగ నీవే
యోపుదుగా యంతర్గత, తాపత్రయమడప నో యుదన్వన్మహిళా।
(1-140)

యని యందుకొన్నాడు. నిజముగా తుంగభద్రపై మహాకవికిగల యభిమానము చాల కరుణముగానున్నది[Pathetic]. తళ్లికోట యుద్ధానంతరము విజయనగరము పాడైనను, పెనుగొండ యందును చంద్రగిరి యందు నున్న నారవీటిరాజులు విద్యానగరాధిపతుల మనియే జెప్పిరి. దానములు గొంతకాలమువరకుఁ బంపావిరూపాక్ష సన్నిధినిగావించినట్లే- శాసనముల జెక్కించెడివారు. విద్యానగరముపై నా నరపతుల కంతటి

యభిమానము. వారి కవులకును విద్యానగరాంధ్రులకున్నంత ప్రాభవము - ఈ పద్యములకు వెనుక నా మహాకవివిషాద మెంత యున్నదో ? తెన్నాలికవి తన కావ్యమునం దచ్చటచ్చట అనివార్యముగా సమకాలికాభిప్రాయములను సాక్షాత్తుగనో పర్యాయముగనో స్పృశించుచు బోయినాఁడు అవి యీ క్రింది పట్టులు

క॥ పెనుగొండ యితనిధైర్యము పెనుగొండగు నపని నెదిరి భీతిబరగ॥ (1–58)

ఇచట మహాకవి స్పష్టముగా పెనుగొండ దుర్గమును గురించి చెప్పినాడు. కుంతలదేశ దుర్గములలో గుత్తిదుర్గమునకు దరువాత నరినిర్భేదకమైనది పెనుగొండ దుర్గము. నిగమశర్మోపాఖ్యానమునందు వాటిని గురించి రామకృష్ణుడు

క॥ అతడు కళింగోద్భవుడగు
కతమున నో వ్రేలజూపఁ గనుగందక యో
గ్యతమ స్వీకారమునకు
నితరుంపై యుండె మునికులేశ్వర వింటే (3 17)

విజయనగర సామ్రాజ్య మేర్పడిననాటినుండి కళింగదేశముతో విద్యానగరపు రాజులకు గడబిడలుండెడివి। రాయలకాలమున నవి తీవ్రములయ్యెను కడకు రాయలతో గళింగులు సంబంధమునకు లొంగినారు కాని యది కాళింగులొప్పి చేసికొన్న సంబంధముగాదు. రాయలు కళింగ రాజున కల్లుడైనను మనసులో దవరవలుమాత్రము పోయినవిగావు. కన్నడ రాయడు మరణించినంతనే గజపతి కుంతలముపై నెత్తి వచ్చినాడు, మరల నళియరామరాజును వారితోఁ బోరెను. తల్లికోట యుద్ధమున కాళింగులు రామరాయలపైకి ప్రత్యర్థులనే మొగపోలిరి. అతని

మరణానంతరము వారు స్వతంత్రులైనారు. అందుచే కుంతలదేశ కళింగ దేశ జనములమధ్య పరస్పరాధిక్షేపములును, పరిహాసములును నుండెడివి. ఆ పరిహాసమునే రామకృష్ణుడు చేసినాడు. వెంకటపతి రాయల కాలమునకు కళింగము పర యధికారమునుండి వేరుపడియుండెను, గనుకనే పిఠాపురమును కళింగదేశాభరణముగా తెన్నాలికవి బలికినాడు.

క॥ ఎద్దెతనపు గై సేతల
రద్దులు నడచిరి పురస్సరద్భార్యముగా

గ్రామ జాతరను వర్ణించునపుడు కవి ఈ మాటనెను. కృష్ణరాయల కాలమునుండి తెడ్లన్ననేమో కుంతలదేశ్యులకు (పరిహాసము). ఇక రాయలకన్ననో తెడ్ల పరిహాసమన్న పెల్లము దొరికినట్లే. వెర్రి వెర్రి యలంకారములతో జాతర యందు తెడ్లు బయలుదేరునట!

తెన్నాలి రామకృష్ణుడు రాజ సంస్థానములలో దిరిగినవాడుగదా: అందుచే నా సభలయందలి మర్యాదలన్నియు నాతనికి సమగ్రముగ దెలియును. ఆ విశేషములను గన్నులకు గట్టినట్లు కావ్యమున వర్ణించెను: పరమ శివుని సేవింపను మునిజనముతో వచ్చిన కుమారస్వామి - పరమేశ్వరుడు తన తండ్రియేగదా! యని మొరటుగ పోలేదు! అది రాజమర్యాద గాదు. తొలుత గణములతో అవసరమిచ్చుటకు వీలగునా యని చెప్పి పుచ్చినాడు వారు వచ్చి ఘటితకరకిసలయులై

క॥ దేవ! యగస్త్యాదికముని సేవితుడై వచ్చినాడు సేనాని —భవ
త్సేవార్థియగుచు నతడిట రావచ్చునో!

అని విన్నవించిరి. శివుడు "మంచి"దనెను. అప్పుడు కుమారుడు వీరి యు బెరసించి వివిధరత్నకనకాలు కాంచితంబగు బ్రక్కించి యుంచినాడు

ఉదిరి బంగరువ్రాత పోంబట్టువలెవాలు సవరించి కటిస్థలిని జుట్టినాడు.
అనుయాయి వృషభక హస్తాంతరన్యస్తమైన యుపహారోచితార్థమును దానె
యుద్వహించినాడు! తనకన్నముందే యంగుళీ సంజ్ఞతో సంయములను
ప్రత్యేకముగ లోనికంపి పిదప తాను నడచెను. అతడు బోవుచున్నపుడు
ద్వారపార్శ్వస్థవేదికాపటలి యందున్న జగద్రక్షివర్గము, బంకిరియారుభటి
వరలు, వలయి మకుటాదికంబుగ నిలచి మ్రొక్కిరి. (1-198)
ఇట్లు పోయి కుమారస్వామి తండ్రికి దాను దెచ్చిన ములుపాలు సమ
ర్పించి నమస్కరించెనట. అది రాజమర్యాద!

మరియొక సందర్భమున కైలాసమునకున్న పరమశివుని నార
దుడు దరిసింపబోయినాడు అతని కెక్కడగూడ నిరాఘాటపాటి!
ఏవైనన్నులు నారదున కవసరములేదు! అతడు బోయినాడుగదా!
మేముమాత్ర మెందుకుబోగూడదని బలిభిన్ముఖామరులు యూరినారు,
తోడనే దేవేంద్రునితలపై "తండు" సువర్ణదండము ఘోషమున్నది. (2-198)
ఈ పద్యము వ్రాయునప్పుడు తాను పిల్లకవిగా నుండినప్పుడు గలిగిన
యనుభవము రామకృష్ణునకు జ్ఞాపకము వచ్చెనేమో? అది రాజమర్యాద!
కవి యక్కడక్కడ గావ్యమున దన లోకానుభవమునుగూడ వచించును.
నిగమశర్మోపాఖ్యానమున 'మృత్యురూపములైన సాహులవే ఋణాగ్రాహి
యగును' అన్నాడు వారికము పోసికిగూడ జీవితమున గొంత యంటి
నదేమో! కర్ణు నొదలనె భారత సంహిత విల్లు చాచ్చునట— ఈమాట
కుమారవ్యాసుని భారతమును దృష్టిలో నుంచుకొని జెప్పినాదేమోయని
నా యూహ. ఇట్టి సందర్భములు చాలనున్నవి.

ఒక కావ్యముయొక్క మేలిమిని నిర్ణయించునపుడు—దీనియందు
నాటి సామాన్య ప్రజాజీవన మెంతవరకు జిత్రింపబడినది, యని వేయు

మాకము గూడ నొకటి. నాకు జూడ పాండురంగ మాహాత్మ్యము, కాళహస్తి మాహాత్మ్యము, ఆముక్తమాల్యద, కళాపూర్ణోదయము మొదలగు గ్రంథములలో నదియే యొక ప్రధాన విషయముగా గైకొని పలుకవలసి నంత గొప్పది. ఇప్పటికే యీ వ్యాసమును చాల మీరిము నడచితిమి. కనుక స్థాలీపులాకన్యాయమున కొన్నిటిని మాత్రమే జూపింతును. నాటి సామాన్య బ్రాహ్మణ గృహస్థు జీవనము తలగడుగు అంగమర్దనము ఘాతపటావరణాంబు సంస్కృతోజ్వల కలమాన్న భోజనములలో నుండెడిది. నాఁడు మగవాడుగూడ నాడువారివలెనే లక్షణముగఁ బూలు ధరించెడివాఁడు. నేడు మనకది యనాగరికత! అప్పనప్పు. తమదగు నొక పదార్థమే నిలిపికొను నర్హతలేని శూద్రజాతికి, బరానుకరణమే పరమ గౌరవము. మగవారు గూడ నానాళ్లలో బంగారు సొమ్ములు ధరించు చుండిరి. స్నానపానాదులందు బంగారు నీరు శరీరముపైబడుట సమస్త చర్మరోగములకును మందు. సువర్ణ స్పర్శముతో నీరు కడుపులోనికి బోయిన శరీరమున కారోగ్యమును వర్చస్సును గలుగును. ఈ మాట మన వైద్యశాస్త్రము చెప్పుచున్నది. నవనాగరికతా ప్రభావముతో కడుపు నకేలేని మనకు బొడవు లెక్కడనుండి వచ్చును? కాని నాకు చాల బాధాకరమగు విషయమేదనగా మనవారిని జూచి మగువలుగూడ కరము లందున్న కంకణాదులు దీసివేసి వానికిబదులు తుక్కుతోలు బెల్టులతో రిస్టువాచులు ధరించుచున్నారు. భూషణరహితమైన స్త్రీల కంఠములు జూచినపుడు నాకు కొంగలమెడలు జ్ఞాపకమునకు వచ్చును. కర్ణాట దేశమువారికి గపురంపు వీడ్యముపైనున్న శ్రద్ధ దేనియందును లేదు. వారి రాజులు విదేశ రాయబారులకు కనకాంబరాభరణాదులతోఁబాటు గప్పురంపు విడెమును గౌరవమునకై యిచ్చిరి. ఆ కవులకు "జాంబూ

నదాగ్రహారములెన్ని యిచ్చినను" కస్తూరి విడెములేని మరియావలపై మురిపెములేదు. ప్రణయినీ ప్రణయులా సమయములలో దమ ప్రేమను దెలిపికొనుటకై తాంబూలమునే యిచ్చికొనిరి. విడెమును సేవించుట రసికతమాత్రమే గాక యారోగ్యప్రదముగూడ। నేడు తాంబూలము వేసికొనుట కిష్టపడనివారు నా స్నేహితులే చాలామంది యున్నారు. అది వారి యభాగ్యము. స్త్రీలకుగూడ నీనడుమ యీ రోగము చిన్నచిన్నగా వ్యాపించుచున్నది. ఇవన్నియు జీవితమున పనిలేని హంగులని వారి యూహ. ఈ జాతి మనుష్యులనేమనవలెనో నాకు దోచుటలేదు.

గాలిగంగల జాతర వచ్చినపుడు పామరప్రమదలు:

గోర్వెచ్చ జమురంటుకొనిరి మస్తకముల
జలక మాడిరి నిశామిశితవారి
కట్టిరి చిఱుత చౌకముల కొంబుట్టముల్
కాటుకఁదీర్చిరి కన్నుగవల
దిద్దిరి సిందూర తిలకంబు బటువుగా
నిక్కుగొప్పుల విరుల్ గ్రుక్కిఁదిద్ది
నిండ ప్రవాళ మాల్యంబులు వైచిరి
చిట్టిపొట్టి ధరించి రిట్టువట్టు.

గీ॥ తరుణ ధావన ధగధగద్దశనమణుల
హత్తు కొల్పిరి కేతపీర్యములదాలు
పర్వదినములఁ బామర ప్రమద లుదిత
వియమ పంభావనారంభ విభృతబుద్ధి (3-74)

స్త్రీల స్నానమునకు పసుపాడుట యనియే పేరు. పసుపారోగ్యదాయి

కము, రోగహరము. కాటుక కన్నులకు నిగనిగలు గలిగించును. దృష్టి రోగములఁ బోగొట్టును. నా చిన్నతనంబునందు గూడ నిరివి వెండులు ధరించెడివారు. నేటికి వాని గుణములను వివరింపవలసివచ్చినందులకు నాకు సిగ్గగుచున్నది. చూడ చూడ కుంకుమాంకముగూడ కోమలుల ముఖమండలమునుండి బాయునాయేమి? పామరులు శక్తిజాతరందీరీతిగ సేవలుసేసిరట. ఒకతె పిడి మ్రానియందు వ్రేలినది. ఆమె యంభో ధరముక్రింద నసియాడు నైరావతివలె నుండినది। మరియొకతె విప్పు చేట దూకెను. అది చెందమ్మి కొలనియందు రంజిల్లు హంసవలె నుండి నది. ఒక స్త్రీ పందిరి గుందమీగినది. ఆమె యొప్పు తొలిసంజె యెండ వర్తిలు జక్కవ ననుకరించెను. అనటియాకుపై నొకతీగబోడి నర్తన మాడినది. అది జలనీలిపైనెక్కు కలువమొగ్గవలె నుండెనట. ఒకకాంత గందమూపులిచ్చెను. ఒకతె మారుగాలిచ్చినది. ఇంకొకతె నోరి తాళము లిచ్చినది. ఈ వేడుకలలో జాలవరకు, మొన్నమొన్నటివరకుఁ బల్లె సీమలలో జరుగుచుండినవే।

పుండరీకుఁడు చనతండ్రి కగ్నివెల్వించి యాయన విష్ణు సహస్ర నామ పారమొనరించునప్పుడు కవలు వోకుండ దోడుపడెడువాడట. అనగా నానాటి బ్రాహ్మణ గృహస్థులకు సంధ్యావందనమైనంతనే సాధా రణముగ విష్ణు సహస్రనామ పారాయణ సేయుటలవాటన్న మాట రామ కృష్ణుడు గావించిన ఋతువర్ణనమందుగూడ నిట్టి వర్ణనములు చాలగలవు. చూచికొన బ్రార్థింతును.

తెన్నాలి కవి కొంత హాస్యప్రియుడని ముందే విన్నవించితిని. దానిని బోషించుటయందాత డనేక బాకములెఱుగును. హాస్యరసమనగా సాధారణముగ నేటి సినిమారంగములలో సేయునట్లు పొట్ట యుబ్బించి

గ్రుడ్లు మిట్టించి మొగము పలువికారములు గావించికొని కూర్చున్న యమ్మలక్కలను పండ్లిగిలింపజేయుటగాదు. అది చాల మోటుహాస్యము. వారాహాస్యమును నాలుగణాల టిక్కెట్టు నాగరీకులను మెప్పింపజేయు టకో స్వభావముగ తమకే సరసత్వము చాలకయో చేయుదురు. మహాకవి, యట్లు సేయడు. వాడొక శబ్దసంయోజనముతో నవ్వించును. ఒక ధ్వనితో మందహాసమెలయజేయును. ఆ ధ్వని యర్థముగానివారిని జూచి యాతడు నవ్వును. అట్టి నిగూఢ హాస్యమును నిగమశర్మోపాఖ్యానమునందొకటి సేసినాడు చూడుడు. సభాపతికి ధనము–ధాన్యము కావలసిన సంపత్తులన్నియు నున్నవి గాని యింటి కలంకారమైన కొడుకు లేడు. అందుచే సభాపతి భార్య దైవసేవ గావించెనట. చేసినది యేదో సామాన్యముగ జేసినదా! ఆమె తపస్సునకు భయపడి యిల్లువాకిలివిడచి నింగివేల్పులు నింగికి బరువెత్తినారట కట్టకడకు వారి కృపాభ్యుదయ మహిమ పండి యొకానొక కుమారుడు బుట్టినాడు. వాడే నిగమశర్మ. వాడు సకల కల్యాణ గుణాభిరాముడు, చిన్ననాటినుండి "వాడనేక చదువులను జదివినాడు" కాని యేమిలాభము, ఆ చదువులన్నియు వాని స్వేచ్ఛా ప్రవృత్తికే దోహదమిచ్చినవి. మీనుమీసమువంటి యొంటిజందెముతో "సానితాకులుగల్గు కంఠముతో" యువతిభుక్త పరిధానయుక్తుడై యాజాతి మాత్రోపజీవి నగర ఘంటాపథములు నాలుగు మూలలఁ జుట్టుచుండెను, నిగమశర్మ యను పేరు నేతిబీరకాయయైనది. పైతృకమగు నాస్తిసర్వమును వానిచేతబడి "యురగదష్టుని మేనినెత్తురు"వలె చెడిచెటాకులైనది. కాపుకోడలితో వాడు కాపురము జేసినాడు. మాలదాని పంచనబడి మన్మథామ్నాయములు పల్లె వేసినాడు మానవుడెన్నిరీతుల చెడవచ్చునో, చెడిపోవునని మనమూహింపవచ్చునో యన్ని రీతుల చెడినాఁడు, అన్ని పాపములు వాడు చేసినాడు. ఇదియేమిః అన్యాయముగ

మన్నదే! ఈ మాత్రమునకా వాని తల్లి యందలుదేవతల కన్నిసేవలు చేసినది! ఈ సమస్య మనసులను తీవ్రముగ బాధించును. దీనికి తోడు రామకృష్ణుడు వాని యాగడములు వేరు వేరుగ వర్ణించి వర్ణించి మన బాధ నింకను రెచ్చగొట్టును. ఈ కవి యేమి యింత కర్కశుడుగనున్నాడు? ఈ ప్రశ్న కుత్తరము చెప్పుట దనవిధిగాదా యని తలపోతుము. కాని యుత్తరమితడు చెప్పినాడు పాపము! మనమారహస్యమును గనుగొన లేక దికమకపడుచున్నాము. కాని యితరవిషయములవలె నా సమాధాన మును వాడు పెంచి పెద్దచేయలేదు. అది వాని రచనలో వైశిష్ట్యము. చూడుడు, నిగమశర్మ మనసు ధార్మిక పురుషార్థమునకుఁ దాల్చినదే కాద నముచేత? దైవఘటనా వంశంబున (3-8). వాడు. మాలదాని బిడ్డలను జోకొట్టికొని నృసింహతీర్థమునకు వచ్చు వేళకు పూర్వసంస్కార తపః ఫలము చేరువచేరువై గడుపచేళమమైన (3-10) దట. ఈ మాటలకు పూర్వాపర సందర్భముల గల్పించుకొనగా దేలునదిది. నిగమశర్మ వాని పూర్వజన్మమున గొప్ప తపస్సు గావించిన యొక యోగభ్రష్టుడు. వాడీ జన్మమున ముక్తుడు గావలసినవాడు. అందుచేతనే వాడు శ్రీమంతులై, శుభులైన తల్లిదండ్రులకు జన్మించి ప్రాక్తన ఋణానుబంధములన్నియుఁ ద్రెంచికొని ముక్తుడైనాడు. నిగమశర్మను వశపరచుకొని యిన్ని నాటకములాడించినది, తప్పింపలేని దైవ ఘటనయే. ఈ మాటలలో రామకృష్ణుఁడు పురుషకారవాదమును శాశ్వతముగ పరిహాసము చేయుచున్నాడు. కాని యీ పరిహాసమును గొప్ప ధ్వనిగ నుంచినాడు. బహుళధ్వని పరీతంబగు సత్కవిత్వంబు వోలె (3-76) ఈ పలుకు తెనాలికవిదే!

ఇక గ్రంథ రచనయందు వాని హాస్యమున్నది. పుండరీకుని చరిత్ర చెప్పును. దాని ప్రక్కలో నేదేదో గొడవబెంచి నిగమశర్మ కథ వర్ణించినాడు. తరువాత చిలుకకథ, యోగకథ, దోమకథ యెవరైన

"విది యేమయ్యా వస్తుగౌరవమును జెలుపుచున్నావే" యన్నారా. వాడిచ్చు సమాధానమిది. మనుష్యులకన్న నవి యేమిదక్కువ? అవి యును భగవంతునిసేవ గావించినవి. భగవద్భక్తి లేక భగవంతుని మాహాత్మ్యమును వర్ణించిన పుస్తకమున దొసఁగులు వెదకు నీ జన్మ కంటె వాని పుట్టువు ఘనమైనదే. ఇకమాటాడునదేమున్నది? చప్పున నోరుమూసికొనవలసినదే. కావ్యమంతయు నెక్కడికదియే మొదలు. ఎక్కడికదియే కొన. వస్త్వైక్యములేదే యని ప్రశ్నించినచో సర్వ ప్రపంచములకును సాకార బ్రహ్మము, పాండురంగనిలో నైక్యములెమ్మని కవి యొసగు సమాధానము. దీని నెవ్వరు గాదనువారు?

రామకృష్ణకవి స్వభావమే హాస్యమయము. అతదే యుపమానము చెప్పినను యేమాట యన్నను దానిపైన గొంత హాస్యరసచ్ఛాయ యుండ వలసినదే! కుమారస్వామి వెంట ఈశ్వర దర్శనార్థమై ప్రమథగణములు గదలినారు. వారి యాభరణములు వర్ణించినాడు కవి. వారి వైభవము మనకు దెలియునుగదా! పాములు, కపాలములు, పులి చర్మములు, అవి యిట్లుండనీ, ఆ యాభరణముల నడుమ "బూదుపారగమేన బూది బూసినవారు" అన్నాడు. వారు వీభూతి బూసికొన్నారట అది యెట్లున్న దనగా నొడలంతయు బూజుపట్టినటులున్నదట! శ్రీనాధునివంటివాడది చూచిన రామకృష్ణుని యీ లోకమున నుండనివ్వఁడు. శ్రీ మహావిష్ణువును బుండరీకుఁడు గాఢముగ ధ్యానించునపుడాతని ధ్యానదృష్టిలో గృష్ణ భగవానుడు దోచునట! అపుడా కృష్ణుఁడు రుక్మిణినైన మరచినాడు గాని చలిది చిక్కమునుమాత్రము దగిలించుకొనియే వచ్చినాడు. ఆ చిక్కము ఆయన ముందు మీనావతారమైనందున ఆమహామహునిబట్టుటకు మునులు వేసిన భక్తి యనెడు వలవలె నున్నదట! చేతిలోనున్న శంఖము వెలిఁ తిగాఁ జవికొన్న వెన్నముద్ద యనిపించినది. ఇంతలో బుండరీకుని

దల్లిదండ్రులు గతించినారు. పుండరీకునకు సత్సంతానమై పిత్రాణము దీఱినది. సంసారపు జంజాటము జాలించికొని వాడు దైవమునకై బాసిక పట్టుబట్టినాఁడు. అతి కఠోరమగు దపస్సును అనేకవత్సరములు గావించెను; కృష్ణుని యాటలన్నియు సాగినవికావు. అతనికి దర్శనమివ్వనే యివ్వవలసివచ్చినది. పరమాత్మను చూచినవెంటనే పుండరీకుని యానంద మింతింతగాదు. "క్రొత్తపులునేపున" పులకలు శరీరమున నించినవి. చాల తడవు మాటాడలేకనేపోయినాడు. కడకు "దేవ! అస్మాకం శరణం త్వమేవ గతి రన్యోనాస్తి దుర్వాసనాపస్మారం హర" అని ఆమాంతముగ అడుగులమీద బడినాడట! ఇంత రసోన్మాదమనను సరించిన పుండరీకుఁడు విష్ణుస్తుతి నారంభించినాడయ్యా— అతని మొదటి వాక్యమును వినుఁడు.

సీ॥ పొదలునీ పొక్కిట పువ్వుకాన్పునగదా
పెనుమాయపిల్లలు బెట్టుబెల్ల (2-55)

ఇది చదివినవెంటనే పాఠకునకు ఫక్కుమని నవ్వువచ్చును. అంతకు ముందు వాడనుభవించుచూవచ్చిన తాదాత్మ్యము దూదిపింజవలె నెగిరిపోవును. నారదమహర్షియొక్క "యెఱ్ఱని జడల" సుషుమ్నానాడి యీనిన పిల్లవెలుగుల వడువున నుండెనట (2-172). మండుటెండలో దపించు బుండరీకుఁడు కడుపుబ్బించి లింగమువలె నున్నాడట. శ్రీ మహావిష్ణువు భవన ఘటనకు మొదలికంబమువలె సర్వలోకమునకు బ్రిధాను డట. ఈ రీతి నతడేదిజెప్పినను కొంత హాస్యమే నడచును! శంకరునిచే తత్త్వబోధను వినునవకాశమును బోగొట్టుకొన్న నారదుడుఁ—

ఉ॥ దక్కిన విష్ణుభక్తియు దృఢంపు విరక్తియు గల్గు నమ్మరు
ద్భుక్కొటకుఁ భజించు మతి పుట్టక కంపలఁబడ్డకాకినై
యక్కట? మోసపోయితిగదా! (2-184)

అని పశ్చాత్తాపపడును. నారదుని తాపమెట్లయిననాయె. దీని జదివినం తనే మనకు నవ్వువచ్చును. కాపుకోడలు దన్ను వలచుచున్నదని తెలిసినంతనే నిగమశర్మ

మ॥ భళిరా! తేరకుతేర దక్కెనిటు లీలంగారుకుందంచు జం
కలు దాటించుచు కెంపుమోవిదొడుకంగా గుబ్బపాలిండ్లు వి
ట్టలరంగా ముఖగంధ పారణముసేయంగా (3-67)

లొట్టలు వేసినాడట! ముఖ గంధ పారణ శబ్దనిర్మాణమున నెంతో హాస్యమును, దొడుకంగా అలరంగా, సేయంగా, అను నూతపదములలో గంపెడు హాస్యమునున్నది.

ఇట్టి హాస్యమేగాక దాని మఱుగున కొన్ని తమాషలు గూడఁ జేయుట వాఁడెఱుగును. నిగమశర్మ సొమ్ములు దొంగలించికొనిపోయి నప్పుడు విక్షేపమువంటి కొడుకు చెడిపోవుటకేద్వక.

సీ॥ శోకించు వృద్ధభూసురు డాత్మ పితృదత్త
దర్భ ముద్రికకు చిత్తంబు కలఁగ
నత్తగారిచ్చిన హరిసుదర్శనపుఁ బే
రునకు ముత్తయిదువ వనట బొందు
క్రొత్తగాజేయించికొన్న ముక్కరకునై
యదలు దుర్వారయై యాడుబిడ్డ

జామాతవేతఁబొందు వ్యామోహియై నవ
గ్రహకర్ణవేష్టన భ్రంశమునకు (౪-౬౦).

ఈ పీసమును జదివినవెంటనే మనకు ఫక్కుమని నవ్వువచ్చును. కాని తరువాత యానాటి బ్రాహ్మణుల పితృభక్తి యెంతటిదో వారిచ్చిన వస్తువులపై తత్సంతానమున కెట్టి భక్తియో నాటి కోడండ్రకు నత్తగారిపై నెంత భక్తియోగాక ప్రేమయుగూడనో మనకు జ్ఞాపకమునకువచ్చి యానాటి సౌమనస్యముల నెంచి రిక్తవడిపోదుము.

మాలవనిత మరణించినప్పుడు నిగమశర్మ 'తనయాలిని' దలచి యిట్లు పలవించును.

ఉ॥ ఎల్లరునెల్లచోఁ ధనములిచ్చి మృగాక్షుల గొండ్రుగానియో
పల్లవపాణి యేఁ బరమపావన వంశమునిచ్చికొంటి నీ
వల్లనిరూపు నిక్కమని నమ్మి ధృవం బది గాక నేఁడు వి
ద్యుల్లతికాధికాభినయ ధూర్వహమౌట యెఱుంగనింతయుఁగా.

ఉ॥ ఈ కడజాతినాతికి హిహీ! మహిదేవుఁడు చిక్కెనంచునఁగా
రాకకుఁబోకకున్ జనపరంపర కెంపగు చూడ్కిఁజూచియం
బూకృతమాచరించుటకు బుద్ధిదలంక కళంక ముక్తవం
ద్రాకృతిఁ బోల్చు నీముఖమునం దమృతస్థితిగాంచిమించుటఁగా.

ఉ॥ పుత్రులులేరె యెవ్వరికి భూమి మదన్వయవర్ధనుల్ భవ
త్పుత్రులవంటివారు మునుపుట్టరుగాక తదాస్యకాంతి త
ద్గాత్ర వివృద్ధి తద్భుజయుగ స్ఫురణంబు తదుక్తి లక్ష్మి త
న్నేత్రసరోజ వక్త్రరమణీయతఁ జూపఱఁజొక్కఁజేయవే.

ఇంతవరకును నిగమశర్మ చేతలు జేసికొనుచు వచ్చినాడేఁగాని పల్లెత్తు మాట యెక్కడను నెవ్వరితోడను పలికిన పాపమునబోలేదు. బ్రహ్మ దేవుడు వీనికి సర్వావయవములు సృజించి హృదయమును మాత్రము దీసివేసినాడా ? యని మనకనిపించుచుండును. కడకు ఒక్కసారి బావురు మని వానిలోని మనుష్యత్వము గడ్డకు వచ్చినవెంటనే "యయ్యో పాప" మని జాలిపడుదుము. పై పద్యములలో నేను విన్న కులము విచ్చి కొంటినే! యన్నపుడు "నల్లని రూ"పన్నపుడు "మాలసంతానమును" "మదన్వయ వర్ధను"లన్నపుడు మనకు నవ్వొకప్రక్కన వచ్చుచునే యుండును కాని యా హాస్యమును కరుణరసముక్రింద ద్రొక్కివేయును. రెండు రసములకు రామకృష్ణుడిచట పందెము బెట్టినాడు!

కథను నడపుటలో రామకృష్ణునకొక ప్రత్యేక శైలి యున్నది. సాధారణముగ నితరకవు లేసన్నివేశములను పెద్దగ వర్ణించి రసానుభూతి గలిగింప యత్నింతురో వాడు వానిని దాకనేదాకడు. ఒకవేళ జెప్పినను పరమసంక్షేపముగా జెప్పును.

తృతీయాశ్వాసమున సుమారు యేబది పద్యములతో రాధాదేవి యౌవనమును ఆమె సౌందర్యమును వర్ణించినాడు. "వెంటనే రాధా మాధవుం దనకు నధినాధుంగాగోరి" యని యామె తపస్సులోనికి ఔక్కలు గట్టికొని యెగిరినాడు. ఆమె తపోవర్ణనమును ఋతువులలో జోడించి నలువదిపద్యములవరకు వర్ణించెను. వేఱొక కవియైనచో నామె కృష్ణునెట్లు ప్రేమించినది, రాధా విరహము సుమారగ విస్తరించి చెప్పియుండును.

రామకృష్ణునిగురించి లోకులు కథయొకటి చెప్పెదరు. రాయల దగ్గర నొకనాడు చిత్రకారుడు బొమ్మ చిత్రించికొని వచ్చెనట. దానియం

దు(జోటుచాలక చిత్రము అనలలో కొన్నికొమ్మలు మాత్రము వేసినాడట. రాయలా కొమ్మల(జూచి "యిదియేమి" యని యడుగగా నా చిత్రికారుడు "ప్రభూ ఇవి చెట్లకొమ్మలు. ఈ ఫలకమునందు( జోటు చాలకుండుటచే చెట్ల మొదళ్లు మొదలగువానిని వ్రాయలేము. అవన్నియు నావైపున్నట్లు దమరూహించికొనవలె"నని మనవిసేసెనట! మనవాడుగూడ నప్పుడక్కడనేయున్నాడు. ఆ దినము తన యింటిగోడపై పొడవుగా, లావుగా, కుచ్చుగా కుంచెను దీసికొని గుఱ్ఱపు దోకలు గుత్తులువేసినాడు. మరుదినము రాయలకడకువచ్చి "ప్రభూ నిన్న తమరు చిత్తగించిన చిత్రమునకంటె గొప్ప చిత్రములు మా యింట నేను గీచినాను. దయసేయవలె"ననెను. రాయలు వచ్చి చూచునుగదా! అన్నియు తోకలున్నవి. వీడు దుర్మార్గుడని రాయలెఱుంగును. రాయలు నవ్వుచు "రామకృష్ణా! యీ చిత్రమేమిటి?" యన్నాడు. అప్పుడు తెన్నాలివాడు "ప్రభూ! యివన్నియు గుఱ్ఱముల దోకలు, గుఱ్ఱములు వెనుకనున్నట్లూహించికొనవలె"నన్నాడు. రాయలు పకపక నవ్వినాడు.

ఈ కథ నిజమో, అబద్ధమో మనకు దెలియదు, కాని వాని కవిత్వము మాత్రము గుఱ్ఱపు(దోకల కవిత్వమే. చెప్పవలసినచోట నే విషయమును జెప్ప(డు. ఎక్కడనో దేనినో చెప్పును. దాని నెక్కడనో ముడిపెట్టుకొమ్మనును. చూడుడు పుండరీకునకు దల్లిదండ్రులున్నారు. భార్యయున్నది. వాడుగుడ్డకు( గావలసినంత యాధారమున్నది. ఈ విషయములు మొదట జెప్పనేచెప్పడు. అలికులవేణి! విను, రచితాఖిల పుణ్యుడు అని యారంభించును. మరల నెక్కడో విహితమతిం బరిచారక సహాసమయి పిత్రుయుగంబు సంభావించుగా, అని పలుకును. ఇక నెక్కడనో-ప్రేయసి వలన పరిబోధ విధేయమతుల సుతుల(గాంచియనును. వీని నన్నిటిని మనము ముడిబెట్టుకొని యొక కొలికికి( దెచ్చికొనవలెను —

ఈ విధమైన శిల్పము నిగమశర్మోపాఖ్యానమున బరాకాష్ఠ నొందినది. కథారంభమిట్లగును :

"ప్రాసకు విత్తుపంటి నెఱపాఱుకొలంబున బుట్టి వేదముల్
వోసినగాదె శాస్త్రములు పుట్టినయి" ల్లని

సభాపతిని వర్ణించెను వర్ణించినవాని నక్కడ వదిలిపెట్టును. రెండవ పద్య మిది:

గీ॥ ఆ మహీసురు లేమకు నతులనిష్ఠ
నిఁగివేల్పుల నేలకు నేలవేల్పు
కొలము నింగికిఁదెచ్చుచు గొలువఁ బుత్రుఁ
బొక్కఁ డుదయించె దశక్రుపాభ్యుదయమహిమ.

పుత్రుఁడొక్కఁడుదయించె యనుదానికి "మహీసురులేమకు" ననుదానితో నన్వయము. దేవతలఁగొల్చినదెవ్వరు ఆమెయా? లేక, భర్తయా? లేక యిర్వురునా? ఏమో! ఇంతకు నామె పేరేమి? మొదటిపద్యములో చెప్పిన సభాపతి గతియేమి? ఇందులో నొక యౌచిత్యము. సభాపతి "భాసితద్యుతి". అందుచే వాని కొడుకును "జందుర్గుని పెన్నుద్ది" యట! మూడవ పద్యమున నప్పుడే నిగమశర్మవచ్చినాడు. వాడు "వనితామానససూనసాయకుఁడు, జీవత్తాతపాదుడు, భూజనసమ్మాన్యవిశుద్ధవర్తనుఁడు, ఉదంచత్త్యాగశీలుఁడు, వాచాలతలోనుతోక్కుఁడు, నూనూగుమీసాల బ్రాయమువాడు. నిగమశర్మ చాల పిట్టదశపు పిల్లవాడు, వ్యాసునివలె పుట్టుకతోడనే పెద్దపయసుతోఁ బుట్టినాడు, ఇట్లు తాను చెప్పక విడచినవన్నియు మనలనే యూహించికొమ్మనును. తన్నెవ్వరోఁ దరుముచున్నట్లు లొందరతొందరగ కథను దాటించుచున్నాడు. నిగమశర్మ చెడి

పోయినపుడు గురుజనము శిక్షించెనట. ఏమని శిక్షించెనో, వాడు మరల యింటికి వచ్చినపుడు వానితో మాటలాడినదొక్క యక్కయే! తల్లిదండ్రులయూసే యక్కరలేదు! కన్నతల్లి నిగమశర్మనొక్కమారైనను దగ్గరకు రమ్మనలేదా! నిగమశర్మ భార్యనుగురించి మనకేమియు దెలియదు. నిగమశర్మ యింటికి వచ్చినపుడు వానికామె యొక్కసారి మాత్రము వ్యాపృత నిజవిశ్వాసజ తాపమ్మున కొంతకొంత తప్తముకాగా పాదములు గడగినది. నిగమశర్మ అక్క వానికి హితము గఱపుచున్నపుడు "ఆమెకు పసిమి పసిడి పివవ" గైకొని వీడినది. అక్క అగ్నిసాక్షిగ బెండ్లాడిన నిల్లాలి నిల్లాలితాకారనొల్లవైతి వని మరదలియూసు ఒకసారి యెత్తినది. అప్పుడుగూడ నా ముద్దరాలేమి పలికినదేలేదు! వాడు సొమ్ములెత్తికొని పోయినతర్వాత మామగారు, అత్త, వదినె మొదలగువారందఱు పోయిన సొమ్ములకై బొగులుచున్నను ఆమె దేనికి నేడ్వలేదు ఆమెకేసొమ్ములును లేనేలేవో, ఒకవేళ నున్నను ప్రాణపదమైన మగడే లేనపుడు బంగారు సొమ్ములతో నేమని యూఱడిల్లెనో మనకుం దెలియదు. ఇంతకును నిగమశర్మ అక్కకును, భార్యకును రామకృష్ణుడు న్యాయకరణమే సేయలేదు ఇక మిగిలినది నిగమశర్మ బావ. వీడొక పక్కాటాయి మగనివంటివాడు. ఈ యగస్త్యభ్రాత కింటనున్న యధికారమెట్టిదో యీ క్రింది పద్యమున మనకు దెలియును!

క॥ ఆలో నొకనాడాడు
శ్రీలరతుని యక్కయోర్తు శిక్షించెద నీ
బాలికునని తనమగనిఁ
బాలర గొనివచ్చె నాత్మ భవనంబునకుఁ (3-23)

నిగమశర్మ చెడిపోయినాడనియు, వానిని సరిచేయవలెననియు నెంచిన

వానియక్క తన బాలురను భర్తను గలిపి యొక బుట్టలో వేసికొని పుట్టి నింటికి మోసికొని వచ్చెనట

కాపుకోడలును నిగమశర్మయు బోయలలో గలసినారు. వారు వేటాడి జీవించిరట. అంతేగాని దొంగతనము చేసినట్లు కవి యక్కడ జెప్పలేదు. కాని యమభటులుమాత్రము నిగమశర్మ "దారులఁ గొట్టినట్లు" విందింతురు ఆ నిందనుబట్టి వాని తెరువటుతనము మనమూహింప వలెను. అట్లే. కాపుకెంజిగురాకుబోడి పరలోకంబంద ప్రాపించుదుగా- మరల వాడు వ్యాపాదంబున నింకొక్కమాలదానివెంట బడినాడు. అది చచ్చిననాడైన వాడు కాసన్ని కన్నీరు బెట్టెనో లేదో॥ పై వానికన్నిటికి సమాధానములు మనము జెప్పికొనవలసినదే।

పళాపతి సంసారమును బరిచయము చేసినపుడు వారి సంపద యెంతో గవి చెప్పినవాఁడుగాఁడు. నడుమ బసిమి పసిడి వీవనమ మాత్రమొక్కసారి గడ్డకు దీసినాడు. మరల జూతముగదా, రామచంద్రా! వారికున్నంత ధనము విద్యానగరరాజులకు లేదు. నిగమశర్మ యెత్తుకొని పోయిన వస్తువుల జాబితా జూఁడుడు.

సీ॥ గోమేధికోపలాంకుర మానితంబులు
పుష్యరాగచ్ఛటా పుంఖితములు
వైడూర్యసంధాన వర్ణనీయంబులు
హరినీల కీలనాఢ్యంచితములు
కురువింద సందర్భ గురుతరంబులు చతు
ర్విధ వజ్రదళ సమావేల్లితములు
మహనీయతర హరిన్మణి పరీతంబులు
సకలుష స్థూలమౌక్తికయుతములు.

గీ॥ పద్మరాగ పరీరంభ భాస్వరములు
దంతవిద్రుమ కృతసముద్గకభృతములు॥ (3-48)

"మోవదరంబుగాని యీ సొమ్మునంతయు వాడు మోపుగట్టి" యమర్చు కొని నడువలేక ముక్కుచుం బోయెనట.

కథయందలి పాత్రలను హఠాత్తుగ ప్రవేశబెట్టుట రామకృష్ణుని రచానా సంవిధానమున నొక వైశిష్ట్యము. నిగమశర్మ దుష్కుదనమును గురించి యెవ్వరు చెప్పిరో హఠాత్తుగ పక్షివలె వాని యక్క యొక నాడు వ్రాలినది. ఆమె వచ్చుటకు ముందామె రావచ్చునను తలంపుగూడ మనకు ద్రోపనివ్వఁడు. ఆమెనుగురించి యొక ముక్కయైన నింతకు ముందు మనకు జెప్పియున్నగదా. యూహయో, అపోహయో చేయు టకు? దారినిబోవుచున్న నిగమశర్మను దొంగలు గొట్టిపోయినారు. "అక్కడికొక్క కాపుకొడుకొక్కరుడు" చుక్క తెగిపడినట్లు వచ్చినాడు. వానికి నిగమశర్మనుఁ జూచినంతనే తట్టుకోలేనంత దయఁ బుట్టినది. వెంటనే యింటికెత్తుకొనివచ్చి నిగమశర్మను బరిచరించెనట. ఆకాపువాడా కాఁడవికెందుకువచ్చెనో? వాడేమి యడిగెనో? నిగమశర్మ యేమి బదులు జెప్పెనో? వీనినన్నిటిని మనమూహించికొనవలసినదే!

అనగా రామకృష్ణుని కవిత్వమునుఁ జదువునపుడుఁ బూర్వాపరము లను సంధించుకొనుచు జదువవలెను. ఆతడుఁ బూరింపనిచోట మన మూహించికొనుచుఁ జదువవలెను, లేనిచో నా శిల్పములోని గొప్పతనము అర్థముగాదు.

ఒకానొకసారి యొక సంగీతవిద్వాంసుడు రామకృష్ణునిదగ్గరకు-వచ్చినాడు. వాడేమో అవ్వంత యుడుకుఁబోతుగఁ గనబడినాఁడు తెన్నాలివానికి. హనుమంతునియెదుట కుప్పిగంతులువేయుట సాధ్యమా?

వీడాక్షేపణమునకు మొదలుబెట్టినాదట! నీ సంగీతశాస్త్రమంతయు దప్పుకా తడక. ఒక నియమమేలేదే. ఇచ్చినవన్నిటికి దలకట్టులిచ్చి స.రి.గ.మ. ప.ధ.న. యనియైన ననవలెను. కాకున్న నన్నిటికి నెగుఱగొట్టి సి.రి.గి.మి.పి.ధి.ని. యనియైన ననుట న్యాయము. ఇదియేమి స.రి.గ. మ.ప ద.ని.స యని కొన్నిటికి తలకట్టులు, కొన్నిటికి గుడిసెలు ఛీ ఛీ "పొమ్మ"న్నాదట! ఈ మాటలో సంగీతశాస్త్రమంతయు దప్పులైనట్లును గాదు, ఎదుట వాని గర్వమునకుఁ దగినట్లు సమయమునకుదగిన యేదో బూకరింపుతో నోరుమూయించుటంతే. ఈ గుణము తెన్నాలివానిలో నున్నది. ఒక తెన్నాలికవిలోనేగాదు. సాధారణముగ ప్రతిభావంతు లందరిలో నీ గుణము కొద్దిగనో గొప్పగనో యుండును, అందుచే వారి మాటకెవ్వరును- అడ్డమాడుటకు వాడును ఇట్టివాడైననేదప్ప- జంకుదురు. దానితో సమకాలమున ప్రతిభావంతులనుబట్ట పగ్గములుండవు, వారీ వైభవముతో దమ కర్తవ్యమును మఱచిపోవుటయు గలదు. లేకున్న దాని నవకతవకగ జేయుటయు నుండును ముఖ్యముగ వారిలో విష్తక్కువ. మేధాశక్తియు, విష్యయు చేరిన వారు కాలమున చాలనరుదు. అట్టి మహా వ్యక్తులలో తిక్కనామాత్యుడొకడు. అతనితోసాటియందరికినిగుదురునా? మిగిలిన శ్రీనాధుడు, పెద్దన, రామకృష్ణుడు మొదలైనవారందరికి నీ లోపముండనేయున్నది. వారు దృష్టిపెట్టి యొకవిషయమును బాగుగా చెప్పవలెననుకొన్నపుడు మరెవ్వరు చెప్పలేనంత బాగుగ జెప్పెదరు. అట్లు గ్రంథమంతయు నిట్లే వ్రాయఁగూడదా? యనిపించును. కాని యా ప్రతిభ నళినీదళగతజలము-చూచిచూడకముందే మాయమగును.

"పుష్టిసమస్తముం గడచిపుచ్చి, చేటికానీతపీఠికా సీ
నయై" కుడివలనవింత యోరగా కొమరుమెఱసి

బిడ్డ చనుద్రావగూర్చున్న నిగమశర్మ యక్క "పద్మకర్ణిక గొబ్బవున్న

పద్మవోలె" నుండెనట! ఈ యుపమానము విన్నపుడు మనకెంతో సంతోషముగా నుండును. వెంటనే యామె యుపదేశమారంభించినది. ఆ యుపన్యాసమొకదృష్టితో జూచినచోఁ చాల గొప్పరచన. కాని యామె మాటలాడుచున్నంతసేపు నిగమశర్మ యేమిచేయుచున్నాడు? బెల్లము గొట్టిన రాయివలె నున్నాడు "మాయాగవి" యొకానొక బ్రహ్మచారి పెట్టు బాధలకోర్వలేక వాధూల మహాముని యుండు వనమునఁబడి యత నిపైకుఱికినది. ఆ మహాముని నిష్ఠాకలితుడై దపమొనర్చుచున్నాడు. అతనిపై బుట్టలు పెరిగినవి. ఇదియంతయుఁ బూర్వరంగము, మనమను పంధించుకొనవలెను. అప్పుడేమైనది?

ఉ॥ ముట్టినబిట్టు మిట్టిపడి మౌని సముత్థితుడయ్యె మేనిపై
బెట్టిన పుట్టనెట్టవిసి బీటలువాఱ శ్రవశ్శకుంతముల్
చట్టపలెత్తి ముందరికి సాగదలంప జటాచ్ఛటాచ్ఛవిన్
ద్రుట్టెలుగట్టి నిద్రిలు మరుద్భుగధీశకులంబు మేల్కనన్.
(5-2-49)

వాధూలమునిపై బెరిగిన పుట్ట నెట్టవిసినది. అతని చెవులలో శకుంతములు గూఁడ్లుపెట్టికొన్నవి అవి టెక్కలార్చి పదిగెత్తిపోయినవట అతని జడలలో త్రుట్టెలు గట్టుకొని నిద్రించుచున్న పెద్దపెద్ద కొండచిలువలు మేల్కొన్నవి. పై వర్ణనము యే భవభూతియో విశాఖదత్తుఁడో మురారియో చేసినటులున్నది. ఆంధ్రమున ఇట్టి దెక్కడను చూచినట్లు నాకు జ్ఞాపకములేదు. రాయలుగూడ బ్రహ్మరాక్షసు నిట్లే చిత్రించినాడు ఇట్టిదే మరియొక వర్ణనము పంచమాశ్వాసమున నున్నది. వధూలముని యా బ్రహ్మచారిని "గప్పవు" కమ్మని శపించెను. ఆ శాపము వానిని గప్పి కొమనప్పుడున్న—వాని చిత్తవృత్తి యొకానొక యుత్తమ వర్ణన. ఇట్టి వక్కడక్కడ గనపడును కాని వీనితోబాటు రామకృష్ణుని నిష్ఠా

శూన్యత, తొందర ప్రత్యక్షమగుచునే యుండును. సాధారణముగ కథను నడపుటలో నొకపాత్ర మాటాడునప్పుడు తక్కినవారి ముఖమాన సిక వికారములేవో వారు నడుమనడుమ నేమందురో అగౌడవ చెప్పనే చెప్పడు ఈ పద్ధతి నన్నయలోను గలదు. కాని యది భట్టారకుని స్వభావము. ఈ కివిది తొందర. భట్టారకుని భాగములో దేనితోనైన రామకృష్ణుని రచన పోల్చి చూచినపుడీ నిజము బాగుగ దెలియును. నిగమశర్మ అక్క తన పుట్టినింటికి వచ్చినపుడు ఆమెయిలుదీర్చిన పద్ధతి యంతయు వెదురుగడవంటి పెద్ద వచనముతో నెట్టివేసినాడు ప్రథమా శ్వాసమున రవ్వంత చెప్పి ముగించిన పుండరీకుని కథను మరల ద్వితీయాశ్వాసమునగాబోలు యెక్కడో ముడివెట్టును. ఒక్కొక్కసారి కందపద్యములుగా వ్రాయ నారంభించిన వరుసబెట్టి యా వృత్తములే వ్రాయుట వాడుక. తేటగీతలు మొదలైనవి విసిగించువరకు నవియే సాగును. ఒక విషయమును నిలుకడగా ఆలోచించి దిద్ది తీర్చుమను బుద్ధి రామకృష్ణునకు లేనేలేదు. ఎవరైన సమకాలికులాక్షేపించినారా ? వారికి శని వక్రించినట్లే, ఇక మనమిప్పుడీతని విమర్శించితిమిపో. వచ్చిన రామకృష్ణునకు మనమాటలు వినబడునా ? కావ్యమును వ్రాయుచున్నపు దేశభగ్రిహ కూటముననో యొకసారి వానికి - యేమిరాకావ్యమంతయు నింత సులభముగ వ్రాయుచున్నానే, మనమిట్లు వ్రాయవచ్చునా ? యని దోచును. అయూహలో నిరువది పద్యములు పాషాణపాకము, మరల మా మూలే. ఇది తెన్నాలికవి చిత్తవృత్తి. నిగమశర్మ కథలో నొక నిగమశర్మ ముక్తిబొందినదిదప్ప తక్కిన వాని తలిదండ్రులేమైరో, భార్య ఏమయ్యెనో మనకేమియు దెలియదు। తెలియవలసినపనిలేదని వాని సమాధానము. పుండరీకుఁడు తల్లిదండ్రులకు జేసినసేవ బ్రహ్మాండముగ వర్ణించి చెప్పినాడు ఆ పుండరీకునకా దల్లిదండ్రులే లక్ష్మీనారాయణులట ఇంత

ప్రేమానుబంధముగలవాడు వారు ఇచ్చినంతనే నిట్టూర్పైన విడచినట్లు మహాకవి చెప్పలేదు. పైగా వారిద్దరికివి గలిపి యొకటే కందపద్య పాదములో "గంగలో వస్థి, గయలో పింఢము" (2-28) దీర్చి చప్పు మవి యూరకున్నాడు. ఆ తలివండ్రులుగూడ మనవానికి కష్టమేల యని మాటాడుకొని యిర్వురు నొక కందపద్యములోనే జీవితములు ముగించి కొన్నారు.

ఈ క్రింది పద్యమును జూడుడు.

గీ॥ ఆవిదేహాధిపతిపుత్రి యాత్మ భార్య
గాఁగ విఖ్యాతిఁబొందు రాఘవునికరణి
రాఘవాంబాధినాథుఁడై శ్లాఘ మీఱ
శ్రీ నృసింహుని కోనప్ప సిరులకుప్ప (1-48)

పైదానిలో మూడుపాదములును నేవో పెద్దమాటితో, పెద్దమనుష్యునివలె నడపినాడు. నాలుగవపాదమునకు వచ్చువేళకు వానికిఁ బురుగుతొంచినది. కోనప్ప సిరులకుప్ప యని యొక గోంగ్రకప్పవంటి కుప్పను నిలిపినాడు.

ఈ క్రింది సీసమును గమనింపుడు.

మంత్రపూతముగాగ మజ్జనం బొనరించి
పరిస్నుని శుభ్రాంబరములు గట్టి
ఘనసారమిశ్రిత గంధసార మలంది
పరిమళంబుడివోని విరులు ముడిచి
సిగరలతోడ గోక్షీర పూరముతోడ
బహువిధంబగు ఫలపక్తితతోడ
పిండివంటలతోడ ఖండశర్కరతోడ
నేతులతోడ తేనియలతోడ

దధులతోఁ గూడఁదగు నివేద్యములఁ జూపి
వనధి వనధాము పీతాంబరుని రమాకు
చరజ వినిలిప్తు శిఖిబర్హధరు మఖాంశ
భోక్త బూజింపదగుఁ జైత్రమున శుభాంగి (2-108)

ఈ పద్యమునందు జెప్పిన విషయము కేవలము బల్బిజము. కాని తన రచన యనెడు రసవాదవిద్యతో రామకృష్ణుడు దానికొక సువర్ణయోగ మొసగెను. లాభమేమి? పద్యమునందు మొదట రెండు పాదములలో నొకవిధమైన నాదశుద్ధి నడచినది. మూడు నాల్గు పాదములలో వేరొక లయ గుదురుకొన్నది గీతపద్యపు రెండవపాదమును "రమాకు" అను దానికి నిలిపి "చరజ" యని మూడవపాద మారంభించినాడు. అచ్చోట నాదము పూర్తిగాఁ బాడైనది. ఇది యతనికి దోచనా? తప్పక దోఁచి యుండును. తోఁచినను అదియు వాని హాస్యములలో నొకటి. ఇట్లే మరియొకచోట పద్యమునంతయు నేమో యొయ్యారముగ "కురుచలై గుమురులై గొనబులై లేబాపఁ గ్రొమ్మఁ జుట్టిన జడల్గొమురుకొనగ." (2-91) యని చక్కని సమర్థతతో సాగించి కట్టకడపట "రాజము జపించిరొల్వ దొరకు శుభములు" యని ముగించి మొదటినుండి నిర్వహించిన నాద శుద్ధినంతయు నష్టపెట ద్రోసినాడు. సరస కవితారసనాధుడగు రామకృష్ణుని మనము జదువునప్పుడు పానకమున మిరియపుకారమువలె నిట్టి కొన్ని చాపల్యములను ఓర్చికొనితీరవలయును. లేనిచో నతని కవిత్వము జోలికే పోరాదు

ఇంతవరకు మనమా మహామహుని శబ్దమూర్తినిమాత్రమే దర్శించితిమి. వీనియన్నిటికన్న రామకృష్ణకవి యాధ్యాత్మికమూర్తి చాల వర్చస్సుగలది; వినయశీలము, శాంతి దాంతులతో గూడుకొన్నది.

పైకి క్షుభిత తరంగములతో నల్లకల్లోలమై గనపడు సముద్రపు లోతులందణగిన శాంతిగాంభీర్యములవలె బూకరింపులు పాండిత్య ప్రకర్షలు చందోపవాదములు వీనివెనుక నాతని శాంతి గాంభీర్యములు దాగి యున్నవి. "ఊరక మీమాంసావని మానసమృగముద్రిప్పు" శాస్త్రచర్చల యందతనికి శక్తియున్నను రక్తిలేదు. కర్మమార్గమును నాతనికల్లే యయిష్టము. కర్మపరులు యేనుంగుమీద నున్నవారిని సున్నమడుగు వంటివారని యాకవి యూహ.

కాని తాను బట్టిన కుందేటికి మూడేకాళ్లని వాదించు మూర్ఖుండు గూడ రామకృష్ణుడుగాడు. వారివారి సంస్కారముల ననుసరించి వేర్వేరు మార్గములను భిన్నభిన్న జంతువుల ననుసరించుననియు సమస్తమును పరమేశ్వరుని విభూతియేయై ప్రపంచమున నొకటి సరి యొకటి గాదనుట పొరపాటేయని రామకృష్ణకవి విశ్వాసము. శాస్త్రముపదేశించిన మార్గములన్నియు నుత్తమములే. అధికారిభేదముతో అనుసరణీయ మార్గములు మాత్రము మారును. ఒక్కటి తీసివేయదగినదిలేదు. ఇది యితని హృదయాభిప్రాయము.

మ॥ రవిధామంబులు సిద్ధమంత్రములు చంద్రజ్యోత్స్నకల్పన్మణి
ప్రవరశ్రేణులు, భవ్యభేషజతతుల్ పాదోధరంబుల్ సుధీ
భవవిస్తారక, పేమమిచ్చి జగముం బాలించు మర్యాదనీ
యవతారంబుల శేషలోకహితచర్యాధుర్య సంచారముల్.

(4-88)

యని రామకృష్ణకవి పరమాత్మను బొగడెను. గలియుగమునందు మానవుడు తరించుటకు భక్తియే సాధనము పన్యాసము న్యాసము మొదలైనవి. జంపటయేగాని ఏమాత్రము సుఖములేదు (4-94) ఆ భక్తియందును

విష్ణుభక్తి సర్వోత్తమము. "తలముచ్చుట్లు దిరిగినను, నోరి దయలేవిధి అది కడుపులోనికి బోదు." (4-276) అట్లె విష్ణుభక్తి కుదురనిది జన్మ రాహిత్యము సిద్ధింపదుగదా ? "సమస్తమును దైవ నిర్దేశానుసారమే జరుగును. వారివారి స్వరూపానుసారముగ మానవులకు ఫలము లొసగువాడు నారాయణమూర్తియే. తక్కిన దైవములందరు నా మహామహాని యంశలు." అను మొదలగువన్నియు నాతడు బోచి గావించికొన్న విశ్వాసములు. విష్ణుపారమ్యమింతగాఁ బాదుకొనియున్నను. రామకృష్ణకవి అనుష్ఠానము నెఱుగని కొందఱు మూర్ఖవైష్ణవులవలె శివుని విస్తారణముగ ద్వేషించువాడుగాడు "గూఢం కృష్ణస్యమాహాత్మ్యం వేత్థ వేదమయం శివః॥" అన్న భాగవత సత్యమును మహాకవి మనసార యాదరించెను. రామకృష్ణకవి జీవితమంతయు సాధించినదియు, యెన్ని కాలములు మారినను మారనిదియునగు నొక చిత్రమైన ముక్తి గలదు అది యిది.

నిత్యనైమిత్తికములు నిర్నిద్ర బుద్ధి
నాచరించుచు హరిభుక్త మాత్మభార్య
భక్తినిడ భుక్తిగొనుచున్కి ముక్తిగాని
విదురవంటిది రాతివంటిదియుగాదు. (5-216)

చాల యుత్తమమైన హితోపదేశము. ఈపద్యమొక్కటి మనము చక్కగా ననుష్ఠించినచో పది పాండురంగ మాహాత్మ్యములు చేసినంతకంటె నెక్కువ యుపకారము మన జీవితమునకు జేయును. ఈ సాధన ననుష్ఠించు మననశీలురు ధన్యులు. ఈ యుపదేశమిచ్చిన మహాకవి ధన్యతముఁడు. నాకర్థమైనంతవరకు రామకృష్ణుని యాంతరిక బాహ్య స్వరూపములను మీయెదుట మనవిసేసితిని. ఇంకను చెప్పవలసినవెన్నియో నాకర్థముగాని విశేషములున్నవి ! వానిని వివరించువారు రసనిష్ణాతులు ; నాకన్న గొప్పవారు.

"సరస్వత్యా స్తత్వం కవిసహృదయాఖ్యం విజయతాం"



# వి జ య వి లా స ము

శ్రీ దివాకర్ల వేంకటావధాని.

# విజయవిలాసము

విజయసంవత్సరాదినాఁడు జరుగు నీ యుత్సవమున నామమాత్ర ముచేనైన సామ్యమువహించుఁగదా యని విజయవిలాసమును గూర్చి ప్రసంగింపఁదలచితిని. ఆంధ్ర వాఙ్మయాకాశమున మెఱయు నుజ్జ్వల కావ్య తారకములలో నీ విజయవిలాసమొక్కటి. ఒకవిధముగా జూచి వచో నాంధ్రభాషాయోష కంఠమున కొలుపుగూర్చు ప్రబంధ రత్నమాలిక లో నిది తరళస్ఫూర్తి విడఁబించునవియుఁ జెప్పనగును. దీనిని రచించిన వాఁడు లక్ష్మణామాత్య తనూజుఁడును, వినయ ధురీణుఁడును, సకల కలాప్రవీణుఁడునైన చేమకూర వేంకటకవిరాజు. ఇతఁడు తంజాపు రాంధ్రనాయక రాజులలో మకుటాయమానుఁడని చెప్పఁదగిన రఘునాథ భూపాలుని యాస్థానమున కలంకారమై యుండెను. ఈ రఘునాథ నాయ కుఁడు శ్రీ కృష్ణదేవరాయలవలె సాహిత్యసమర రంగముల రెంటను సార్వభౌముఁడై యవక్రమైన పరాక్రమమునకును, ననన్య సాధారణమైన రసికత్వమునకును బేరుగాంచియుండెను. ఇతఁడు పలువురు కవిరాజు లను బోషించుటయేకాక స్వయముగాఁ బండితుఁడును గవియునై పెక్కు రసవంతములైన కావ్యములను రచించి యభినవ భోజరాజను సార్థకమైన బిరుదము వహించెను. గోవిందదీక్షితుని పుత్రుఁడును, సాహిత్య రత్నాక రాలంకారరత్నాకర రఘునాథ భూపాలీయములను సంస్కృత గ్రంథ ములకుఁ గర్తయునగు యజ్ఞనారాయణ దీక్షితునికి గురుత్వము నెఱపె ననుటయే యితని పాండిత్య పాటవమును జెప్పక చెప్పుచున్నది. ఈ

మహారాజు మన్ననలకుఁ బాత్రుఁడై, యాతనిచే హస్తముక్తా కటకాదులగు ననేక బహుమానములంది కృతజ్ఞతాపూర్వకముగఁ దారచించిన కావ్యముల నన్నిటి నాతనికే యంకితమొనర్చిన కవిరాజు వేంకటరాజు. కలనయినను రఘునాథునిఁగాక యన్యుఁ గొలువననియు, గృతుల నితరుల కీక యాతనికే యంకితము చేసెదననియుఁ బలికి జీవితాంతమువఱకు నాతఁడా ప్రతిజ్ఞ చెల్లించియేయుండెను.

వేంకటకవి కులగోత్రములనుగూర్చి మనకంతగాఁ దెలియదు. పూర్వులైన యితరాంధ్ర కవుల విషయమునవలెనే యీతని చరిత్రయు నెఱుంగుట కూహాతక్క నన్యశరణములేదు. ఇతని తండ్రి లక్ష్మణామాత్యుఁడనియు, నితనిపేరు వేంకటరాజనియు నాశ్వాసాంత గద్యంలో వివరింపఁబడియున్నది. కృతి గ్రహించు సందర్భమున రఘునాథ భూపాలుఁడు "క్షత్త్ర ధర్మమ్మొకద నీకుఁగలదుమొదల" నని చెప్పినట్లున్నది. వీనిలో మొదటిదానివలన నీతడు నియోగి బ్రాహ్మణుఁడనియు, రెండవదానివలన క్షత్రియుఁడనియుఁ దెలియుచున్నది. ఇది యిట్లుండ నితఁడు భట్రాజనియు, భోగినీ సంజాతుఁడనియుఁ జెప్పువారు కొందఱు గలరు. ఇందేది యథార్థమో నిర్ణయించుట కనువగు నాధారాంతరములు కానవచ్చుటలేదు. ఇతఁడు శ్రీ సూర్యనారాయణ వరప్రసాద లబ్ధ సారస్వత సుధా సార జనిత యశోలతాంకూరుఁడని గద్య చెప్పుచున్నది. అందుచేతనే యితఁడు కృత్యాదియందుఁ "దేజోనిధి రఘునాథాధీశుఁ దేజోనిధి నొనరించుఁగాక" యని కృతపతికి హితమాపాదించు దైవతములలో సూర్యభగవానునిఁగూడఁ జేర్కొనియుండెను. (1-5) వినయమును, ప్రభువునెడ భక్తి విశ్వాసములును నితనికి సహజముగా వచ్చిన గుణవిశేషములు. ఈ విషయమే,

వాసించు కవితచెప్పిన
వీనరవో వొకటి, భక్తి విశ్వాసంబుల్
నీ సొమ్ములు, సామాన్యుఁడ
వే సూర్య వరప్రసాది విజ్జగ మెఱుఁగన్.

అను పద్యమునఁ జెప్పబడినది. కృత్యవతారికలో నీతఁడు రఘునాధునిఁ గూర్చి రచించిన పద్యములు రసభావాంచితములై యా మహారాజునెడ నాతనికిఁగల భక్తివిశ్వాసములను వేనోళ్లఁ జాటుచున్నవి. ఆ పద్యములు మెఱమెచ్చులకై మొగముచూచి చెప్పినట్టివికాక సహజ భక్తిభావ ప్రేరితములైనట్టివిగాఁ గానవచ్చుచున్నవి. మానవులైన కృతి నాయకులయెడ నింత నిసర్గ నిర్మలమైన భక్తి ప్రదర్శించిన కవులెందఱో లేరు. ఈ భాగము రఘునాధరాయల విమల యశోవిశేషమున కెత్తిన యుజ్జ్వలవైజయంతికయై యలరారుచున్నది.

విజయవిలాసమునందలి వస్తువు భారతాదిపర్వమునుండి గ్రహింపఁబడినది. అర్జునుఁ డులూపి యను నాగకన్యను, చిత్రాంగద యను మణిపురాధీశ్వరుని కుమారిని, శ్రీకష్ణ సోదరియైన సుభద్రను వివాహమాడి యనుభవించిన విలాసమే యిందలి వృత్తాంతము. ఈ విలాసమునకుఁ బ్రసక్తానుప్రసక్తముగా సౌభద్ర తీర్థమాదిగాఁగల పంచతీర్థములలో ముని శాపవశమున మొసలై పడియుండిన నందాదుల కాతఁడు శాపవిమోచనమొసంగిన విక్రమమో విలాసమో కూడఁ జేర్పఁబడినది. ఏతత్కథాచతుష్టయముతోఁగూడిన విజయవిలాసమున నా నాల్గింటను గూడ నర్జునుఁడే నాయకుఁడై యుండుటతక్క వేరొక్క యైక్యములేదు. రమణీయములైన యీ కథారత్నము లర్జునుఁడను సూత్రమునఁ జారుతరమైన హారముగాఁ గ్రుచ్చఁబడినవి. భారతమునఁగూడ నీ కథ లీ విధముముగానే యున్నవి. కావి వేంకటకవి యందు సుమారుగా నొక వంద

సంఖ్యగల పద్యములను మనోహర వర్ణనాదులచేఁ బెంచి సార్థ షట్ఛత పద్యపరిమితమైన హృద్య ప్రబంధముగా సంతరించెను.

మూలమునందలి కథకు వన్నెచేకూర్చుటకై వేంకటకవి కావించిన మార్పులు కొన్ని గలవు. అందు ముఖ్యమైనది, కావ్యమునందలి వస్తువున కొకవిధముగా నైక్యసంధానము గావించుటకుపయోగించు గదకృత సుభద్రావర్ణనము. ఈ ప్రసంగము మూలమునఁగూడ నత్యల్పముగా నున్నది. పంచతీర్థముల నచ్చరలకు శాపమోక్షము కావించిన పిమ్మట నర్జునుఁడు ద్వారకకరుగుటకు రెండు కారణము లందు సూచింపఁబడినవి. అందొకటి యర్జునుఁడు మిత్రుఁడైన యరవిందనాభునిఁ గాంచి జన్మము సఫలమొనరించుకొనుట రెండవది "మున్ గదుఁడనువానిచేఁ దిలోత్తమ కంటె రూపవతియు, సద్గుణాన్వితియు" నని వినియున్న మేనత్తకూఁతురైన సుభద్రను జూచువేడుక. ఉజ్మాత్రముగా సూచింపఁబడిన యీ విషయమునకుఁ బ్రాధాన్యము కలిగించి వేంకటకవి కథారంభమునఁ బురచాతుర్వర్ణ్యాదుల వర్ణనమైన యనంతరము కృష్ణప్రేషితుఁడై గదుఁ డింద్రప్రస్థపురమున కరుదెంచి "యేకాంతపువేళ ద్వారవతియందలి వార్తలు దెల్పుచున్ చటిత్కాంతి మనోహరాంగులగు కన్నెల చక్కఁదనంబు లెన్ను సంభ్రమున" సుభద్రా సౌందర్యమును సమగ్రముగా వర్ణించు ప్రసక్తి కలిగించెను. గదుఁడు సుమారు పది పద్యములలో సుభద్ర రామణీయకమును వర్ణించి యందు శతాంశమైనఁ జెప్పఁజాలకపోతినిగదా యని విచారించెను. ఆయఅగొలు వర్ణనము నాలించియే యర్జునుఁ డంగనముంగల నిల్చినట్లును దాఁగనఁగొనినట్లును భావించి డెందమునందుఁ బట్టఁజాలని యనురక్తి నవ్వెరవిలాసిని నెన్నఁడు చూడఁగల్గునో యని తమకింప" మొదలిడెను. సరిగా నా సమయముననే చోరహృతభూమీదివిజధేను ప్రసంగము వచ్చుటయు నాతఁడు కోదండసాయకాహరణమునకై ధర్మజు

కేళిమందిరము దండకేగి పూర్వోక్తప్రసమయ న్యాయానుకూలముగా నొకయేఁడు ప్రదక్షిణంబరుగు నుద్యోగమునకుఁ బూనుటయు సంభవించెను లేనిచో నాతడేదో మిషకల్పించి గదుని తోడనే ద్వారకకుఁ గదలియుండునేమో।

విజయవిలాసమున మూలకథానుసారముగా నాలుగుకథలు చెప్పఁబడినను అందుఁ బ్రధానమైనదియు సర్వాధికభాగ వ్యాప్తమైనదియు సుభద్రా వివాహప్రసంగమే. అర్జునుని జీవితమునందు వలెనే విజయవిలాసమునఁగూడ నత్యంత ప్రాముఖ్యముగలదీ వృత్తాంతము. వేంకటకవి దీనినే యిందుఁ బ్రధానముగా వర్ణింపఁదలచి మూలమున నున్నవి కదా యవి ప్రసంగవశమున నితర విలాసములనుగూడ నుపకథలుగా ముందు చొప్పించెను. అందుచేతనే యాతఁడు సుభద్రార్జునుల ప్రణయవల్లికకు బీజమైన సుభద్రా సౌందర్య వర్ణనముతోఁ గావ్యము నారంభించి దానికి ఫలమని చెప్పఁదగిన యభిమన్యు జననముతో దానినంతమొందించెను. ఈ విధముగా వేంకటకవి యీ కావ్యమున నైక్యానుసంధానము కలిగింప ప్రయత్నించినను ప్రతత్కావ్య కథాసంవిధానమును బరిస్కరించుకొని చూచినచోఁ గొంచెము దీర్ఘతరములుగానే గోచరించు నలూపీ చిత్రాఁగదా వివాహ వృత్తాంతములు సుభద్రా సౌందర్య వర్ణనము బీజావాపమునకును సుభద్రాదర్శనమును నంకురోద్భేదమునకును సహింపరాని వ్యవధానము నాపాదించుచున్నవి. ఇట్లుగాక యావృత్తాంతములను సూచించిమాత్రము విడిచినచో నీ కావ్యవస్తువున నైక్యము మఱింత ప్రశంసనీయముగా నమరియుండును. విజయ నాయకత్వముచేఁ గలుగు నైక్యమే చాలునని తృప్తిపడినచో మొదలే యాక్షేపణమునకవకాశ ముండదు

వేంకటకవి కావించిన వేదవమూర్తు విశారద పాత్రప్రవేశనము. అర్జునుఁడు వేదాంగ విశారదులైన బ్రాహ్మణులను, వివిధ కథాకథన

దక్షులైన పౌరాణికులను దనకు సహాయులుగాఁ దీర్థయాత్రకు బయలుదేఱె నని మూలము చెప్పుచున్నది. విజయవిలాసమున ధర్మజుఁ డర్జునునితోఁ "దనదు పురోహితుండయిన ధౌమ్యుని తమ్ముని గాంవంపు నందనుని విశారదున్ సకల ధర్మ విశారదు వెంటఁ బోవఁగా నొనరిచి, కొందఱన్ బరిజనోత్తములన్ నియమించి, యాదరంబెనయ సమస్తవస్తువులనిచ్చి" యాతనిఁ బ్రయాణము చేసెనని వర్ణింపఁబడినది. పురోహితానుజతనూజుఁడైన యీ విశారదుఁడు కేవలము ధర్మవిశారదుఁడేకాదు నర్మవిశారదుఁడు కూడను. అతఁడు హావభావ పరిణామ విదుఁడైన సరసాగ్రేసరు డని వేంకటకవి చిత్రణము. ఈతఁడు చిత్రాంగదా వివాహసందర్భమున గొంత దౌత్యము నెఱపెను. సంస్కృత నాటకమందలి విదూషకులు నాయకులకువలెనే యీతఁడిందు నాయకుఁడైన యర్జునునికి మనోరథ ప్రాప్తి విషయమునఁ జాలవిధములఁ దోడ్పడెను. సంస్కృత నాటకము లందలి విదూషకులకు సాధారణములైన మూర్ఖతా కుక్షింభరత్వములు వినాగా నితర గుణగణములన్నియు నీతనియందున్నవి. అమూలకమైన యీ పాత్ర ప్రవేశనము విజయవిలాసమునందలి యీ ఘట్టమునకుఁ గొంత సొంపు చేకూర్చినది.

అర్జునుఁడు చిత్రాంగదా వివాహానంతరము బభ్రువాహన జననమునకుఁ బూర్వము మణిపురమునకు సమీపమునఁగల సముద్ర తీరము నందలి తీర్థములఁ జూడనరిగి యటనందాదులకు శాపమోక్షమొసంగి తిరిగి మణిపురంబునకరుదెంచి చిత్రాంగదయందు బభ్రువాహనుని గాంచె నని భారతమునఁ గలదు. విజయవిలాసమున నాతఁడు బభ్రువాహన జననానంతరమతనిఁ జిత్రవాహనునకు వంశకరునిగా నొసంగి, వారిచేతఁ బంపకముగాంచి తీర్థయాత్రోద్యోగమును గొనసాగించుచు నందాదులకు శాపమోక్షమునొసంగెనని చెప్పఁబడినది. వారిని శాపవిముక్తుల నొన రించిన పిమ్మట నతఁడు మరల మణిపురమున కరిగియుండలేదు.

విజయవిలాసమువందలి ప్రధానమైన యీ కథను సంగ్రహించు నుద్దేశముచేతను. అర్జునుఁడు విలాసలాలసుఁడై తిరిగి మణిపురమునకరుగుట తీర్థయాత్రాచరణమున నాతనికిఁ గల యభినివేశమునకు లాఘవము కలిగించునను నుద్దేశముచేతను వేంకటకవి యీ మార్పు చేసియుండును. మణిపురమునకు రాకముం దర్జునుఁడు గోదావర్యాదుల దర్శించెనని నన్నయ కావించిన వర్ణనము సంస్కృత భారతమున లేనిదగుటచేఁ గాఁబోలు వేంకటకవి విడిచిపైచెను.

నన్నయభట్టు రచనమున నులూపి యర్జునునిఁ బ్రభాతసమయము ననే నాగపురమునకుఁ గొనిపోయెనని కలదు. అంతదప్పటినుండి మఱునాఁటి యుదయమువఱకు నచ్చటనే యుండినట్లు దానివలన దెలియుచున్నది. ఇందౌచిత్యమును సహజత్వమును గొఱవడి యుండుటచే వేంకటకవి యామె యర్జునుని "మాపటివేళం గనుబ్రామి చొక్కఁజల్లిన యనువున నందఱువితాకులై యుండంగన్" దన పురమునకుఁ గొనిపోయెనని వర్ణించెను. ఉలూపి యర్జునునిఁ దన నగరమునకుఁ గొనిపోయిన ప్రయోజనమును బురస్కరించుకొని చూచినచో నీ మార్పెంతయుఁ బ్రశంసనీయమై యొప్పారును.

వేంకటకవి భారతమునందలి కథకుఁ బ్రబంధోచితములైన వర్ణనాదులు చేర్చి దానిని జాఁ బెంపొందించెనని మొదటనే చెప్పఁబడినది. ఈ పెంపు సుభద్రార్జున వివాహఘట్టముననే యధికముగాఁ గానవచ్చుచున్నది. అందును యతియైన యర్జునునకును సుభద్రకును జరిగిన సంభాషణమును వెంకటకవి సరసగంభీరభావములతోఁ బెంచి విసర్గరమణీయముగా పంతరించెను. "నేనే యర్జునుఁడ"నని యర్జునుఁడు సుభద్రకెఱింగించిన భాగము మూలమున నతిసంక్షిప్తమై యొక్కమాటతో ముగిసిపోయినది.

ఈ విధముగా వేంకటకవి విజయవిలాసమున భారతకథ కనేక విధముల వన్నెచేకూర్చెను. విజయముగా నర్జునుఁడింద్రప్రస్థమునుండి బయలు దేఱినది ప్రాయశ్చిత్తరూపమైన తీర్థయాత్రాచరణముకొఱకే కాని విలాసానుభవముకొఱకు గాదు. కథయుఁ జోరహృత భూదేవధేనూదంతముతోనే యారంభించుచున్నది. అది లేనిచో నర్జునుఁడు భూప్రదక్షిణ మేగవలసిన యక్కఱ గాని యా సందర్భమున నీ విలాసములనుభవించుట కవకాశముగాని కలుగకయే యుండును. ఇంత ప్రధానమైన యీ విషయమును మరల నల్పముగానైన సూచింపక కవి కావ్యమును ముగించుట యావృత్తాంతమున సమగ్రముగా విడిచిపెట్టిన ట్లున్నది. కావ్యాంతమున సంవత్సర పరిమితమైన యీ ప్రాయశ్చిత్తముకూడ ముగిసెనని చెప్పియుండినచోఁ గడుంగడు నుచితముగా నుండియుండును.

విజయవిలాసమను పేరుగల యీ కావ్యమున నందాదుల శాప విమోచన వృత్తాంతమునకుఁ దగినంత ప్రసక్తియేలేదు. ఇది యొకవిధముగాఁ జూచిన విక్రమమే కాని విలాసముకాదు. అర్జునుఁడు సౌభద్రతీర్థమునఁ గ్రుంకఁబోఁగనే మకరాకృతినున్న నంద యాతనిఁ బట్టుకొనెను. అంత నాతఁడెదమకరముననే యయ్యెడ మకరముఁబట్టి బైటికీడిచివైచెను. అంత నది మకరరూపమువిడిచి యచ్చరయై తన యొక్కయుఁ దన చెలులయొక్కయు వృత్తాంతము లెఱింగించి వారికిఁ గూడ శాపమోక్షము ప్రసాదింపుమని ప్రార్థించెను. అర్జునుఁ డామె కోరిక నెఱవేర్చెను. అట్లచ్చరల యాకృతులు గాంచిన యా యైదుగురు నతని ననేకవిధంబుల నుతించి దీవెనలొసంగి యమరనగరమునకరిగిరి. ఈ కథ యెంత సంక్షిప్తముగా నుండిన నంత యౌచిత్యము శోభిల్లి యుండును. కాని యొకందుకు మనము సంతోషింపవలయును. వేంకట

కని యర్జునుఁ డర్ణవయో విలాసముఁగల మచ్చెకంటులు లభించుచోఁ దన రసికత ప్రదర్శింపక విడిచిపెట్టువాఁడుకాఁడు. నంద కోమలియై యెదుట నిలబడఁగానే యతఁడిది యచ్చరప్రోడియో కాకల్లమణివి యాలో యని యామె సౌందర్యమును బ్రశంసింప నారంభించెను. మఱి యాయచ్చర తన చెలికత్తెల పాటునెంచి తల్లడపాటు నొందుచుండుటచేఁ గాఁబోలు నాతని విలాసలాలసతకు దోహదమొసంగినదికాదు. ఆమె చెలికత్తెలును శాపవిముక్తలై నందంగూడి కృతజ్ఞతాపూర్వకముగా నాతని స్తుతించి శుభోదర్కములగు దీవెనలొసంగి వీడ్కొనిరి. లేనిచో విజయ విలాసమున నున్న యీ మూఁడు విలాసములకు మఱియొక విలాసము కూడ- మన మెనిమిది విలాసములుచదివి విచారింపవలసిన వారమై యుందుము.

విజయవిలాసమునందలి మూఁడు కథలలోఁగల ముగ్గురునాయికలును మూఁడు తెగలకుఁ జెందినవారు. ఉలూపి ప్రౌఢ; చిత్రాంగద ముగ్ధ; సుభద్ర మధ్య; "ఉదయద్యౌవనా ముగ్ధా లజ్జా విజితమన్మథా; లజ్జా మన్మథమధ్యస్థా మధ్యమోదితయౌవనా; స్మరమందీకృత వ్రీడా ప్రౌఢా సంపూర్ణయౌవనా" యని ప్రతాపరుద్రీయకారుఁడీ ముగ్గురు నాయికలకు నిచ్చిన నిర్వచనములు. ఉలూపి యర్జునుఁ జూచి వలచి యాతని యనుమతితోఁ బనిలేకుండనే మొదట నాతని నాగలోకమునకుఁ గొనిపోయినది సాహిత్యదర్పణమున చెప్పినవిధమున "నామె స్మరాంధ గాఢతారుణ్య, దరవ్రీడ, ఆక్రాంతనాయిక" నాగలోకమున కరిగినపిమ్మట నర్జునుఁడు మరల మానవలోకమునఁ బడుటకై నామె కోరిక మన్నించవలసివచ్చెను. చెలికత్తెలు సుభద్ర నర్జునుపికడఁ జేర్చి యెన్నిగడియలయ్యెనో చూచెదనని యొకతెయు, నామె యింకను రాదే మని వేరొకతెయు నెచ్చెలిని బిలిచెదనని యింకొకతెయు [illegible]ముగా

నేదో యొక సాకుచెప్పి వెడలిపోయిరి. "అచ్చెలియలవెంటనే సగము సిగ్గరిగెం దరుణీలలామకున్" ఆమె మొదట గాఢాలింగనవిముఖయైన నవోఢయయ్యెఁ దరువాతఁ గ్రమముగఁ బ్రియుని శిక్షణమున నన్నియు వేర్చి ప్రౌఢగఁ బరిఢవిల్లెను. చిత్రాంగద

"దాసిననింగితంబెఱిఁగి దాయఁగనేరక, తత్తరంబునన్
జేసిన చేఁతకుం బదులు సేయ నెఱుంగక"

క్రీడావశయైయుండెను. వేంకటకవి యామె సిగ్గు నీ క్రింది పద్యమునఁ జక్కఁగా వర్ణించెను.

ఇగ్గెడు పెక్కుకుంబయికి నీడ్చినఁ, బైటఁ దొలంగఁ జేయఁ గే
లొగ్గెడు, రెమ్మబోఁకముకి యూడ్చినఁ గ్రుంగిలిరెంతు కొంగు నన్
బిగ్గనదంచుమున్ విడిచిపెట్టదు, బాలసనంబనేమి, యా
సిగ్గుకు సిగ్గులే దిటుల జేసినపిమ్మట నుండవచ్చునే.

రసికజనశేఖరుఁడంత సరసభాషణములు పల్కి "వలపెఱిఁగి మేనతోఁ గదే కాంకి యనుచు" నెల్లో యా ముద్దరాలిని గేలిసెలయించెను. ఇట్లు వేంకటకవి యీ మువ్వురియందు నా మువ్వురు నాయికలఁ బ్రదర్శించి యర్జునుని విలాసమునకు వైవిధ్యము కలిగించెను.

విజయవిలాసము ప్రబంధజాతికిఁ జెందిన కావ్యమగుటచే నిందా లక్షణములన్నియుఁ గాననగుచున్నవి. ఇందలి ప్రధానరసము శృంగారము. కావ్యాంతమున నర్జునుఁడు యాదవవీరుల నోడించు సందర్భమున వీరరస మంగభూతముగానున్నది. ఇచ్చట నర్జునుఁడు పొందిన విజయమును బురస్కరించుకొనియే వేంకటకవి తన కావ్యమునకు నామమిడు సందర్భమున నర్జునునకుఁ గల పది పేరులలో విజయ నామమును

గ్రహించెను విజయవిలాసమనునప్పుడు 'వి' వర్ణపునరుక్తిచేఁ గలుగు శ్రుతి సుభగత్వమును నాతఁడా పేరు గ్రహించుటకుఁ గారణమై యుండ వచ్చును. రాయలవారి సభకు భువనవిజయమను పేరున్నట్లే రఘునాథ నాయకుని కొలువుకూటమునకు విజయవిలాసమని పేరుండెనఁట. ఈ విషయముకూడ విజయవిలాస నామగ్రహణమునకు వేంకటకవిని ప్రేరేఁచియుండవచ్చును.

కావ్యారంభమునఁ బురచాతుర్వర్ణ్య మృగయాది చతురంగబల పౌర మలయమారుత పుష్పలావికాదులు ప్రబంధోచితముగా వర్ణింపఁబడినవి. స్త్రీవిరహ రాత్రి ప్రాతర్వర్ణనములు సందర్భోచితముగాఁ జూపింపఁబడి నవి. తృతీయాశ్వాసమున మన్మథచంద్ర మలయమారుతాదులయుపాలంభ మున్నది. ఇందున్న మూఁడుకథలును నాయికానాయకుల సంయోగము తోనే ముగియుచున్నవి. ఈ వర్ణనములలో నాయికానాయకుల వర్ణనము నకు కథాసందర్భమునుబట్టి పౌనరుక్త్యమావహిల్లినది. కవి భేదమును బట్టి కలిగిన రచనాభావభేదములు తక్క నితర ప్రబంధములలోని వర్ణన ములకంటె నిందలి వర్ణనములలో వైలక్షణ్యమంతగాఁ గానరాదు. ఈ గ్రంథము దక్షిణాంధ్రయుగమున వెలసినదగుటచేఁ దద్యుగకావ్యలక్షణాను గుణముగా నిందు శృంగారవర్ణనము కొంత మేరమీఱినది. ఇతర వర్ణ నములు నాతిదీర్ఘములై సౌందరనందాదులవంటి యాధునిక ప్రబంధ ములు కొన్నింటికి మార్గదర్శకములైనవి. గంగావర్ణనము భావగంభీరమై మనోహరముగా నున్నది.

విజయ విలాసమునందలి నిజమైన యౌదాత్త్యము వస్తు విన్యా సమునందుఁగాక రచనావిధానమునం దెక్కువగాఁ గాననగును. ఇందలి రచనామార్గ మనన్యసామాన్యమై యద్వితీయ సౌందర్యములో నలరారు చున్నది ఇది బహుకాల సాధనకు ఫలితముగా నబ్బి వేఁకటకవివేత

సమగ్రత్వసిద్ధినొందినట్టిది. ఇది బాగుగా నెఱింగినవాఁడు కావుననే యతఁడు కావ్యారంభమున రఘునాథనాయకుఁడు తన్నుఁగూర్చి

ప్రతి పద్యమునందుఁ జమ
త్కృతి గలుగఁజెప్పనేర్తు వెల్లెడ బెళుకౌ
కృతి వింటి మపారముగా
క్షితిలో నీమార్గమెవరికిన్ రాదుసుమా.

యని పల్కినట్లు వ్రాసియుండెను. ఈ పద్యములో నహంకారముగాని యతిశయోక్తిగాని యిసుమంతయు లేదు. ఈ కావ్యమునందలి పద్యములను విశదముగాఁ బరిశీలించినచోఁ బ్రతి పద్యమునను మనోరంజకమైన చమత్కారము కవిపించును. ఈ చమత్కారము శబ్దార్థగతమై శ్రీకృష్ణుని విశ్వరూపమువలె బహుముఖముల విరాజిల్లుచున్నది. ఇందే చేమకూర వేంకటకవిరాజు ప్రత్యేకతయుఁ, బ్రతిభావిశేషమును విందారి తొంకిసలాడుచుండును.

మనము పదార్థములను సూచించుటకై పదములను వాడుచుందుము. నిఘంటువులలోని పదములకుఁ బర్యాయపదము లెన్నో సూచింపబడియుండును. స్థూలముగాఁ జూచినప్పడీ పర్యాయపదము లన్నియు సమానార్థద్యోతకములుగానే కానఁబడును. కాని వ్యుత్పత్తులనుబట్టి చూచినచో వాని యర్థములందొకానొక ప్రత్యేకత చూపట్టుచుండును. దానిని గుర్తించి వాని నౌచిత్య భాసురములుగా వాడినచో నవి కలిగించు నర్థస్ఫూర్తి యతిరంజకమై చమత్కారసంజనకమగును. ఏ పదము నెప్పు డెట్లువాడవలెనో లెస్సగా గుర్తించి దానినట్లు సాభిప్రాయముగా వాడుటలో నాంధ్రవాఙ్మయమున వేంకటకవి కీడుకాఁగల కవు లెవ్వరును లేరు. ఇట్టి సాభిప్రాయ పదప్రయోగము విజయ విలాసమున నిందుగల దందు లేదను సందేహములేక సర్వత్ర గోచరించుచుండును.

శ్రీకలకంఠ కంఠియు ధరిత్రియు దక్షిణవామభాగముల్
గైకొనికొల్వ వారికడఁకన్ గడకన్నులకాంతిఁదేల్చితా
నాకమలాప్తన్ గువలయాప్తతఁ దెల్పెడు రంగభర్తలో
కైకవిభుత్వమిచ్చు దయ నచ్యుతు శ్రీరఘునాథశౌరికిన్.

లోకైకవిభుత్వము శ్రీ ధరిత్రులకు సంబంధించినది దాని నీఁగల్గు నర్వాత రంగభర్తకు శ్రీ ధరిత్రీసేవితుఁడై యుండుటచేతనే చేకూరుచు న్నది. ఆతని దక్షిణవామ నేత్రములు సూర్యచంద్ర రూపములు. సూర్యుఁడు కమలాప్తుఁడు, చంద్రుఁడుకువలయాప్తుఁడు ఈ కమలాప్తతా కువలయాప్తతలు రెండును నింకొకవిధముగా శ్రీ రంగేశ్వరునందున్నవి. కమలాకువలయాంగనలఁ గడకన్నులకాంతిఁ దేల్చు నాదేవుఁడు కమలా ప్తతా కువలయాప్తతలఁ దెల్పుచుండెననుట యెంతో సాభిప్రాయముగా నున్నది.

అడుగుమాత్రమె కాక యంతకెక్కుడుగ నీఁ
జాలెనే యల బలిచక్రవర్తి.

ఇచ్చటి యడుగు శబ్దము నౌచిత్యము వర్ణనాతీతమై యున్నది. అదితప్ప నింకే శబ్దము వాడినను ఇచ్చట నా చమత్కార ముప్పతిల్లదు. బలిచక్ర వర్తి వామనునకిచ్చిన దడుగుమాత్రమేయను విషయమును బురస్క రించుకొని చూచినచో నిచ్చటి చమత్కృతి స్పష్టమగును.

ప్రాయపుగాయకుల్ వెలనెపాన నెగాదిగఁజూడనేర్పులా
రాయని దండమీఁదఁగొసరం దొరకొంటిరి మంచిసాములే
పోయటులైనచో సరసముల్ గద మీకిపుడంచు నవ్వురిన్
గాయజుతూపులమ్ముదురు కందువమాటలఁబుష్పలావికల్.

కాయజుతూపులు పువ్వులు, పుష్పలావికలు పువ్వులుకార కాయజుతూపు

లమ్మదురనుట యెంత సాభిప్రాయముగా నున్నదో రసజ్ఞులకు వేఱే చెప్పనక్కఱలేదు.

"అతవినుతింపశక్య మెజయంతునితమ్ముఁడు సోయగమ్మునన్
బతగకులాధిపధ్వజుని ప్రాణసఖుండు కృపారసంబునన్
క్షితిధరకన్యకాధిపతికిం బ్రతిజోదు సమిజ్జయంబునం
దతవి కతండెసాటి చతురబ్ధిపరీతమహీతలమ్మునన్"

ఇందలి జయంతునితమ్ముఁడు మున్నగు పదములు సార్థకములై నట్టివి. అర్జునుఁడు సోయగమునందేకాక యథార్థమునకుఁగూడ జయంతుని తమ్ముడేయగుట తలంచి చూచినచో విచ్చటి పదప్రయోగౌచిత్యము స్పష్ట మగును. జయంతుడు సోయగమునందును, బతగకులాధిపధ్వజుఁడు కృపారసమునందును, క్షితిధరకన్యకాధిపతి సమిజ్జయమునందును బ్రఖ్యాతి నొందినవారు. ఆ మూడులక్షణములు నర్జునునందున్నవి. అందుచేతనే చతురబ్ధిపరీతమహీతలమున నతనికతండె సాటియని చెప్పఁబడినది.

"కానుకగాఁగవిత్తు బిగికౌఁగిలి పల్కవెకీరవాణి, నీ
దౌనుడితేనె నాచెవులనానఁ, గృపారసధారనాన న
న్నాననమెత్తిచూడు నలినానన!
ఎవ్వనిఁజూచి మేలుపడితే యరవిందదళాక్షి! నీమనం
బెవ్వడుదొచ్చెఁ జెప్పఁగదవే మదకోకిలవాణి, విన్ననేఁ
డెవ్వని చెల్వ నీయెదుట నెన్నఁబడెన్ వినతాంగి!"

పల్కవలసివచ్చినప్పుడు కీరవాణి, మదకోకిలవాణియని సంబోధించుటయుఁ జూచుసందర్భమున నరవిందదళాక్షి, నలినానన! అని సంబోధించుటయు మిక్కిలి యర్థగంభీరములై యున్నవి.

అతి వినోదముగాఁగ రతులఁదేలించునీ
పచ్చలకడియాల పద్మగంధి.
.........................
తృణముగా లోఁజేయు నెంతటివాని నీ
నీలాలముంగరనీలవేణి.

ఈ పై పాదములఁ బచ్చలకడియాల 'నీలాలముంగర' యనువిశేషణము లభిప్రాయ గర్భితములైనవి ఈ విశేషణములే లేనిచో నీ పద్యమున సాధారణార్థమేకాని విశేషార్థము స్ఫురింపదు. పచ్చలను రతులను మాన ముతోఁ జూచుచుందురు. పచ్చలు బరువైనచో రతులఁ దేలించును. నీలమునకుఁ దృణగ్రాహిత్వము లక్షణము. పచ్చల కడియాల పద్మ గంధి కావుననే రతులఁదేలించుటయు, నీలాలముంగరనీలవేణి కావుననే యెంతటివానినైనఁ దృణముగా లోఁజేయఁజాలుటయు సాధ్యములగు చున్నవి.

సరసగఁభీరమైన విశేషార్థము ధ్వనించునట్లుగాఁ గ్రియాదిపద ముల నుపయోగించుట వేంకటకవి కల్పించు చమత్కార పద్ధతులలో నొక్కటి ఈ విధానము వలనఁ బాఠకులనుభవించు నానంద మమంద ముగా నుండును.

కలదులేదన వసియాడు కౌనుతీరుఁ
దళుకుమొగమునవెగయు గుబ్బల బెడఁగుఁ
జూచి యాతవి పిడువాఁడఁ జూపులపుడు
విందువేడుక మిన్నంది కొండదాకె.

మిన్నందుట, కొండదాఁకుట యను క్రియలకు పంతోషించుట యని యర్థము. ఈ యర్థమును సూచించుపదము లెన్నో యున్నవి. వానివి

వాడక వీనినే యిట నుపయోగించుటలోఁ జమత్కారమున్నది. కౌనను మింటితోడను, స్తనములను గిరులతోడను బోల్చుట కవిసమయము. ఇందొకటి శూన్యత్వమును వేఱొకటి యౌన్నత్యమును సూచించును. అర్జునుఁడు చిత్రాంగద కౌనుఁజూచి మిన్నందుటయు, గుబ్బల బెడంగు చూచి కొండఁ దాఁకుటయు ధ్వనిగంభీరములైన ప్రయోగములు.

ధారాధరము వెన్నుఁ దన్నిపుట్టిన చాయ
నున్నదీబింబాధ రోష్ఠివేణి
జక్కవకవతొమ్మ త్రొక్కినిల్చినజాడ
నున్నవీ నవలాపయోధరములు.

పద్యమంతయు నీవిధముగానే నడచినది. ఇందలి వెన్నుదన్ని, తొమ్మ త్రొక్కి యను పదములు సామాన్యముగా నోడించి యను నర్థము నిచ్చుచున్నవి. ఈ వాక్యములందే కర్మలు కర్తలైన యర్థముకూడఁ బొసఁగుచున్నది. మొయిలే వెన్నుదన్ని పుట్టినవిధమున నున్నదీమె జడ మొదలగు నర్థములప్పుడు స్ఫురించును.

చెలువ నేత్రవిలాసంబు చెవులుసోక
బాలకుచలీల యెదఁజాలఁ బట్టిక్రాలఁ
గలికి నెఱివేణి చెలువంబు కాళ్లబెనఁగ
నవలఁబోలేక నిల్చె నయ్యర్జునుండు.

ఈ పద్యమున నర్జునుఁడు ద్వారకనువిడిచి యవ్వలికిఁ బోలేకపోవుటకుఁ గారణములు నుడువఁబడినవి. అందొకటి సుభద్ర సౌందర్యము, రెండవది దానిచే నాకర్షింపఁబడిన యర్జునుని చిత్తవృత్తి. ఈ రెండు కారణములు నిందొకదానినిమించి వేఱొకటి ధ్వనించుచున్నవి. ఇట్టిదే మఱియొకపద్యము.

ధామమో మునఁబ్రేలు రూపంబుఁజూచి
ముదిత యెదఁబాయకుండెడు మూర్తిఁదలఁచి
రమణిమైసగమైన విగ్రహమునెంచి
ప్రోవుమని వేఁడుకొను దేవ పూజవేళ.

ఇఁదద్యుమ్నుఁడు త్రిమూర్తులను సుభద్రను దలంచి తన్ను బ్రోవుమని వేఁడుట ధ్వనించుచున్నది. ఇందుఁ ద్రిమూర్తుల వేఁడుట బాహ్యము. సుభద్రను వేఁడుట యాంతరము.

చిత్తజుఁడగ్గి తూపుమొనచేసినఁ జేయగవిమ్ము పైధ్వజం
బెత్తిన నెత్తవిమ్ము వచియించెదఁ గల్గినమాట గట్టిగా
వత్తరళాయతేక్షణ కటాక్ష విలాసరస ప్రవాహముల్
కుత్తుకబంటి తామరలకున్ దలమువ్కలు గండుమీలకున్.

తామరలు మన్మథుని బాణములు. మీనములాతని ధ్వజచిహ్నములు. సుభద్ర కటాక్షము లీరెంటినిగూడ వశీకరించునట్టివి. ఇది యున్నమాట యేమైనను ఉన్నదున్నట్లు చెప్పినచో నులికి మన్మథుఁడు తూపుమొన చేయుటకును, పై ధ్వజంబెత్తుటకును బూనవచ్చును. ఈ పద్యము సుభద్ర కటాక్షముల యందమును నర్జునునికిఁ గల్గిన మదన తాపాతిశయమును గూడ లెప్పగాఁ జాటుచున్నది.

వేంకటకవి యొక్కొక్కప్పుడు వస్తువులను వానికి సహజముగా నున్న నామములతోడనే సూచించుచు నా శబ్దములచే నపూర్వములైన యర్థముల ధ్వనింపఁజేయుచుండును.

జలరుహగంధిపీనుల పసల్ నవపంఖ్య నదేమిలెక్కమా
జెలియ నఖాంకురాళి నెలచేడియ సైకముఁ దామజాక్కమా

డొంకక గబ్బిచన్నుఁగవ పువ్వులచెండ్లను లేదుబంతనుఁగా
గలికిముఖారవింద మల కల్వలరాయనిఁ ద్రోసిరాజనుఁగా.

మఱి ద్ర చెవులు తొమ్మిది సంఖ్యను లెక్కఁజేయవు అంతకంటెను సుందరములుగా నుండును అవి తొమ్మిది. ఏదేమియంటె యని యాక్షేపించును అను నర్థములిందలి మొదటిపాదమున నున్నవి. అట్లే యామె గోళ్లు చుక్కలయందము నుఁ జుక్క (రవంత బొట్టు) అని యాక్షేపించును. వావివి దవకుఁ దరువాతివావిగా నొనర్చును. సామాన్యశబ్దములనుండియే యిట్టి చమత్కృతితోఁగూడిన యర్థము బయల్పఱుచుట వేంకటకవికిఁ బరిపాటి.

విజయ విలాసమునందలి కొన్ని పద్యములు చివరివఱకు సాధారణమైన యర్థముతో సాగుచున్నట్లే తోఁచి యంత నిర్దిష్టములైన కొన్ని శబ్దములచేఁ బద్యమున కింతకును నపూర్వమైన గాంభీర్యము నొదఁ గూర్చుచుండును. అట్టియెడ నాచివరఁజెప్పబడిన వాక్యములే గూఢముగాఁ బై పాదముల నిమిడియున్న యర్థమును బయల్పరుచుటకు సూచనము లగును.

ఊదుకపోవు శంఖమువహో గళరేఖ, శరాసనంబులన్
వాదుకఁబట్టుఁగన్బొమల వైఖరి, వంకలుతీరుచున్ గటా
క్షోదయలీల సాయక సమూహములన్, విషమాస్త్రు గెల్వఁజో
యేదొరసాటి యీవరువ కెన్నఁగ వీరవిలాస సంపదన్.

ఇచ్చట వీరవిలాస సంపదయనుమాట చూచినంతనే గళాదుల విలాసమే కాక వీరముకూడ స్ఫురించును శంఖము నూదుకపోవుట, శరాసనముల వాదుకఁబట్టుట, సాయకములవంకలు తీర్చుట, గెల్చుట యనునవి వీరత్వలక్షణములు. గళము శంఖమును, కన్బొమలు శరాసనములను, కటాక్ష

ములు సాయకములను దిరస్కరించుట విలాసలక్షణములు. ఇందలి యూదుకపోవు, వాదుకఁబట్టు, వంకలుతీర్చు అను క్రియలు సాభిప్రాయ ములుగా వాడఁబడినవి. అవి యీ పద్యమునకుఁ గలిగించు శోభను వివ రించుటకంటె నూహించుట మంచిది. అది యనుభవైకవేద్యము.

వేంకటకవి యే పదమును వాడినను దానికి వైయర్థ్యము కలుగ కుండఁ దగిన యావరణమును గలిగించును. శబ్దప్రయోగమున నాతఁడు వహించు జాగరూకత యాశ్చర్యకరమైనది.

అలకలు నీలము, లధరం
బల పగడము, గోళ్లు ముత్తియంబు లటంచున్
తెలుప మునువిందుఁ జిలుకల
కొలికితెలుంగెల్లఁ బూసగ్రుచ్చినరీతిన్.

ఇటఁ బూసగ్రుచ్చినరీతి ననుటను సార్థకముచేయుటకై కవి చూపిననేర్పు విదితమగుచునేయున్నది. నీల పగడ ముత్తెములను బూసగుచ్చినవిధ ముస గ్రుచ్చవచ్చును. అందుచేతనే యలకాధరనఖాదుల నాతఁడు వానిఁతో బోల్చియుండెను. ఈ ఉపమానమే లేనిచోఁ బూసగ్రుచ్చిన యను మాట నిరర్థకమైయుండును.

"కన్నులు దీర్ఘముల్ నగుమొగం బవురా తలకట్టు తమ్మిపూ పున్నమ చందమామలకు, బొక్కిలిచక్కదనంబు చెప్పఁగా నున్నదె, మేలుబంతులుపయోధరముల్, నడికౌను సున్న యో వెన్నికకెక్క వ్రాఁతఫల మవ్వరవర్ణినికి వ్నిజంబుగన్.

సుభద్ర వరవర్ణిని. అనగా శ్రేష్ఠమైన వర్ణములుకలది యను నర్థముకూడ నున్నది. దీర్ఘములు, తలకట్టు, పొక్కిలి, మేలుబంతులు, సున్న యను

నవి ప్రాతయందుపయోగింపఁబడు పద్ధతులు. సుభద్ర వరవర్ణినీత్వము సార్థకమగుటకును, నామె ప్రాతఫలమెన్నికకెక్కుటకును, గవి పద్యమునఁ బైకల్పనము కావించెను.

పైని చూపబడిన యర్థచమత్కారములవలెనే వేంకటకవి పెక్కు చోట్ల శబ్ద చమత్కారములనుగూడఁ బ్రదర్శించెను. ఇందీతఁడు చూపిన నేర్పు మిక్కిలి ప్రశంసనీయముగా నున్నది.

విహరింపన్ మలయానిలం బెవనఁ, దావింజిక్కె నెమ్మేనియా
విహరింపన్, బికనాద మల్ చెవికిఁగావించుం జవుల్ పోదమా
సహకారాళీ పసంబు జూడఁగ వయస్యా హాళివాటిల్లెడున్
సహకారాళి పసంబుఁ జూడగ వయస్యా హాళియౌనేకదా.

ఇందలి మొదటివాక్యములు నైమిగురచ్చురుటను జెప్పినట్టివి చివరివాక్యమునఁగల చమత్కారము నాలుగవ వాక్యముపై నాధారపడియున్నది. నాల్గవయచ్చర సహకారాళి పసంబుచూడ నాసక్తి కలుగుచున్నదని పల్కినది. అయిదవయామె దానినర్థాంతరముచే సమర్థించుచున్నది. హారములోఁగూడిన ఆళిపదము చూడఁగా హాళి యౌనుగదా యని దాని భావము. ఇట్లే చిత్రాంగదపై వలపుగొనిన యర్జునుఁడు విశారదుడికిఁ దుమ్మెదల ధ్వనులను వర్ణించిచెప్పు సందర్భమునఁగూడఁ జక్కని చమత్కారము వ్యక్తముచేయబడినది.

"తనకుం గౌఁగిలియీవౌకప్పుడును నాథా నీ కరస్పర్శనం
బున గిల్గింతలె యందుఁబద్మిని కరాంభోజమ్మునన్ మందమం
దనటద్వాయుచలద్దళాంగుళులు కన్పట్టంగ నవ్వేళ్లురా
మని రారాయని పిల్చెనాఁదగెన్విరేఫావ్యంత దీర్ఘధ్వనుల్"

ఇందు పద్మిని ద్విరేఫధ్వని మిషమున సూర్యుని రారమ్మని పిలుచున్నది. ద్విరేఫమనఁగా భ్రమరనామమున రెండు రేఫములు గల తుమ్మెద. దానికే రెండు రేఫములను వర్ణములు గాఁ జెప్పవచ్చును. దీర్ఘాకారముతోఁ గూడిన రెండు రేఫముల ధ్వనులే అనఁగా 'రారా' అనునవే పద్మిని పిలుచునట్టి రారా అను ధ్వనులైనట్లుఁ జెప్పెనని యిందలి చమత్కారము

వేంకటకవి శైలి యాలంకారికమైనది. ఈతని పద్యములన్నింటి శాబ్దికమైనదో, యార్థికమైనదో యేదో యొక యలంకారము చూపట్టుచునే యుండును. అనుప్రాస యమకాదులగు శబ్దాలంకారముల వాడుక యందతనికిఁ బ్రీతి హెచ్చు. అవకాశము దొరకినచో నీతఁడు వానిని వాడక మానఁడు.

హాటాహాటిన్ హాలాయుధుం డహో మహోగ్రుఁడై తనం
తటన్ ఘటాన విస్ఫుటీవిభంబెవింగివచ్చెనో
ఘటాఘటీల నెల్లఁ ద్రోచఁగట్టి పట్టఁబంచెనో
మహో మహో మహో భటోద్భటార్భటుల్ ఘటిల్లెమిన్నగా.

అనునది వృత్త్యనుప్రాసమునకును.

కనన్ సుభద్రకున్నపుంబు గాఁగ నెమ్మిగినిలో
కనన్, నిజంబుగాఁగ నేజగంబునందుఁ గాచి కా
కనన్ దదీయవర్ణనీయమహావిభావభేదమౌ
కనన్మనోజ్ఞ రేఖలెన్నఁ గాఁ దరంబె గ్రక్కునన్.

అనునవి ఛేకానుప్రాసమునకును నిదర్శనములు. ఇట్టి వింకను ననేకములున్నవి. వేంకటకవి యమకము నెంతో చమత్కారముగా వాడును.

"పుట్టినదాదిగాఁ దనదుపుణ్యమెదాదిగ వైరి భూమిభృ
ద్ఘట్టమదంబుదాదిగ, సదాదిగధీశనుత ప్రతాపుఁడై
పట్టమహాభిషేక బహుభాగ్య ధురంధరుఁడై యయోధ్యయం
పట్టణమేలఁ సామియెయనం రఘునాథవిభుండు వర్ధిలుం.

ఈవెలంది మొదల్పైడిలో వెలంది
యీనెలంత లలాటంబు చేనెలంత
ఈ సుపాణి రదశ్రేణి యేసుపాణి
యీవిదారు మృగీమద శ్రీవిదారు.

అనునవి యమకమునకుఁ జక్కని దృష్టాంతములు.

వేంకటకవి శ్లేషాలంకారమును వాడినచోట్లెన్నియో కలవు.. అందు రమణీయములైనవి రెండుమూఁడు మాత్రము సూచించెదను.

భ్రమరకిమనోహరం బౌటఁ బద్మమగును
దారకాహృద్యమగుట సుధానిధియగు
రెంటిజగడాలు మోమున నంటియుంట
నష్టమభియంట చెప్ప యీయరుఁబోఁడి.

ఇందలి భ్రమరక తారకాద్యశబ్దములందలి శ్లేషసువ్యక్తముగనే యున్నది. రెంటి, జగడాలు అను పదములను రెంటి, జగడాలు అని విఱిచి యర్థాంతరము కల్పింపవచ్చును. ఇట్లే పదముల వేఱువేఱుగా విఱుచుట వలన రమణీయమైన యర్థాంతరము స్ఫురించుచోటింకొకటి కలదు.

అపుడు నృపుడు ప్రఫుల్ల నవాంబుజ ప్ర
సన్న ముఖుఁడయి మలయధ్వజక్షితీశ

కమల హితునకు మామకాగమనవార్త
తెలుపుమంచు విశారదుఁ బిలిచిపంపె.

అచ్చట మలయధ్వజక్షితీశ కమలహితునకు మామ క + ఆగమనవార్త యనియు, కమలహితునకు, మామకు, ఆగమనవార్త యనియు నర్థము చెప్పవచ్చును. మలయధ్వజ క్షితీశకమలహితునకు, మామ, కాగ, మన వార్త యని పదముల విఱిచి యర్థము చెప్పుట మఱింత సొగసుగా నుండును.

వెలఁది కెమ్మోవి గని జపావృత్తి మఱచెఁ
దరుణి వేఁగౌను గని హరిస్మరణ మఱచెఁ
గదమయననేల వెసమొక్కటియ తక్క
మఱచె నన్నియు నాకృత్రిమత్రిదండి.

ఇందలి మొదటి రెండు పాదములలో హృదయావర్జకమైన శ్లేష యున్నది.

వేంకటకవి కొన్ని పద్యములలో మొదటి మూఁడు పాదములందు విశేష విషయమును దెల్పి నాల్గవదాన సామాన్య విషయోద్ఘాటనము చేసి పైదానిని సమర్థించును ఇట్టి యర్థాంతర న్యాసము లన్ని కావ్యములందును గాననగును కాని వేంకటకవి నాల్గవపాదమున నించుక శ్లేషను సూచించి పైని చెప్పఁబడిన విషయమున నపూర్వమైన చమత్కారము భాసింపఁజేయును.

ప్రాయపుఁదెక్కునన్ జెఱవపఱ్కులు చిల్కలు గారవించుఁ, గం
డొయి చకోరపాళి దయతోఁ బెనుచుం, జనుకట్టు మచ్చికల్
చేయు సదా రథాంగ యుగళిన్, నడ లంచల బుజ్జగించు, నౌ
నేయెదనింపుగాపు గణియింప నవీన వయోవిలాసముల్.

తపీసు వయోవిలాసములనఁగా యౌవన విలాసములనియుఁ గ్రొత్తలయిన పత్రుల విలాసములనియు నర్థము. పైని జెప్పఁబడిన యంశము లీ రెండు విషయములనుగూడ సమర్థించుచున్నవి.

ఇలఁగలవీళ్లుసూడ మన మేటికిఁబోవలెఁ బోయినన్ వడిన్
విలుపఁబనేమి? విల్చిన మువింగవి త్రుళ్లఁగనేల? యంతలో
నలిగి శపింపనేమిటికి నాతఁడు? వ్రాఁతఫలంబు తప్పునే
కలిగినవేకదా మకరికల్ మనకెప్పుడు వ్రాసియుండుటల్.

ముఁనిశాపహతలైన యచ్చరలు విలపించు ఘట్టమునందలి దీ పద్యము. ముని వారిని మకరికలు గమ్మని శపించి వారి త్రుళ్లడంగించెను. మకరిక లనఁగా మకరికాదిపత్రములు. మకరికలు వ్రాసియుండుట విలాసవతు లైన వారికంతకుఁ బూర్వమున్నదియే. ఇప్పుడు భగవంతుడు వ్రాసిన వ్రాఁతయు మకరికలు గమ్మనియె. అర్థమువందుమాత్రమె భేదమున్నది. మకరికాలిపి వారికున్నందున మకరికాత్వము కలిగినదని యిందలి చమత్కారము.

ప్రపంచమున నడుమంత్రపు సిరి యబ్బినవారు విక్కుటయు, విల్గుటయు, విఱ్ఱవీగుటయు సహజము." గదుఁడు సుభద్రను వర్ణించు సందర్భమునఁ గవి యీ విషయమును బురస్కరించుకొని అద్భుతమైన యర్థాంతర న్యాసము సంఘటించెను.

"అతివకుచంబులున్ మెఱుఁగుటారును వేనవియున్ ధరాధిపో
న్నతియునహీనభూతికలనంబు ఘనాభ్యుదయంబు విప్పుచోం
దితిమని మాటిమాటికిని విక్కెడు నీల్గెడు విఱ్ఱవీగెడున్
క్షితినిటుఁగాదె యొక్కకరికిన్ నడుమంత్రపుఁ గల్మికల్గినన్"

కుచంబులును, మెఱుఁగుటారును, వేవలియు యువతులకు యౌవన ప్రాదుర్భావము కలుగగానే యబ్బు నభ్యుదయ విశేషములు. అవి క్రమముగా విక్కి, వీర్గి వెల్లివిరియుచుండును. బాల్యమున నుండక యౌవనముతోవచ్చినవగుటనే నవి వారికి నడుమంత్రపు సంపదలు. ధరాధిపోన్నతి, అహీనభూతి విభవము, ఘనాభ్యుదయము అను వానియందలి శ్లేష యీ యర్థాంతరన్యాసమునకు మఱింత మెఱుఁగు చేకూర్చుచున్నది.

కవులెంత రసవంతముగాఁ గావ్యములు రచించినను సమకాలము వారందలి రంధ్రములనే యన్వేషింతురు గాని గుణముల గ్రహించి ప్రశంసింపరు. ఎవ్వరో మహా భాగ్యశాలులైనవారికి మాత్రమే సమకాలము వారిచేఁగూడ మెప్పువడయు సుకృతము లభించును అసాధారణ రచనావిలాస సంపన్నుఁడయ్యు వేంకటకవికూడఁ దనకాలము వారిచే ననుకొన్నంత మెప్పు నొందఁడాయెను గాఁబోలును! మనస్సును వేధించు నా విషయమును సూచించుచుఁ జిత్రాంగదా విరహవేదనా దోదూయమానుఁడై ధనంజయుఁడు పొగులు సందర్భమున వసంతవిజృంభణము వర్ణించు మిషతో నీ పద్యమును రచించెను.

> క్షితిపయి నట్టి మ్రాకులు చిగిర్ప వసంతుఁడు తాఁ బోపగుం
> భితపదవాసనల్ నెఱప మెచ్చక చంద్రుఁడు మిన్నునం బ్రప
> న్నతయును సౌకుమార్యము కనంబడ ఱాల్గరగంగఁ జేసె నే
> గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా.

ఇట వసంతుఁడాచరించిన కార్యమును జూచి మెచ్చక చంద్రుఁ డంతకంటెను మిన్నయైన పని నాచరించెనని తెలియుచున్నది. వసంతుఁడు నట్టి మ్రాకులఁ జిగిరింపఁజేయుఁగాఁ జంద్రుఁడు ఱాలనే కరగంగఁ జేసెను. రసోపగుంభిత పదవాసనల్ నెఱపుట, ప్రపన్నతా సౌకుమార్యములఁ

గనంబడుచుట అను వానియందలి కవివిరమైన యర్థముకూడ వ్యక్తము చేయఁబడుచున్నది. వసంత చంద్రపదములానాఁటి కవుల కెవరికో సంకేతములై యుండును పరిశోధనసేసి వారెవ్వరో కనుఁగొనవలయును. అప్పుడీపద్యము వెల్వఱుచు చమత్కారము మఱింత విశిష్టమై యలరారును.

వేంకటకవి యుపమానములు చాలచోట్లఁ గడుంగడు మనోహరములై వర్ణ్య వస్తువును సంపూర్ణ స్వరూపముతో సాక్షాత్కరింపఁ జేయుచుండును. ఇట్టి చక్కని యుపమానములు విజయవిలాసమున నసంఖ్యాకములుగా నున్నవి

అఘనవిఁబాసి మంజీరాఘోషము మెఱయనరిగె నంతఃపురికిఁ
దా ఘనజఘన తళుక్కన మేఘము నెడఁబాసి చనెడి మెఱపో
యనఁగన్.

ఇట కష్టియైన యర్జునవి మేఘముతోడను సౌందర్యశోభితయైన సుభద్రను మెఱపుతోడను బోల్చుట యెంతయు నౌచిత్య భాసురమై యొప్పారుచున్నది.

సుభద్రా వివాహసందర్భమునఁ దెఱవలు తెరవంపఁగా సుభద్రవగుమొగము శరన్మేఘముఁ బెడఁబాసి వెలుంగు చంద్రబింబము వోలెఁ గనఁబడెననుట యుఁ బైదావివలెనే మిక్కిలి సుందరముగా నున్నది. అర్జునుఁడును సుభద్రయు వివాహానంతరము బంగారు పీటమీఁదఁ గూర్చుండిన సందర్భమున వేంకటకవి సుభద్ర నిట్లువర్ణించెను

మృగమదము చెంతఁ గుంకుమరేఖవోలె
నీలమణిపొంత మదిరి పొన్నేకువోలె
మేఘముకడఁగటను దీగ మెఱుపువోలె
నర్జునుని చెంగట సుభద్ర యలరె నపుడు.

ఇందు మృగమదాదులు మూఁడును నల్లనివి. కుంకుమ రేఖాదులు మంచి వన్నెకలవి. సుభద్రార్జునుల కిచ్చట వాఁడబడిన యుపమానములు మిక్కిలి సహజములును సుందరములునై యలరారుచున్నవి.

సాధారణముగాఁ గవు లుపమాలంకారముల వాడునపుడు సమాన ధర్మములను బాఠకుల యూహలకు విడిచివేయుచుందురు. వేంకటకవి యట్లుకాక కొన్నిచోట్ల నా సమానధర్మములనుగూడఁ బూర్తిగా వివరించి యుపమానములను సమగ్ర మూర్తులుగా నంతరించును.

ఆదరహాసచంద్రికల యందము నాప్తులమీఁదఁ జిల్కు న
త్యాదరశీతలేక్షణ సుధారసధారయుఁ జూడఁజూడ నా
హ్లాదము గొల్పఁగాఁగల కలామహిమంబుఁ దలంచి చూచినన్
మాదిరిసేయవచ్చు జననాథుమొగంబును జంద్రబింబమున్.

ఇందుఁ జంద్రబింబమునకును వర్ణనుని మొగమునకును గల యౌప మ్యము పూర్తిగా వివరింపఁబడినది.

అమృతమొలుకు నధరంబునఁ
గుముదచకోరముల నేలుకొను శుభదృష్టిన్
గమలముల కళలు గైకొను
రమణీమణి ముఖము తెలుచిరాజనవలయున్.

ఇచ్చట నుపమానోపమేయములకుఁ దాత్పర్యభేదముచే సమానధర్మము విరూపింపఁబడినది. ఇట్టి సంపూర్ణోపమాలంకారములు విజయ విలాస మున వింకను బెక్కులుగలవు.

వేంకటకవి క్రమాలంకారమును వాడుపద్ధతి విచిత్రముగా నుండు దును. పద్యమున ముందు వస్తువులను వర్ణించి తరువాతఁ గ్రమముగా

దత్క్రియలఁదెల్పి పిమ్మటఁ దన్నిహితములైన విశేషములఁ జేర్కొనును. విస్తర భీతిచే నొక్కటే యుదాహరణమొసంగెదను.

తడఁబాటుగఁజదు వేదములు నాతనికంచుఁ
బరమేష్ఠి మెచ్చరు ధరణీ సురులు
కడమాటు పగవానిఁగని చేమఱచెనంచు
భార్గవు మెచ్చరు బాహుజనులు
పనికిరాకొకమూలఁబడియె నాతని వస్తు
వని కుబేరుని మెచ్చ రర్యజనులు
వీటిపాలైన నాగేటి పాటుననేమి
యని హలాయుధు మెచ్చ రంఘ్రిభవులు.

పాడిఁదప్పక, ధర్మంబు పట్టువిడక
లక్షలకు నమ్మఁజాలి, నల్గడలభూమి
వరులు మే లనఁదగి యిట్లు పురిఁబొలుతురు
చనువుసాములు ధనధాన్య సంపదలను.

గీతమునందలి మొదటి మూఁడుపాదములును బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల కందఱికిని సమానముగను బ్రత్యేకముగను గూడ నన్వయించును. చివరిపాదము క్రమముగా వారికిఁ గల సంపద్విశేషములఁ దెల్పును. ఇంక నద్భుతములైన భావకల్పనలతోఁ గూడిన యుత్ప్రేక్షలును నతిశయోక్తులును విజయవిలాసమునఁ జాలగాఁ గలవు. అవి యితర ప్రబంధ సామాన్యములగుటచే వానిని నిక్కడ వివరింపఁబూనను. కాని వేంకటకవి భావౌన్నత్యమును సూచించుటకు రెండు పద్యములు ద్ధరించెదను. ఈతని భావములు దాత్తములును జమత్కార సంపూర్ణములునై యుండి, యెంతో మెచ్చుగొల్పుచుండును.

పున్నమరేలఁ దత్పురము పొంతనె పోశిఖరాళిఁదాకి వి
చ్ఛిన్నగతిన్ సుధారసముచింది వయిందిగుళారనంతనుం
దిన్నెల సన్నగిల్లు, నది నిక్కముగాదవిరేని యాపదా
ర్థ్వస్నెపసింకి మేడలకు గాఁబని యేమిల సౌధనామముల్!

విరహిణులంగలంపఁ గలవీరులు వీరని తమ్ముఁజేర న
య్యూరుకున వాలుఁజూపులకు నోడుట నంకముకాఁగ మీనముల్
హరిణము, నట్లనే తమ శరాంశులు నోడెనో! గాక బాలికల్.
గరఁపగఁగరాదె మేలనుఁ గ్రొచెవరీమక శైలభాంఫముల్.

వేంకటకవే విజయ విలాసమునఁ దాను గల్పించిన చమత్కారమును. రచించిన పద్యములందలి విశేషములను గొన్ని యెడలఁదానే దిఙ్మాత్రముగా సూచించుచుండును. ఆ సూచనలనుబట్టి వెనుకకుఁబోయి పరిశీలించినచో యందలి విశేషములు సువ్యక్తములగును. సహకారాళి పదంబుఁ జూడఁగ వయస్యాహాళి యౌనేకదా యను పద్యమునకుఁ దరువాత వేంకటకవి యాయచ్చరలు.

అవి యితరేతర చతురోక్తుల గుంభన మెఱయ నరిగిరని సూచించెను. ఇది చూచినపిమ్మటనే పై పద్యమునందలి యితరేతర చతురోక్తుల గుంభన తేటతెల్లమగును. చెలికత్తెలు సుభద్రకు శిశిరోపచారము లొనర్చి మదనమలయానిల చంద్రకోకిలాదుల నుపాలంభింపఁ దొడంగిరి. ఈ యుపాలంభమున బవనూకాగ, వికార, మమకార, చమత్కారములు కలవని వేంకటకవియే సూచించెను. అచ్చటఁగల పదునారు పద్యములను బరిశీలించి చూచినచో నందలి బహూకారాదులు వ్యక్తములగును.

"చక్కనివారిలో మిగులఁ జక్కనివాఁడవుగాన నీకెనా
చక్కని వారిఁజంద్రుని వసంతునిఁ గూరుచుకొంటి వందమోఁ

జక్కెరవింటిరాజ! యెకసక్కెమదేమని కూర్చుకొంటివ
మ్మక్క! యరూపకంబయిన యాయెలతెమ్మెర నాలిబూతమున్

ఇందు బహూకార వికారములు విందియున్నవి.

చక్కెరవింటిరాజు నగచాపునితో నెదిరించి పద్దనాఁ
డెక్క డనుంటివీవు, మధువెక్కడనుండెను, మందమారుతం
బెక్కడనుండె, సిగ్గుపడరేమిపుడాతఁడదృష్టరేఖచే
రక్కొపి క్రమ్మఱం బ్రదికిరాగ వజీర్లయినారుగా శశీ.

ఇందలి వికారము సువ్యక్తమే.

మాకలకంఠియు నీవును
నేకగ్రీవముగ నుండురిన్నాళ్ళు నయో
కోకిల యిపుడేలలచెదు
నీకగునే యిగురుఁబోడి నెత్తురుద్రావన్.

రాచిలుకా! కోమలిదెసఁ
జూచితె! శ్రుతికటువులనెడి శుకనామము నీ
కే చాడ్పునఁదగు వలదిఁక
మాచెపఁ దెరవించితేవి మాటలువచ్చున్.

ఈ రెండు పద్యములలో మమకార చమత్కారములు కానవచ్చుచున్నవి. అసలు విజయవిలాసము నందలి పద్యములలోఁ జమత్కారము లేనిదే లేదుగదా!

శ్రవ్యకావ్యములందుసైత మొక్కొక్కప్పుడు దృశ్యకావ్యోచితములైన పట్టులు కానవచ్చుచుండును ఇరువురుపాత్రలు సంభాషించు

నప్పు డందొకరిమాటలు ద్వనిగర్భితములై యర్థద్వయమున కాకరము లుగా నుండును. రెండవ వారాయర్థద్వయమునందుఁగల సామాన్యార్థ మును మాత్రమే గ్రహింపఁజాలియుండఁ బాఠకులకును సామాజికులకును విశేషార్థము స్ఫురించి చమత్కారము కలిగించుచుండును. ఇట్టి చమత్కార మును నాటకీయ చమత్కృతి యందురు. (Dramatic irony) ద్వితీ యాశ్వాసాంతమున సుభద్ర యతిరూపుఁడైన యర్జునుని నర్జునుని గూర్చి యడుగ నాతఁడిచ్చు ప్రతివచనములందిట్టి చమత్కృతి పుష్క లముగాఁ గానవచ్చుచున్నది.

కోమలియీగతిన్ మదిఁదగుల్వడఁ బల్కిన నవ్వినిర్జర
గ్రామణి సూనుమెచ్చెచటఁ గంటిరొ యంటివి. కన్నమాత్రమే
యేమని చెప్పవచ్చునొకయించుక భేదములేక యాయనే
యేమయి యున్నవారము సుమీ వికచాంబుజ పత్రలోచనా !

ఆయనయే మేమయియున్నవారముసుమీ యన్న వాక్యమునందలి యాథార్థ్యము నెఱిఁగిన వారిగుట నీ పద్యమును జదువునప్పుడు పాఠకు లొందు చమత్కార జనితానందమునకు మేరయుండదు.

సంస్కృత నాటకములందుఁ గవులు తఱుచుగఁ బాత్రల సంభాష ణముద్వారా భావ్యర్థములను సూచించుచుందురు. ఆ సంభాషణ మప్ప టికి సామాన్యముగానే గోచరించినను గ్రమక్రమముగా నందలి భావ్యర్థ గర్భితత్వము వ్యక్తమగుచుండును వేంకటకవియు విజయవిలాసమున నుపమానాదులచే భావ్యర్థమును జక్కగా సూచించుచుండును. అర్జునుఁడు విశారదాదులవే ననుగతుఁడై తీర్థయాత్ర కరుగఁబోవునప్పు డాతఁడు పరిణయమౌట కేగుగతినరిగెనని కవి సూచించి యుండెను. కావ్యాంత మున నొక్కసారి సింహావలోకనముచేసి చూచినచో నాతఁడు తీర్థ యాత్రాచరణము నెపమునఁ బరిణయమౌటకే యేగెనని తెలియవచ్చును.

శాపవిముక్తులైన నందాదు లర్జునునిఁ బొగడి,

నీకుఁ గల్యాణమౌ రమణీయరూప
నీకు వంశాభివృద్ధియౌ నృపకలాప
నీకు జయమగు సాహస నీతిభరిత
నీకు సామ్రాజ్యమే మహనీయరూప

యని శుభోదర్కంబు గావింప దీవించిరి. ఇది ఇప్పటికి సామాన్యాశీర్వచనమువలెనే గోచరించును. కాని యిది భావ్యర్థ నిర్భరమైన యథార్థ వచనమే. ఏలయన నర్జునుఁడు ముందు సుభద్రను బెండ్లాడి యాదవుల నోడించి వంశవీరుఁడైన కుమారునిఁ బడసి, సామ్రాజ్య సౌఖ్యముల నంది యలరారనున్నాఁడు. ముందుకాబోవు నీ విషయములనే వారి యాశీర్వచనము సూచించుచున్నది.

ఇంద్రప్రస్థమున వివాహ మహోత్సవము ముగిసినపిమ్మట సుభద్రార్జునులు కృష్ణునకు నమస్కరింపఁగా నాతఁడు లేనగవుక్రమ్మ "మీ రిటు లెల్లకాలమున్ మింతురుగాక శోభనము మీఁదనె శోభనమైముదంబుగన్" అని దీవించెను. ఇది ద్వారకలో నంతకుముందు జరిగిన వివాహ మంగళమునేకాక ముందు జరుగఁబోవు శోభనమునుగూడఁ జక్కఁగా సూచించుమన్నది.

వేంకట కవి సుభద్రా ముఖ సౌందర్యమును వర్ణించుచు.

స్వకపోలకల్పిత మనో
జ్ఞ కళాగతి కెట్టులౌను సరి ఛాయాచో
రకరుచి సందర్భంబని
ముకుచము నగుకరణి నవ్వుమోము చెలంగన్.

అని వర్ణించెను. ఇందలి యొక యర్థము సుభద్రి ముఖసౌందర్యమునకు సంబంధించినది. రెండవది కావ్యమునకు సంబంధించినది వ్యబుద్ధిచేఁ గల్పింపఁబడిన సుందరమైన కళాసరణిగల కావ్యమునకుఁ బరకావ్య భావాదికములను గొంగిలించి మెఱుఁగు కూర్చుకొను పద్ధతి యెట్లు లీడగునని యీ సందర్భమున స్ఫురించు నర్థము. దీనివలన వేంకట కవికిఁ గావ్యభావాదికములయెడఁగల నభిప్రాయము వ్యక్తమగుచున్నది విజయ విలాసమునందలి కథ భారతమునుండి గ్రహింపఁబడినదేయైనను ఇందలి భావములు చాలవఱకు స్వతంత్రములై యొప్పారుచున్నవి. వేంకటకవి పద్యరచనలోఁ జూపినకళ యన్యదురనుకరమై యసామాన్య ప్రతిభాశక్తిని వెల్లడించుచున్నది. కావ్యములలో దివ్యులను బాదాదిగను మానవులను మస్తకాదిగను వర్ణింపనగునని చెప్పుదురు. వెంకటకవి

ప్రకటశ్రీహరి యంఘ్రిఁబుట్టి హరుమూర్ధంబెక్కి యాపాదమ
స్తకమున్ వర్ణనకెక్కు దేవి సహజోదంచత్కులోత్పన్ననా
యకరత్నంబని యచ్యుతేంద్ర రఘునాథాధీశ్వరస్వామికిన్
సకలైశ్వర్యములున్ నిజేక్షువలనన్ దాఁగల్గఁగాఁజేయుతన్.

అను పద్యమువలన నీ సాంప్రదాయమును సూచించెను.

విజయవిలాసమునఁగల పాత్రలలో నాయికా నాయకులును విశారద శ్రీకృష్ణులును ముఖ్యులైనవారు. శ్రీకృష్ణపాత్ర చిత్రణమునఁ గవి యెంతో నేర్పుజూపెను ఆతఁ దతని లోకజ్ఞతను వ్యవహార దక్షతను జక్కఁగా సూచించెను బలరాముఁ డెఱుఁగకుండ సుభద్రార్జునులకు వివాహము చేయింపవలెనని కృష్ణుఁడు మొదటినుండియు ప్రయత్నము చేయుచుండెను. బలరాముఁ డర్జునుని నిజమైన యతియనియే భ్రమించి చాతుర్మాస్య మచ్చటనే సలుపవలెనని ప్రార్థించెను. అర్జునుఁ

తందు కంగీకరించెను. బలరాముఁడు సుభద్ర నాతని శుశ్రూషకు విని యమింపుమని పలుకఁ గృష్ణుఁడు

వయసువారును జక్కనివారు వీరు
మనసుమర్మంబు లేవియు మనకుఁదెలియ
యన్నయవిగావు సేవకు ననుపఁదగునె
కన్నె-నదియేమొ తెలిసికొమ్మ"

అనిపలికెను. సంయములకును గోరికవెలయఁగఁ గన్యలెకారా శుశ్రూష చేయఁగాఁదగువారలని పల్కి బలరాముఁడు సంశయింపక యట్లే యొనరింపుమని చెప్పఁ గృష్ణుఁడు సంతోషమున నట్లే యొనరించెను. పిమ్మట నాతఁడాయతి యర్జునుఁడే యని రుక్మిణీ సత్యభామలకుఁ దెలిపెను. తరువాత సుభద్రార్జునుల వివాహమునకుఁ దగిన యేర్పాటులన్నియుఁ గావించి యందఱతోపాటు తానును బశుపతిపూజ కరిగెను. వివాహమువేళ కరుదెంచి యాతఁడే దానిని సక్రమముగా జరిపించెను. అర్జునుఁడు సుభద్రతో వెడలిపోయిన సంగతి యెఱింగి బలరామాదు లాగ్రహావిష్టులైయున్న సమయమునఁ గృష్ణుఁడు పల్కినపలుకు లాతని కార్యాచరణ సామర్థ్యమును వేనోళ్లఁ జాటుచున్నవి. అతఁడు బలరామునికి నర్జునుని యసామాన్య బలపరాక్రమాదులు వివరించి

మాలిమి తేఁగావ ననుమానము నామదిఁ దోఁచె నప్పుడే
బాలిక సేవ సేయఁ బనుపన్వలదంటివిగా వె దానికే
మేలవుగల్గు మేనమఱఁదింతియె యాతఁడు సైనదైనదే
లోలత వింకవాగవలిలోపల నిష్ఠురమేల పల్కఁగన్

అని పల్కి సుభద్రి కన్నివిధముల నర్జునుఁడే తగిన వరుఁడని నిరూపించి యాతనితోఁ గూడ నింద్రప్రస్థమున కరిగెను. తమ్ముని మాట-

యన్న జవదాటని యన్న యందు కంగీకరించి యింద్రప్రస్థమునకరిగి చెల్లెలి వివాహము యథావిధిగా జరిగించెను. వెంకటకవి యీ పాత్రను బోషించుటలో మిగులనేర్పు ప్రదర్శించెను. శిష్టపాత్రల విషయమున విశేషమంతగాఁ గానరాదు.

ఇంక వెంకటకవి శైలినిగూర్చి రెండుమాటలుచెప్పి ముగించె దను. ఇతఁడు సంస్కృతాంధ్ర పదములను రెంటిని సమముగానే వాడును. ఎచ్చటనోకాని యతిదీర్ఘసమాస ఘటనమునకుఁ బూనఁడు. తెలుగుపదముల కూర్పులో నింత నైపుణ్యమును జమత్కారమును బ్రదర్శించిన కవి యింకొకఁడులేఁడు లలితమధురములు, సాభిప్రాయ ములునైన యలతి యలఁతి పదములతోడనే యాతఁడు గంభీరములైన యర్థముల వివరించుచుండును. యమకమును బ్రదర్శించునప్పుడు సంస్కృతాంధ్ర పదముల వినుమటలో నాతఁడు చూపిన నేర్పనన్య సామాన్యముగా నుండును. పద్యముల నడక మెచ్చటను గుంటక మకరంద ప్రవాహమువలె సాగిపోవును. ఒక్కచోటఁగూడ శ్రుతి కటువైనశబ్దము కనఁబడదు. భాష యెల్లెడ సరసమై జాతీయమై సుబో ధమై యలరారుచుండును. పద్యములలో మచ్చునకైన వ్యర్థపదమొక్క టియుఁ గానరాదు. పద్యరచన విషయమున నాతఁడు చేసిన సాధన చాల గొప్పది. ప్రశంసనీయమును ననన్యసాధ్యమునై యది యెంతో మెప్పు గొల్పుచుండును.

వేంకటకవి చెప్పఁదగిన వచనములను మూఁడాశ్వాసములలో మూఁడింటిని రచించెను. ఇవి యనుప్రాస యమకాదులతోడను దీర్ఘ సంస్కృత సమాసములతోడనుగూడి ప్రౌఢములై సర్వప్రబంధ వచన సామాన్యములుగా నున్నవి. ఇందు రెండు కొంచెము దీర్ఘతరములైనవి: ఈ రెండును వర్ణనకొఱకుపయోగింపఁబడినవే. మొదటిది యరునుఁడు

దర్శించిన పుణ్యక్షేత్రములను, రెండవది యాదవ పరాజయానంతరము సుభద్రార్జునులు కావించిన ప్రయాణమును వర్ణించుచున్నవి మూఁడవది ద్వితీయాశ్వాసమున నున్నది. యతి యర్జునుఁడే యని యెఱింగిన పిమ్మట సుభద్ర వ్రీడాపరవశయై యాతని విడిచిపోయిన సందర్భమున విది వ్రాయఁబడినది. ఇందుఁ గవి సుభద్ర సిగ్గుతోఁ జెఱలనరయు వెపంబునఁ బరాకుచేసికొని సవిలాసముగా నరిగిన వైఖరిని జక్కఁగా వర్ణించియుండెను

వేంకటకవి విజయవిలాసమున సుందరములైన జాతీయములను సామెతలను సందర్భోచితముగాఁ బెక్కుచోట్ల వాడియుండెను. అవి యాతని లోకజ్ఞతను నౌచిత్య పరిజ్ఞానమును లెస్సఁగాఁ బ్రకటించుచున్నవి.

శివుఁడిటురమ్మటంచు దయచేసినచోఁ దలకెక్కి యుగ్రపై
భవమునఁ జూచువోనదుగువట్టితి వేమనవచ్చునీగుణం
బవునవు నందినన్ సిగయు నందకయున్నను గాళ్లుపట్టు కొం
దువు హరిణాంక, వేలకొలఁదుల్ గద నీవదకల్ దలంపఁగన్.
వేగునంతకు వలవంత వేగునంత
నంతిపురమునఁ బ్రమద వనాంతరమునఁ
గృష్ణకృష్ణా యటంచు నాకీరవాణి
రామరామా! యటంచు నారాజసుతుఁడు

చేసె జపమతఁడు కడు వి
శ్వాసము చెలిచూపు చేడినలపై విగుడన్
జేసిన యతిజపమున్ మఱి
చేసిన యదిగాలమనుట వృథగాకుండఁగా.

మున్నగునవి యిందుకు దృష్టాంతములు. పైవాని యందలి శ్లేషధ్వని చమత్కారములఁ బరిశీలించినచో సామాన్యములైన సామెతలనే యాతఁడెంత భావగర్భితములైన వానిఁగా సంతరించెనో తెలియవచ్చును. 'నదుఃఖం పంచభిస్సహ' యను సంస్కృతలోకోక్తిని గూడ సీతఁడు నందాదుల వృత్తాంతములో నొక్కచో జక్కఁగా నిమిడించియుంచెను. దిసంతులదఁచు, వలపు పద్దిఁ గాఁబు. తెలివి రాజను మున్నగు జాతీయ ప్రయోగములు విజయవిలాసమునందంతటను లెక్కకు మిక్కిలిగాఁ గన వచ్చును. కావ్యమునందలి యేపద్యము నెత్తిచూపినను సందర్భోచిత ముగాఁ జేయఁబడిన యిట్టి జాతీయప్రయోగము లొందో రెండో యెదుర పడుచునేయుండును.

విజయ విలాసమున వ్యాకరణ విశేషములు కొన్ని కానవచ్చుచు న్నవి. వానిలోఁ గ్త్వార్థకేకారములకు సంధిచేయుట (అడిగిచ్చునో— అటు చూపిటు విటు చూపటు, అనవలనంటి, వట్టానించు), షష్ఠీసమాస మున నుత్తునకచ్చు పరమైనపుడు నుగాగమముచేయకుండుట (వెన్నుని అన్నన్న, మొగమందము), స్త్రీవాచకముల యత్తునకు సంధిచేయుట (ఈ బిడారు) మున్నగునవి ముఖ్యములైనవి. ఇందుఁ గొన్ని యమ కాదులనిమిత్తమై కలిగినట్టివి ఇవికాక సిగ్గుకు, వాదుకు మున్నగునగా గము రాని ప్రయోగములును. ఆత్మనే పదార్థకమైన కొనునకు క యవి వాదిన (ఊదుకపోవు) వంటి ప్రయోగములును, అచ్చునకు లోపము కలిగించినంశ్లేషము సంఘటించిన చాల్నిలువంటి ప్రయోగములును మఱికొన్ని రెండుమూఁడుచోట్లఁ గలవు. కవిత్రయేతర కావ్యములం దిట్టి ప్రయోగములు లేకపోలేదు. మఱియు జీవద్భాషలందుఁ గాలక్రమ మున నిట్టి మార్పులు వచ్చుటలో నాశ్చర్యమును లేదు. ఇట్టివైనను విజయవిలాసమున మొత్తము పది పండ్రెండుకంటె హెచ్చులేవు.

ప్రయుక్తములైన యిట్టి ప్రయోగముల నారసి యట్టివానికి సూత్రములు కల్పింపకపోవుట వ్యాకరణకారుల లోపమే కాని కవుల లోపముకాదు. ఇంతమాత్రముచే వేంకటకవి లాక్షణికుఁడుకాకపోఁడు.

వేంకటకవి శబ్దాలంకార ప్రీతికలవాఁడని మొదలే విన్నవించితిని. మనపూర్వ లాక్షణికులు కొందఱును, గొందఱు పాశ్చాత్య విమర్శకులును శబ్దచిత్రముతోఁ గూడిన కావ్యముల నుత్తమ కావ్యములుగాఁ బరిగణించి యుండలేదు. కావ్యములు రసధ్వనిప్రధానమైనవి. శబ్దాలంకారము ననతిమాత్రముగా వాడినచో నొక్కొక్కప్పుడు రసపోషణమున కంతరాయము సంభవింపవచ్చును. ఇట్లుగాక వాడిన శబ్దాలంకారములచే రసమునకుఁగాని యౌచిత్యమునకుఁగాని యెయ్యెదను భంగము వాటిల్లనీయకుండుటేకాక యొక్కొక్కచోట మెఱుఁగెక్కించు కవుల నుత్తములుగా నేల పరికింపరాదో నాకుఁ దెలియని విషయము. శబ్దాలంకారముల వాడినంతమాత్రమున నేకవియైన యధముఁడగుననుటలో సామంజస్యము లేదు. అతఁడా యలంకారములకు రసాదులను బలియొసంగుచో నప్పుడాతని కావ్యమును నిరసింపవచ్చును. రసాదిపోషణముతోపాటు శబ్దాలంకార ప్రయోగమును గూడఁ జక్కఁగఁ జేయనేర్చు కవి శేముషీవిభవమును మఱింత మెచ్చుకొనవలయును. ఆంధ్ర వాఙ్మయమున నిట్టి మహాకవులిద్దరు కలరు. ఒకఁడు రామరాజభూషణుఁడు; రెండవవాఁడు వేంకటరాజు. ఇట్టి యద్వితీయ ప్రతిభాపాటవమును జూపుటలో వారికి వారే సాటి. వారి కవిత బుద్ధిని, హృదయమును రెండింటి నాకర్షించి యోహోయని యాశ్చర్యమును నాహా యని యానందమును నొకేమాఱు కల్గించుచుండును.